AKSHITHA TV
ప్రతిక్షణం... ప్రజాపక్షం
www.aakshitha.com
People's voice
అక్షిత
జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY
epaper.aakshitha.com




akshithanews akshithatelugudaily

సంపుటి : 15 సంచిక : 91 | గురువారం 9, జనవరి 2025 | చీఫ్ ఎడిటర్ : యం.దాస్ | నల్లగొండ | హైదరాబాద్ | ఖమ్మం | వరంగల్ | మహబూబ్‌నగర్ | అమరావతి | ఉత్తరాంధ్ర | పేజీలు : 8 , + ట్యాబ్ 8 వెల : రూ.5.00

# చంద్రబాబు లక్ష్యాలకు అండగా ఉంటా

- భుజంభుజం కలిపి అభివృద్ధి కోసం నడుస్తా
- ప్రజల ఆశలు,ఆశయాల సాధనకు మద్దతు ఇస్తా
- రూ.2.08 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- 2047 నాటికి 2.5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం
- విశాఖపట్టణం బహిరంగ సభలో ప్రధాని మోడీ వెల్లడి

4లో

ముఖ్యమంత్రి చంద్రబాబు పెట్టుకున్న లక్ష్యాలకు తాము ఎప్పుడూ అండగా ఉంటామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భరోసా ఇచ్చారు. రాష్ట్ర ప్రజల ఆశలు, ఆశయాల సాధనకు మద్దతుగా నిలుస్తామని మోదీ హామీ ఇచ్చారు. ఏపీలో రూ.2.08 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా విశాఖ ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు.








## రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్సలు

వార్త 2లో




## ఢిల్లీలోని సీఎం బంగ్లా వద్ద హైడ్రామా

వార్త 2లో



## స్పేస్ నిర్మాణానికి ప్రధాని గ్రీన్ సిగ్నల్ : ఇస్రో కొత్త చీఫ్

వార్త 2లో



## రైల్వేస్టేషన్లు, విమానాశ్రయాల వద్ద హెచ్ఎంపీవీపై స్క్రీనింగ్ టెస్టులు

వార్త 2లో

## విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్‌లో గొడ్డుకారం బాధాకరం : కేటీఆర్

హైదరాబాద్, అక్షిత ప్రతినిధి :

మహాత్మాగాంధీ యూనివర్సిటీలోని హాస్టల్‌లో విద్యార్థినులకు బ్రేక్‌ఫాస్ట్‌కు బదులు గొడ్డుకారం అన్నం పెట్టడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ స్కూల్ పిల్లలకు పౌష్టికాహారం కింద ఉప్పు, కారం, బియ్యం.. ఈ అమానవీయ పరిస్థితిపై స్పందించగల జాతీయ లేదా ప్రాంతీయ మీడియాకు ఈ శీర్షికను సూచిస్తున్నామని కేటీఆర్ తెలిపారు. హాస్టల్ విద్యార్థినులకు గొడ్డు కారంతో భోజనం పెట్టడంపై కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీపైనా కేటీఆర్ విమర్శలు గుప్పించారు. ప్రియాంక గాంధీ 2019లో ఆమె చేసిన ప్రకటనను గుర్తు చేసుకుని తెలంగాణ విద్యార్థులకు లబ్ధి చేకూర్చాలని సూచించారు. లేదా యూపీలో జరిగినప్పుడే దీన్ని జాతీయ సమస్యగా పరిగణిస్తారా? వేరే రాష్ట్రంలో జరిగిన అలాగే చూస్తారా అని నిలదీశారు.



## ప్రాణాలు కాపాడే పోలీసులకే రక్షణ లేదు

### రిటైర్మెంట్ ఉద్యోగులకు శాపంగా కాంగ్రెస్ : హరీశ్‌రావు

హోంమంత్రిగా కూడా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారూ.. మీ పాలనలో ప్రజల ప్రాణాలు కాపాడిన పోలీసుల జీవితాలకే 'భద్రత' లేకుండా పోవడం సిగ్గు చేటు అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు.



వార్త 2లో



## కేటీఆర్‌కు హైకోర్టులో మరోమారు చుక్కెదురు

వార్త 2లో

లాయర్‌తో విచారణ కుదరదన్న ధర్మాసనం
కనుచూపు మేరలో లాయర్ ఉండేలా అనుమతి
ఎసిబి విచారణకు సహకరించాలని సూచన

## సిఎం రేవంత్‌తో పుల్లెంల గోపీచంద్ భేటీ

### క్రీడాభివృద్ధికి సహకారం అందిస్తానని హామీ

హైదరాబాద్, అక్షిత ప్రతినిధి

సిఎం రేవంత్ రెడ్డిని ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. స్పోర్ట్‌పై రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని గోపీచంద్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. స్పోర్ట్ యూనివర్సిటీ, స్పోర్ట్ అకాడమి ద్వారా క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడం శుభ పరిణామని గోపీచంద్ అభిప్రాయపడ్డారు. క్రీడాభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని గోపీచంద్ తెలిపారు.





## కేసులు అసలు సమస్యే కాదు

వార్త 2లో

# రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్సలు

## కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కీలక ప్రకటన

**న్యూఢిల్లీ, అక్షిత ప్రతినిధి :**

కేంద్ర రోడ్డు రవాణ శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కీలక పథకాన్ని ప్రకటించారు. రోడ్డు ప్రమాదానికి గురైన బాధితులకు నగదు రహిత చికిత్సను అందించేందుకు ప్రత్యేక పథకాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఎవరైనా రోడ్డు ప్రమాదంలో గాయపడితే చికిత్సకు అయ్యే ఖర్చులో గరిష్ఠంగా రూ.1.50 లక్షలు ఈ పథకం ద్వారా ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. అయితే ఇది మొదటి ఏడు రోజుల చికిత్సకు అయ్యే బిల్లుకు మాత్రమే వర్తిస్తుందని పేర్కొన్నారు. ప్రమాద ఘటన జరిగిన 24 గంటల్లోగా పోలీసులకు సమాచారాన్ని అందిస్తేనే ఈ స్కీం ద్వారా నగదు రహిత చికిత్సను పొందొచ్చని గడ్కరీ స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ పథకాన్ని పైలట్ ప్రాజెక్ట్ కింద పలు రాష్ట్రాల్లో అమలు చేస్తున్నట్లు చెప్పారు. 2025 మార్చి నాటికి దేశవ్యాప్తంగా ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా హిట్ అండ్ రన్ కేసుల్లో చనిపోయిన వారి కుటుంబాలకు రూ.2 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియాను అందిస్తామని గడ్కరీ తెలిపారు. పలు రాష్ట్రాల రవాణా శాఖ మంత్రులతో కేంద్ర మంత్రి గడ్కరీ మంగళవారం సమావేశమయ్యారు. సమావేశం అనంతరం ఢిల్లీలోని భారత్ మండపంలో మీడియాతో మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలకే తమ మొదటి ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. 2024లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 1.8 లక్షల మంది చనిపోయారని.. అందులో 30 వేల మంది హెల్మెట్ పెట్టుకోకపోవడం వల్లే మరణించినట్లు తెలిపారు. మృతుల్లో 66 శాతం మంది 18 నుంచి 34 ఏండ్ల మధ్య వయస్సుగల వారే ఉండటం బాధాకర విషయమన్నారు. ఇక స్కూళ్లు, కాలేజీల్లో ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల తప్పుల వల్ల 10,000 మంది పిల్లలు చనిపోయారని గడ్కరీ వివరించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని వ్యక్తులు వాహనాలు నడపడం వల్ల మూడు వేల మంది మరణించినట్లు తెలిపారు.

# ఢిల్లీలోని సీఎం బంగ్లా వద్ద హైడ్రామా

## ఆప్ నేతలను అడ్డుకున్న పోలీసులు

**న్యూఢిల్లీ, అక్షిత ప్రతినిధి :**

దేశ రాజధాని ఢిల్లీలోని సీఎం బంగ్లా వద్ద హైడ్రామా నెలకొన్నది. అరవింద్ కేజ్రీవాల్ సీఎంగా ఉన్నప్పుడు షీష్ మహల్ ఆధునీకరణంలో భాగంగా టాయిలెట్‌లో గోల్డెన్ కమోడ్, స్విమ్మింగ్ పూల్, మినీ బార్ వంటివి ఏర్పాటు చేసుకున్నారని బీజేపీ ఆరోపించింది. ఢిల్లీలో అధికారంలో ఉన్న ఆప్ దీనిని ఖండించింది. ఈ నేపథ్యంలో బుధవారం రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్, ఢిల్లీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ మీడియాతో కలిసి ఆ బంగ్లా వద్దకు వెళ్లారు. బీజేపీ ఆరోపణలు తప్పని నిరూపించేందుకు, 6 ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్‌లోని బంగ్లాలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించారు. అయితే అక్కడ భారీగా మోహరించిన పోలీసులు ఆప్ నేతలను అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో వారు అక్కడ బైఠాయించి నిరసన తెలిపారు. కాగా, ఈ సందర్భంగా ఆప్ నేతలు సంజయ్ సింగ్, సౌరభ్ భరద్వాజ్ బీజేపీపై మండిపడ్డారు. ఆ పార్టీ అబద్ధాలు బయటపడ్డాయని అన్నారు. 'సీఎం నివాసంలో బంగారు మరుగుదొడ్డి, స్విమ్మింగ్ పూల్, మినీ బార్ ఉన్నాయంటూ బీజేపీ నేతలు కొన్ని నెలలుగా గోల చేస్తున్నారు. ఇవాళ మీడియాతో పాటు ఇక్కడకు వచ్చాం. బీజేపీ నేతలు కూడా రావాలని కోరాం. వారు చెప్పిన బంగారు మరుగుదొడ్లు, స్విమ్మింగ్ పూల్ ఎక్కడ ఉన్నాయో చూడాలనుకున్నాం. అయితే పోలీసులు, వాటర్ ఫిరంగులను మోహరించారు. లోనికి అనుమతిస్తే అసలు నిజం బయటపడేది' అని అన్నారు. మరోవైపు ప్రధాని మోదీ అధికార నివాసం 'రాజ్ మహల్' అని ఆప్ నేతలు విమర్శించారు. దీని కోసం రూ.2,700 కోట్లు ఖర్చు చేశారని ఆరోపించారు. దమ్ముంటే ప్రజా ధనంతో నిర్మించిన ప్రధాని లగ్జరీ హౌస్‌లోకి మీడియాను అనుమతించాలని బీజేపీకి సవాల్ చేశారు. ఆప్ నేతలు సంజయ్ సింగ్, సౌరభ్ భరద్వాజ్ ఆ తర్వాత ప్రధాని నివాసం వైపు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు.

# స్పేస్ నిర్మాణానికి ప్రధాని గ్రీన్ సిగ్నల్ : ఇస్రో కొత్త చీఫ్

**తిరువనంతపురం, అక్షిత ప్రతినిధి :**

ప్రముఖ రాకెట్ శాస్త్రవేత్త వీ నారాయణన్‌ను ఇస్రో చీఫ్‌గా నియమించిన విషయం తెలిసిందే. ఇస్రో చాలా విజయవంతమైన దశలో ఉన్నదని, చంద్రయాన్-4తో పాటు గగన్‌యాన్ మిషన్లు తమ ముందు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఇస్రో చైర్మెన్‌తో పాటు అంతరిక్ష శాఖ కార్యదర్శిగా నియమితుడైన సందర్భంగా వీ నారాయణన్ సంతోషం వ్యక్తం చేశారు. ఎంతో మంది గొప్ప శాస్త్రవేత్తల నాయకత్వంలో సంస్థ కీర్తిగాంచిందని, అలాంటి సంస్థలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇస్రో చాలా గొప్ప సంస్థ అని, గతంలో అనేక మంది గొప్ప నేతలు దీన్ని నడిపించారని, ఈ సంస్థలో భాగస్వామ్యం కావడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఓ ప్రశ్నకు బదులిస్తూ.. తన నియామకం గురించి తొలుత ప్రధాన మంత్రి కార్యాలయం నుంచి ఫోన్ వచ్చినట్లు వీ నారాయణన్ చెప్పారు. ప్రధానియే అన్నీ డిసైడ్ చేస్తున్నారని, పీఎంవో తనను కాంటాక్ట్ అయ్యిందని, ప్రస్తుతం ఇస్రో చైర్మెన్ ఎస్ సోమనాథ్ కూడా తనకు ఫోన్ కాల్ చేశారని, కొత్త అపాయింట్మెంట్ గురించి చెప్పినట్లు ఆయన వెల్లడించారు. త్వరలో చేపట్టబోయే ఇస్రో ప్రాజెక్టుల గురించి మాట్లాడుతూ.. ఇస్రో చాలా కీలకమైన మిషన్లను చేపడుతున్నదని, ప్రస్తుతం ఇస్రో విజయవంతమైన దశలో వెళ్తోందన్నారు. చేపట్టబోయే ప్రాజెక్టుల గురించి వివరిస్తూ.. స్పేడెక్స్ మిషన్‌ను డిసెంబర్ 30వ తేదీన చేపట్టామని, జనవరి 9వ తేదీన స్పేడెక్స్ శాటిలైట్ల డాకింగ్ జరగనున్నట్లు ఆయన తెలిపారు. గగన్‌యాన్ కూడా ఇస్రో ముందున్న అతిపెద్ద ప్రోగ్రామ్ అని పేర్కొన్నారు. క్రూ లేకుండా మాడ్యూల్‌ను ప్రయోగించే దాని కోసం ఇస్రోలో పనులు జరుగుతున్నాయన్నారు. జీఎస్ఎల్వీ ద్వారా ఎన్వీఎస్ 02 నావిగేషన్ శాటిలైట్ను పంపేందుకు శ్రీహరికోటలో వర్క్ జరుగుతోందన్నారు. ఇస్రో మాక్ 3 వెహికిల్ ద్వారా అమెరికాకు చెందిన కమర్షియల్ శాటిలైట్‌ను కూడా ప్రయోగించనున్నారు. గగన్‌యాన్ రాకెట్ అసెంబ్లింగ్‌కు చెందిన పనులు కూడా శ్రీహరికోట్లో ప్రోగ్రెస్ అవుతున్నాయి. చంద్రయాన్3 ద్వారా చంద్రుడి దక్షిణ ధ్రువంపై ల్యాండ్ అయిన విషయం అందరికీ తెలిసిందే అన్నారు. చంద్రయాన్ 4 ద్వారా ఆ ప్రదేశంలో చంద్రుడిపై ల్యాండ్ అయి, శ్యాంపిళ్లు సేకరించిన తర్వాత మళ్లీ తిరిగి వచ్చే రీతిలో పనులు జరుగుతున్నాయన్నారు. భారత స్పేస్ స్టేషన్‌ని సెటప్ చేసేందుకు ప్లాన్ జరుగుతోందన్నారు. స్పేస్ స్టేషన్ నిర్మాణం కోసం ప్రధాని మోదీ అనుమతి కూడా తమకు దక్కిందన్నారు. స్పేస్ స్టేషన్‌కు అయిదు మాడ్యూళ్లు ఉంటాయని, 2028లో స్పేస్ స్టేషన్‌కు తొలి మాడ్యూల్‌ను లాంచ్ చేసే రీతిలో అనుమతి దక్కిందన్నారు.

# కేటీఆర్ లంచ్‌మోషన్ పిటిషన్‌కు కోర్టు అనుమతి

**హైదరాబాద్, అక్షిత ప్రతినిధి :**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లంచ్ మోషన్ పిటిషన్‌కు హైకోర్టు అనుమతినిచ్చింది. ఫార్ములా ఈ కార్ రేస్ వ్యవహారంలో ఈ నెల 9వ తేదీన విచారణకు రావాలని ఏసీబీ నిన్న నోటీసులు పంపించింది. అయితే ఈ విచారణకు లాయర్లతో హాజరయ్యేందుకు అనుమతించాలని కేటీఆర్ లంచ్ మోషన్ పిటిషన్ వేశారు. కేటీఆర్ వేసిన లంచ్ మోషన్ పిటిషన్‌కు హైకోర్టు అంగీకరించింది. మధ్యాహ్నం 2.30 గంటలకు ఈ పిటిషన్‌పై విచారణ జరుపుతామని తెలిపింది. కాగా, ఫార్ములా ఈ-కార్ రేస్‌పై అసెంబ్లీ సమావేశాల్లో చర్చ పెట్టాలని కోరితే ముఖ్యమంత్రి ఎందుకు పారిపోయారని, రేవంత్‌రెడ్డికి దమ్ముంటే.. ఆయ న జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లో మీడియా సమక్షంలో చర్చ పెడితే తాను రెడీ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ చేశారు. ఆ తర్వాత ఏసీబీ విచారణకైనా, ఈడీ విచారణకైనా సిద్ధమేని స్పష్టంచేశారు. రాజ్యాంగం, న్యాయస్థానాలు, న్యాయమూర్తులపై తమకు సంపూర్ణ విశ్వాసం ఉన్నదని, తనపై మోపిన అక్రమ కేసులపై న్యాయస్థానాల్లోనే కొట్లాడుతామని తేల్చిచెప్పారు. ఈ కేసులు ఆరంభం మాత్రమేనని, నాలుగేండ్లలో ఇంకా ఎన్ని కేసులు పెట్టినా ఎదురొంటామని, దేశానికి రక్షణ కవచంలా న్యాయ వ్యవస్థ ఉన్నదని పేర్కొన్నారు. 'నిజాయితీకి ధైర్యం ఎకువ.. రోషంగల్ల తెలంగాణ బిడ్డగా ఏ విచారణనైనా ఎదురొనేందుకు సిద్ధం' అని చెప్పారు. లాయర్లతో విచారణకు బుధవారం హైకోర్టు అనుమతిస్తే 9న ఏసీబీ విచారణకు లాయర్లతో వెళ్తానని తెలిపారు.

# ప్రాణాలు కాపాడే పోలీసులకే రక్షణ లేదు

## రిటైర్మెంట్ ఉద్యోగులకు శాపంగా కాంగ్రెస్ : హరీశ్‌రావు

**హైదరాబాద్, అక్షిత ప్రతినిధి :**

హోంమంత్రిగా కూడా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారూ.. మీ పాలనలో ప్రజల ప్రాణాలు కాపాడిన పోలీసుల జీవితాలకే 'భద్రత' లేకుండా పోవడం సిగ్గు చేటు అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. రిటైర్డ్ పోలీసు ఉద్యోగి సాధిక్ అలీ 8 నెలల నుంచి తనకు రావాల్సిన బెనిఫిట్స్ కోసం ఎదురుచూస్తున్నానని, ఇక అతహత్యే శరణ్యం అంటూ ఆవేదన చెందుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. కాంగ్రెస్ పాలన అన్ని వర్గాలతో పాటు రిటైర్మెంట్ ఉద్యోగులకు కూడా శాపంగా మారిందని హరీశ్‌రావు విమర్శించారు. విశ్రాంత జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా గడిపే రోజుల్లో వారిని మానసిక క్షోభకు గురి చేయడం హేయమైన చర్య అని మండిపడ్డారు. దాదాపు 7,000 మంది ప్రభుత్వ ఉద్యోగులు వారికి హక్కుగా రావాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం ఏడాది కాలంగా ఎదురుచూస్తున్నా, ప్రభుత్వం పట్టించుకోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. కోర్టుకు వెళ్లి ఆర్డర్ తెచ్చుకుంటే గాని రిటైర్మెంట్ బెనిఫిట్స్ పొందలేని దుస్థితికి విశ్రాంత ఉద్యోగులను నెట్టడం శోచనీయమని విమర్శించారు.

# రైల్వేస్టేషన్లు, విమానాశ్రయాల వద్ద హెచ్ఎంపీవీపై స్క్రీనింగ్ టెస్టులు

**న్యూఢిల్లీ, అక్షిత ప్రతినిధి :**

దేశంలో హెచ్ఎంపీవీ కేసులు పెరుగుతున్నాయి. ఇప్పటి వరకు వైరస్ ఏడుగురికి పాజిటివ్‌గా తేలింది. కేసులు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. రైల్వేస్టేషన్లు, విమానాశ్రయాల వద్ద పర్యవేక్షించాలని ఆదేశాలు జారీ చేసింది. దేశంలో హెచ్ఎంపీవీ ఇన్ఫెక్షన్ పెరుగుదల నేపథ్యంలో సివిల్ సర్జన్లందరికీ ఒక సలహా జారీ చేసినట్లు హర్యానా ఆరోగ్య మంత్రి ఆర్టీ సింగ్‌రావు తెలిపారు. హర్యానాలో ఇప్పటివరకు ఒక్క హెచ్ఎంపీవీ కేసు రికార్డవలేదని.. అయితే, ఆరోగ్య శాఖ అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. హెచ్ఎంపీవీ ముప్పు నేపథ్యంలో ప్రభుత్వాలు నిఘాను పెంచాయి. రైల్వేస్టేషన్లు, విమానాశ్రయాలతో పాటు రద్దీగా ఉండే ప్రాంతాల్లో స్క్రీన్ చేస్తున్నారు. దగ్గు, జలుబుతో ఆసుపత్రులకు వచ్చే రోగులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. వాటిని స్క్రీన్ చేయడంతో పాటు పలు రాష్ట్రాల్లో రోగులను ఉంచేందుకు ఐసోలేషన్ వార్డులను సైతం సిద్ధం చేస్తున్నారు. హ్యూమన్ మెటాప్ న్యూమో వైరస్ శ్వాసకోశ వ్యవస్థలో సమస్యలను కలిగిస్తుంది. రోగనిరోధక వ్యవస్థ బలంగా లేని వ్యక్తులకు ప్రమాదకరం. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులతో పాటు అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తుల్లో ఎక్కువగా వ్యాప్తి చెందేందుకు అవకాశం ఉంది.

# కేటీఆర్‌కు హైకోర్టులో మరోమారు చుక్కెదురు

## లాయర్‌తో విచారణ కుదరదన్న ధర్మాసనం

## కనుచూపు మేరలో లాయర్ ఉండేలా అనుమతి

## ఎసిబి విచారణకు సహకరించాలని సూచన

**హైదరాబాద్, అక్షిత ప్రతినిధి :**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు తెలంగాణ హైకోర్టులో చుక్కెదురయ్యింది. ఎసిబి విచారణలో లాయర్‌ను అనుమతించేది లేదని స్పష్టం చేసింది. అయితే లాయర్ కనుచూపు మేరలో ఉండేలా మాత్రం హైకోర్టు అనుమతించింది. కేటీఆర్ వేసిన లంచ్ మోషన్ పిటిషన్‌పై బుధవారం మధ్యాహ్నం 4 గంటలకు ధర్మాసనం విచారణ చేపట్టింది. ఫార్ములా-ఈ కార్ రేస్ వ్యవహారంలో ఏసీబీ నమోదు చేసిన కేసు విచారణలో తనతోపాటు న్యాయవాది ఉండాలంటూ కేటీఆర్ కోరడాన్ని కోర్టు ఆక్షేపించింది. కేటీఆర్‌తోపాటు లాయర్ ఉండేందుకు హైకోర్టు నిరాకరించింది. విచారణ సమయంలో లాయర్‌తో కలిసి కూర్చునే అవకాశం లేదని తేల్చి చెప్పింది. సీసీ టీవీ పర్యవేక్షణ లేదా కేటీఆర్ కనిపించేంత దూరంలో న్యాయవాది ఉండేందుకు అనుమతి ఇచ్చింది. ఏసీబీ అధికారులు విచారణ చేస్తున్నప్పుడు న్యాయవాది రాంచందర్‌రావు విజిబుల్ డిస్టెన్స్‌లో ఉండేందుకు హైకోర్టు అంగీకరించింది. నేరుగా కేటీఆర్ పక్కన విచారణలో పాల్గొనేందుకు నిరాకరించింది. రేపు ఏసీబీ అధికారుల ఎదుట విచారణకు హాజరుకావాలని కేటీఆర్‌కు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. విచారణపై అభ్యంతరాలు ఉంటే మళ్లీ కోర్టుకు రావొచ్చని తెలిపింది. విచారణ సందర్భంగా న్యాయమూర్తికి కేటీఆర్ వెంట వెళ్లే లాయర్ పేరును న్యాయవాది ప్రభాకర్ రావు తెలిపారు. కేటీఆర్ వెంట మాజీ అడ్వకేట్ జనరల్ జే రామచంద్రరావు వెళ్తారని న్యాయమూర్తికి తెలిపారు. కేటీఆర్‌కు కనిపించే దూరంలో న్యాయవాది ఉంటారని జడ్జి చెప్పారు. కేటీఆర్‌ను ఒక గదిలో, లాయర్‌ను ఒక గదిలో కూర్చోబెట్టి.. విచారణ కనిపించేలా చర్యలు తీసుకోవాలని కోర్టు ఏఏజీకి సూచించింది. లైబ్రరీ విండో నుంచి కేటీఆర్ విచారణను చూడొచ్చని ఏఏజీ కోర్టుకు తెలిపారు. ఇక కేటీఆర్ విచారణను ఆడియో, వీడియో రికార్డు చేయాలని ఆయన తరపు న్యాయవాది కోర్టును కోరారు. ఇందుకు హైకోర్టు నిరాకరించింది. సీసీటీవీ పర్యవేక్షణలో కేటీఆర్‌ను విచారించాలని కోర్టు ఆదేశించింది.

# కేసులు అసలు సమస్యే కాదు

## ఫార్ములా కేసులో పైసా అవినీతి లేదు

## న్యాయం కోసం సుప్రీంలో నేను కొట్లాడుతా

## రైతు, ప్రజా సమస్యలపై పార్టీ శ్రేణులు కొట్లాడాలి

## బిఆర్ఎస్ డైరీ ఆవిష్కరణలో కెటిఆర్ పిలుపు

**హైదరాబాద్, అక్షిత ప్రతినిధి :**

: కేసులు అసలు సమస్యే కాదు. రైతు భరోసా విషయంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని ప్రజలకు వివరంగా చెప్పాలి. ఈ కేసుపై నేను పోరాడతాను. భారాస నేతలు కేసు గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. నేను తప్పు చేయలేదు.. ఎవరికీ భయపడను' అని పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో భారాస డైరీని ఆ కేటీఆర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు, నేతలు హాజరయ్యారు. అనంతరం పార్టీ నేతలను ఉద్దేశించి కేటీఆర్ మాట్లాడారు. ఫార్ములా ఈరేసు కేసు గురించి నేను చూసుకుంటాను. ఏసీబీ కేసు పెద్ద విషయం కాదు. నా కేసుల గురించి ఆందోళన, ఇబ్బంది లేదు' అని అన్నారు. సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేస్తానని తెలిపారు. ఈ రేసులో ఒక్క పైసా కూడా అవినీతి జరగలేదని వెల్లడించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు రైతు, ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని పిలుపు నిచ్చారు. 2025లో బీఆర్ఎస్‌కు కొత్త కమిటీలు పూర్తి చేస్తామన్నారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి కమిటీలు నియమిస్తామన్నారు. ఈఏడాది పార్టీ అధ్యక్షుడిని ఎన్నుకుంటామని తెలిపారు. జిల్లాల్లోనే పార్టీ క్యాడర్‌కు శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. తెలంగాణ ప్రయోజనాల



కోసం బీఆర్ఎస్‌ను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రైతన్నకు జరుగుతోన్న మోసాన్ని ప్రజలకు వివరించాలని.. మెత్తంగా 30 శాతం రుణమాఫీ మాత్రమే జరిగిందని కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ'2001లో కేసీఆర్ పార్టీ పెట్టిన నాడు ఉన్న ఇబ్బందులతో పోల్చితే ఇప్పుడు ఉన్నవి పెద్దవి కాదు. ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ బిడ్డగా, ఆయన తయారు చేసిన సైనికుడిగా నేను ఎంతో ధైర్యంగా ఉంటా. తెలంగాణలో 90 లక్షల మంది మహిళలకు నెలకు రూ. 2,500 ఇస్తున్నట్లు ఢిల్లీ కాంగ్రెస్ నేతలు అబద్ధాలు చెబుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ.. ఆనాడు డైరీ ఆవిష్కరణలు ఉద్యమ కేంద్రాలుగా ఉండేవని... నేటి డైరీ ఆవిష్కరణ తిరిగి బీఆర్ఎస్‌ను అధికారంలోకి వచ్చేందుకు ఉపయోగపడుతుందని అన్నారు. రేవంత్ రెడ్డి సంవత్సర కాలంగా చేసింది ఎగవేతలు, కేసులే అని వ్యాఖ్యలు చేశారు. ఎనుముల రేవంత్ రెడ్డి కాదు.. ఎగవేతల రేవంత్ రెడ్డి అంటూ ఎద్దేవా చేశారు. డైవర్షన్‌లు తప్ప రేవంత్ రెడ్డి చేసింది ఏమిలేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసమే రైతు భరోసా వేస్తారని ఆరోపించారు. అధికారంలోకి రాగానే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెన్షన్‌లు పెంచిందన్నారు. ఎవరు ప్రశ్నిస్తే వాళ్ళ మీద కేసులు పెట్టి అణిచివేసే ప్రయత్నం చేస్తున్నారు అంటూ ముఖ్యమంత్రిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి భూములకు ఆరులైన్ల రోడ్లు వేసుకుంటున్నారని.. అప్పులపై



అసెంబ్లీలోనే ప్రభుత్వం నోరు మూయించామన్నారు. లగచర్ల రైతులకు అండగా కేటీఆర్ నిలబడ్డారని.. కేటీఆర్ ఉద్యమకారుడు, కార్యకర్తే అని తెలిపారు. ఆయనకు ఆపద వస్తే పార్టీ అంతా అండగా ఉండాలని కోరారు. కేటీఆర్‌పై అక్రమ కేసు పెట్టి అన్యాయంగా ఇరికించే ప్రయత్నం చేస్తున్నారు. దృష్టి మళ్లింపు తప్ప ప్రజలకు రేవంత్ రెడ్డి చేసిందేమీ లేదు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఒక్కసారి రైతు భరోసా ఇచ్చి మళ్లీ ఎగ్గొడతారు. ఢిల్లీకి కమీషన్లు పంపేందుకు డబ్బులు ఉన్నాయి కానీ... పేదలకు ఇవ్వడానికి డబ్బులు లేవంటున్నారు. ప్రశ్నించినందుకే కేటీఆర్‌పై అక్రమ కేసులు పెడుతున్నారని హరీశ్‌రావు అన్నారు.





# ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించండి

## వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా





**వరంగల్, అక్షిత బ్యూరో:**

ప్రజలు అందించే ఫిర్యాదులపై అధికారులు సత్వరమే స్పందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా నర్సంపేట ఏసిపి కార్యాలయమును వరంగల్ పోలీస్ కమిషనర్ బుధవారం తనిఖీ చేసారు. తనిఖీ భాగంగా ఏసిపి కార్యాలయమునకు చేరుకున్న పోలీస్ కమిషనర్‌కు పోలీస్ అధికారులు మొక్కను అందజేసి స్వాగతం పలికారు.సాయుధ పోలీసులు గౌరవ వందనం చేసారు. అనంతరం ఏసిపి కార్యాలయము నకు సంబంధించిన రికార్డులను పరిశీలించడంతో పాటు, ఏసిపి అధ్వర్యంలో దర్యాప్తు జరిగిన కేసుల ప్రస్తుత స్థితిగతులపై పోలీస్ కమిషనర్ అరా తీసారు.పాటు, గ్రేవ్ కేసుల్లో నిందితుల అరెస్టు, దర్యాప్తు జరుగుతున్న తీరును పోలీస్ కమిషనర్ ఏసిపి కిరణ్ కుమార్ ను అడిగి తెలుసుకొవడంతో పాటు, పెండింగ్‌లో వున్న ఎస్సీ,ఎస్టీ కేసులు, ఇతర గ్రేవ్ కేసుల వివరాలకు సంబంధించిన రికార్డులతో పరిశీలించడంతో పాటు మావోయిస్టు ప్రాబల్యంపై పోలీస్ కమిషనర్ ఆరా తీసారు. ఈ సందర్బంగా నర్సంపేట డివిజినల్ పోలీస్ అధికారులతో కమిషనర్ మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో పోలీస్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని,ప్రతి పోలీస్ స్టేషన్‌తో పాటు, బ్యాంకులు, ఇతర ప్రధాన కూడళ్ళల్లో సిసి కెమెరాలు ఏర్పాటు అధికారులు చోరవ చూపించాలని, నేరాల కట్టడి కొసం అధికారులు మరింత శ్రమించడంతో పాటు, నేరం జరిగిన వెంటనే స్టేషన్ అధికారులు వేగంగా స్పందించాలని. చట్టాలను అతిక్రమించే చర్యలకు పాల్పడే వారిని ఎట్టిపరిస్థితిలో వదలవద్దని, సమాజంలో ఏం జరుగుతోందని ఎప్పటికప్పుడు పరిశీలించడంతో పాటు, ముందస్తు సమాచార సేకరణ అవరమని, క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ, ఓపిక,సహనంతో ప్రజలు ఇచ్చే ఫిర్యాదుల పరిశీలించాలని పోలీస్ కమిషనర్ అధికారులకు తెలిపారు. ఈ సందర్బంగా పోలీస్ కమిషనర్ అధికారులతో కల్సి ఏసీపీ కార్యాలయము ప్రాంగాణంలో మొక్కలను నాటారు, ఈ తనిఖీలో ఈస్ట్ జోన్ డిసిపి రవీందర్ ఈ. ఏ.ఎస్పీ మానాన్ భట్, ఏసిపి కిరణ్ కుమార్ ,నర్సంపేట డివిజనల్ పోలీస్ అధికారులు, ఇన్స్పెక్టర్ జి. రమణ మూర్తి, దుగ్గొండి, నెక్కొండ రూరల్ సర్కిల్ ఇన్స్ స్పెక్టర్లు సాయి రమణ, చంద్రమోహన్, ఎస్.ఐ లు అరుణ్ కుమార్, రవి , మహేందర్, గోవర్ధన్, రాజేష్ రెడ్డి, రఘుపతితో పాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## భీమా చెక్కును అందచేసిన మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్.



**వరంగల్, అక్షిత బ్యూరో:**

బిఆర్ఎస్ పార్టీ 20 వ డివిజన్ కు చెందిన చల్లా చంద్రయ్య ఇటీవల ప్రమాదవ శాత్తు మరణించగా బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త కుటుంబానికి అండగా ఇచ్చే ప్రమాద భీమా రెండు లక్షల రూపాయల చెక్కును చంద్రయ్య కుటుంబ సభ్యులకు అందచేసిన తెలంగాణ రాష్ట్ర వరంగల్ తొలి మేయర్, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్. ఈ విధంగా నరేందర్ గారు మాట్లాడుతు బిఆర్ఎస్ పార్టీ ప్రతి కార్యకర్త కుటుంబాన్ని కడుపునా పెట్టుకొని కాపాడుకుంటాది, అంతే కాకుండా వరంగల్ తూర్పు లో ప్రతి కార్యకర్తకు అండగా ఉండి అన్ని విధాలుగా ఆదుకుంటా అని నరేందర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమం డివిజన్ అధ్యక్షుడు ఇక్బాల్, చిమ్మని గోపి,మండ రమేష్, కుసుమ నరేష్ తదితరులు పాల్గొన్నారు..

## మానవ సేవే మాధవ సేవ




**వరంగల్, అక్షిత బ్యూరో:**

అనురాగ్ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో కెనరాబ్యాంక్ హన్మకొండ వారి సౌజన్యంతో స్పందన మానసిక దివ్యాంగుల బధిరుల ఆశ్రమం పిల్లల సౌకర్యార్ధం 50వేల విలువైన వస్తువులు బీరువాలు వాటర్ ప్యూరిఫైయర్, బెడ్స్ అందించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కెనరాబ్యాంక్ చీఫ్ జెనరల్ మేనేజర్ చంద్రశేఖరన్ విచ్చేసి వారి చేతుల మీదుగా అందించారు, పిల్లలు పాటలు పాడి అలరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ సేవ మాధవ సేవ అని అందులో దివ్యాంగుల సేవ విశ్వమానవ సేవ అని, కెనరా బ్యాంక్ నుండి సి. ఎస్. ఆర్ ప్రాజెక్టు లో భాగంగా ఇలాంటి పిల్లల అవసరాలు తీర్చేందుకు తాము ప్రతి సంవత్సరం కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు,మరో అతిధి డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ ప్రతి కార్పొరేట్ సంస్థలు ఇలాంటి సి. ఎస్. ఆర్ ప్రాజెక్టులు చేయడానికి ముందుకు రావాలని, కెనరా బ్యాంక్ వారు ఎంతో స్ఫూర్తిగా నిలిచారని,పిల్లల అవసరాలు చెప్పగానే తీర్చి నందుకు అభినందించారు , ఈ కార్యక్రమంలో శాంతి కుమార్ మాధవి, డి. ఎమ్. సంతోష్ కుమార్, రాఘవేంద్ర, రాజ్ నారాయణ, యువజ్యోతి ఇంద్రజ, విజయకుమార్, శ్రీనివాస్,వసుధ, హరిత పాల్గొన్నారు.

## గుడిసె వాసులకు స్థలాలు కేటాయించి ఇండ్లు నిర్మించాలని ధర్నా



**వరంగల్, అక్షిత బ్యూరో:**

సిపిఐ ఎంఎల్ లిబరేషన్ వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వరంగల్ మండల ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అక్కెనపల్లి యాదగిరి సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు స్టాలిన్ నగర్ కాలనీలో పేదలు గత మూడు సంవత్సరాల కాలం నుండి గుడిసెలు నిర్మించుకొని ఉన్నారని అట్లాంటి పేదలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆధార్ కార్డు లిస్టులను అధికారులకు గతంలో ఇవ్వడం జరిగిందని వెంటనే సర్వే నిర్వహించి పేదలకు ప్రభుత్వం ద్వారా స్థలాలు కేటాయించి ఇందిరమ్మ పథకం లో ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ పథకం ద్వారా ఇండ్లు నిర్మించే దానిలో మొదటగా గుడిసవాసులకి అవకాశం కల్పించాలని నిజమైన పేదలకు కేటాయించాలని గతంలో అనేక ప్రభుత్వాలు పేదల ను పట్టించుకోలేదని కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు న్యాయం చేయాలని కోరారు లేనిపక్షంలో భవిష్యత్తులో ప్రజలందరినీ సమీకరించి ఆందోళన పోరాటాలు ఉధృతం చేస్తామని తెలియజశా రు.ఈ ధర్నా కార్యక్రమంలో స్థానిక నాయకులు రవిరాకుల ప్రసంగి జన్ను ప్రవీణ్ పట్టే మొగిలి సదయ్య సంపత్ మనీలా మాలతి నీలమ్మ హిందూ ప్రేమ్ సమ్మయ్య పాల్గొన్నారు.

## విద్యార్థులకు శ్లోకాలు



**రాజేంద్రనగర్ అక్షిత ప్రతినిధి:**

పాఠశాల ను రాజేంద్రనగర్ సైబరాబాద్ ఏ.సి.పి. శ్రీ ఏ బాలరాజు సందర్శించి గ్రౌండ్, పార్కింగ్ ఏరియా, రెస్ట్ రూమ్స్ , స్కూల్ సరౌండింగ్స్ చూసి చాలా బాగుందన్నారు .ప్రధానాచార్యులు కే శ్రీనివాస్ అర్చన పుస్తకంలోని కొన్ని శ్లోకాలను చదివి వినిపించారు విద్యార్థులకు ఇంత మంచి శ్లోకాలు పాఠశాలలో నేర్పుతున్నారా ! అని ఆశ్చర్యాన్ని వ్యక్తపరిచారు వారికి ప్రధాన ఆచార్యులు అర్చన పుస్తకాలను వారికి బహుకరించారు.భారత రాజ్యాంగ పుస్తకాన్ని చూపించారు దానిలోని పౌర విధులు పౌర హక్కులను పేజీ వారీగా స్కాన్ చేసుకున్నారు మొట్టమొదట ఈ పుస్తకాన్ని మా జీవితంలో ఇప్పుడే చూస్తున్నాం అని ఎంతో సంతోషపడ్డారు. వారు తన కిందిస్థాయి ఉద్యోగికి వెంటనే ట్రాఫిక్ సంబంధించిన సర్టిఫికెట్ కొరకు ఫైల్ వెంటనే ఫార్వర్డ్ చేయవలసిందిగా ఆదేశించారు.ఈ సందర్భంలో పాఠశాల పూర్వ విద్యార్థి పరిషత్ అధ్యక్షుడు శ్రీ ల సంతోష్ కుమార్ ఉపస్థితి అయినారు.

### ఖమ్మం సబ్ జైలును సందర్శించిన ఎంపీజే బృందం

ఖమ్మం/అక్షిత బ్యూరో :

ఖమ్మం సబ్ జైలులో జైల్ సూపరిండెంట్ శ్రీధర్ ని ఎంపీజే జిల్లా అధ్యక్షులు షేక్ ఖాసిం మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీజే క్యాలెండర్ ను అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమం లో జైలర్ లక్ష్మీ నారాయణ ఎంపీజే కోశాధికారి ఎండి హకీమ్ కార్యదర్శులు ఎండి రజబల్లి ఎస్డి రఫీక్ సభ్యులు షేక్ సొందు సాహెబ్ హుస్సేన్ మియా తదితరులు పాల్గొన్నారు.




## ముగిసిన తాండ్ర కుమార్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతుల పంపిణీ



**శేరిలింగంపల్లి అక్షిత ప్రతినిధి..**



అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో పల్లె మురళీ, శ్రీకాంత్, అరుణ్, మరియు ఎం. ఎ. నగర్ కాలనీ నుండి రాంబాబు కడుకుంట్ల, నాగార్జున కుతాడి, నరేష్ కుమార్ యాదవ్ వారి సహకారంతో రెండు రోజులుగా చందానగర్ లోని పి.జె.ఆర్ స్టేడియంలో చేపట్టిన తాండ్ర కుమార్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ సోమవారం జనవరి 06 2025 న అట్టహాసంగా ప్రారంభించి, మంగళవారం నాడు 07 జనవరి 2025 ఫైనల్ మ్యాచ్ తో ముగసింది. ఈ టోర్నమెంట్ లో 16 జట్లు పాల్గొనగా పవన్ 11 మరియు ఇలాపూర్ వారియర్స్ జట్లు ఫైనల్ కి చేరుకున్నాయి. ఫైనల్ లో పవన్ 11 జట్టు, ఇలాపూర్ వారియర్స్ జట్టుపై ఘనవిజయం సాధించింది. టోర్నమెంట్ విజేత లకి తాండ్ర రమేష్ చేతుల మీదుగా ట్రోఫీ మరియు 20,000/- నగదు బహుమతి , రన్నర్ టీమ్ కీ ట్రోఫీ మరియు 10,000/- నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎం.సి.పి.ఐ.యు నాయకులు తుడుం అనిల్ కుమార్ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు మియాపూర్ డివిజన్ జనరల్ సెక్రటరీ దోర్నాల రవికుమార్ గౌడ్, బాలు మహేందర్, నవీన్ నేత, రాజిరెడ్డి, రాఘవేంద్ర, నరసింహ, నరేష్ కుమార్ యాదవ్, సత్యరాజ్ అతిథులుగా పాల్గొన్నారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలు

## కలెక్టర్ వి జయేందిర బోయి

**మహబూబ్ నగర్, అక్షిత ప్రతినిధి :**

జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా ఉత్తమ ఆసుపత్రి గా రూపొందించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వి జయేందిర బోయి అన్నారు.బుధవారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం లో ఆసుపత్రి అభివృద్ధిపై సమీక్షించారు.ఆసుపత్రిలో డ్రైనేజీ,ఎలక్ట్రిక్ పనులు,ఆసుపత్రి లో స్పెషల్ రూంలు అద్దెకు ,రోగులకు సేవలు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సమావేశం లో మహబూబ్ నగర్ పార్లమెంటు సభ్యులు డి.కె.అరుణ,శాసన సభ్యులు యెన్నం శ్రీనివాస రెడ్డి సభ్యులు పాల్గొన్నారు.ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్ పర్సన్‌జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ గత సమావేశం లో తీసుకున్న నిర్ణయాలపై చర్యలు,ఆసుపత్రి అభివృద్ధి కి తీసుకోవలసిన చర్యల పై సమీక్షించారు.ఆసుపత్రి లో డ్రైనేజీ,ఎలక్ట్రిక్ పనులకు టి.ఎస్. ఎం. ఐ.డి.సి ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు.ఆసుపత్రి లో 10 వేల లీటర్ల సామర్థ్యం కల శిధిలా వస్థకు చేరిన పాత ఓవర్ హెడ్ ట్యాంక్ స్థానం లో కొత్త ఓవర్ హెడ్ ట్యాంక్ మిషన్ భగీరథ ఇంజినీరింగ్ అధికారులు ద్వారా నిర్మాణం చేయాలని సూచించారు.ఆసుపత్రి ముందు పెద్దగా పెరిగిన చెట్లు వేర్లు భవనం లోపలికి వెళ్ళి భవనం కు ప్రమాదం ఉన్నందున చెట్లను తొలగించేందుకు అనుమతికి అటవీ శాఖ అధికారులకు లేఖ రాయాలని సూచించారు.ఆసుపత్రి లో స్పెషల్ రూం లు రోగులకు అద్దెకు ఇచ్చేందుకు కమిటీ లో నిర్ణయం తీసుకున్నారు .7 సింగిల్ రూం లు,2 షేరింగ్ రూం లు రోగులకు సింగిల్ రూం రోజుకు 1000 రూ. ల చొప్పున,షేరింగ్ స్పెషల్ రూం లు రోజుకు 500 రూ. ల చొప్పున రెంట్ నిర్ణయించారుఆసుపత్రిలో జిల్లాలో ప్రైవేట్ ఆసుపత్రులలో పని చేస్తున్న 6 గురు కార్డియాలజీ డాక్టర్ లు ఉచితంగా రోగులకు సేవలు సంక్రాంతి నుండి రెండు గంటలు వారం కు ఒకరు చొప్పున అందుబాటులో ఉంటారని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు డా.రాం మోహన్ సమావేశం లో తెలిపారు. కొత్తగా నిర్మిస్తున్న బోధన ఆసుపత్రి భవనం త్వరగా నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారుఆసుపత్రి అభివృద్ధి సమావేశం లో పాల్గొన్న మహబూబ్ నగర్ పార్లమెంటు సభ్యులు శ్రీమతి డి.కె.అరుణ మాట్లాడుతూ బోధనా ఆసుపత్రి నూతన భవనం త్వరగా పూర్తి చేయాలని అన్నారు.ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని పలు ప్రాంతాల నుండి.గ్రామీణ ప్రాంతాల నుండి ఎక్కువ సంఖ్యలో రోగులు వస్తారని, ప్రతి పేద వానికి వైద్యం అందించాలని అన్నారు.జిల్లా జనరల్ ఆసుపత్రిని వచ్చే 4 సంవత్సరం లలో ఉత్తమ ఆసుపత్రి గా రూపొందించేందుకు కార్యాచరణ రూపొందించాలని అన్నారు కేంద్ర,రాష్ట్రాల నిధులు వినియోగించుకోవాలని అన్నారు.స్పెషల్ రూం లు రోగులకు అద్దెకు ఇచ్చేందుకు మోడల్ గా చేశారు.ఇంకా ఎక్కువగా సేవలు అందించాలని అన్నారు.సోలార్ లైటింగ్ కు,అంబులెన్స్ కు నిధులు అందించేందుకు సమావేశంలో తెలిపారు.పరిశ్రమలతో సమావేశం ఏర్పాటు చేసి సి.ఎస్.అర్ నిధులతో పాఠశాలలు, ఆసుపత్రి, త్రాగు నీటికి నిధులు మంజూరు కోరాలని సూచించారు.మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మహబూబ్ నగర్ ఆసుపత్రిలో సేవలు హైదరాబాద్ కు తగ్గ రీతిలో అందించే విధంగా భవిష్యత్తు లో రాష్ట్రంలోనే ఉత్తమ ఆసుపత్రిగా మహబూబ్ నగర్ ఆసుపత్రి అభివృద్ధి చేయుటకు తన వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అత్యవసర పనులు నిమిత్తం 10 లక్షల రూపాయల నిధులు అందజేస్తానని ఆయన హామీ ఇచ్చారు. తొలుత ఆసుపత్రిలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, ఎంపిడి.కె.అరుణ, శాసన సభ్యులు యెన్నం శ్రీనివాసరెడ్డి లు కార్డియాలజీ హబ్ ను, మాతా శిశు విభాగం (ఎంసిహెచ్) వార్డు ను, ఇఎన్టీ ఆపరేషన్ థియేటర్ ను, ఓటి కాంప్లెక్స్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు బెజ్జుగం రాఘవేంధర్, డాక్టర్ సామ్యూల్, లయన్ నటరాజ్, డాక్టర్.జె.రాంమోహన్, డిఎంహెచ్ఓ డాక్టర్ కృష్ణ, సూపరిండెండెంట్ డాక్టర్ సంపత్ కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.







www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY
జాతీయ దినపత్రిక

# చిత్తశుద్ధి లేని క్షమాపణలు

## సంపాదకీయం...

**మణిపూర్‌లో 2023 మే మూడవ తేదీన రెండు సామాజిక తరగతుల మధ్య పరస్పర అనుమానాలతో ప్రారంభమైన ఘర్షణ 2024లో కొనసాగి మూడో ఏడాదిలో ప్రవేశించింది. ఎప్పుడు ముగుస్తుందో తెలియటం లేదు. పరిస్థితిని చక్కదిద్దటంలో విఫలమైనందుకు విచారంగా ఉందంటూ ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ రాష్ట్ర ప్రజలకు క్షమాపణలు చెప్పారు. అయితే ఒక్క రోజు కూడా గడవక ముందే విమర్శకులపై ఎదురు దాడికి దిగటాన్ని బట్టి విచార ప్రకటనలో చిత్తశుద్ధి లేదని స్వయంగా వెల్లడించుకున్నారు. మెయితీ–కుకీ, జో తెగల మధ్య ప్రారంభమైన ఘర్షణల్లో కొందరు మహిళలపై అత్యాచారాలు, నగంగా ఊరేగింపులు జరిగాయి. 260 మంది ప్రాణాలు కోల్పోయారు. అరవై వేల మంది నెలవులు తప్పారు. బాధితుల్లో ఎక్కువ మంది గిరిజనులైన కుకీలే ఉన్నారు. మెయితీలందరినీ గిరిజనులుగా పరిగణించాలంటూ హైకోర్టు పెట్టిన చిచ్చు అక్కడ జరుగుతున్న దారుణ మారణకాండకు మూలం. రెండింజన్ల పాలన సాగిస్తున్న బిజెపి ఆదిలోనే దానికి తెర దించి ఉంట్టే ఇంత జరిగేది కాదు.**




మణిపూర్‌లో బిజెపి రాష్ట్ర ప్రభుత్వం శాంతి భద్రతలను కాపాడటంలో ఘోరంగా విఫలమైంది. అదే ఏ ప్రతిపక్ష పార్టీనో అధికారంలో ఉంటే అలా ఉపేక్షించేదా? అల్లకల్లోల పరిస్థితి ఏర్పడిన కారణంగా రాష్ట్రం మొత్తాన్ని మిలిటరీకి అప్పగించారు. అక్కడ బిజెపికి చెందిన ముఖ్యమంత్రి, మంత్రులు రాజభోగాలు అనుభవించటం తప్ప చేసేదేమీ లేదు. ప్రపంచమంతటా, మణిపూర్ చుట్టూ ప్రధాని నరేంద్రమోడీ విమానాల్లో తిరుగుతారు, సుభాషితాలు చెప్పి వస్తున్నారు తప్ప మణిపూర్ వెళ్లి భరోసా ఇచ్చేందుకు ఎలాంటి చొరవ లేదు.ప్రతిపక్షాలు ముందుకు తెచ్చిన అనేక అంశాల మీద మోడీ మౌనంగా ఉన్నట్లుగానే ఆయన ప్రథమ గణంలోని బీరేన్ సింగ్ మౌనంగా ఉంటే అదొక తీరు. కానీ ఎదురుదాడికి దిగారు. గతంలో కూడా మణిపూర్‌లో అనేక ఉదంతాలు జరిగాయి కదా వాటన్నింటికీ నాడు ప్రధానులుగా ఉన్న పివి నరసింహారావు, ఐకె గుజ్రాల్ క్షమాపణలు చెప్పారా అని ప్రశ్నించారు. ఆ నాడు రాష్ట్ర ముఖ్యమంత్రులుగా ఉన్నవారు కూడా క్షమాపణలు చెప్పిన దాఖలా లేదు, మరి బీరేన్ సింగ్ ఎందుకు చెప్పినట్లు? నాడు మణిపూర్‌లో జరిగిన ఉదంతాలను పాలకులు మూసిపెట్టలేదు, మోడీ ఏలుబడిలో ఎందుకు పాచిపోయేట్లు చేసినట్లు?మణిపూర్ అంశం ప్రస్తావనకు వచ్చినపుడల్లా బిజెపి నేతలు గతంలో కాంగ్రెస్ అనుసరించిన వైఖరి, విదేశీ జోక్యం గురించి చెబుతూ తమ చేతగానితనాన్ని కప్పిపుచ్చుకొనేందుకు చూస్తారు. సరిహద్దుల భద్రత, అక్రమ చొరబాట్లను అరికట్టాల్సింది కేంద్ర ప్రభుత్వం. పదేళ్ల నుంచి ఏం చేస్తున్నట్లు? 2017 నుంచి ఇదే బీరేన్ సింగ్ సిఎంగా ఉన్నారు. ఈ పెద్దమనిషి ఏం చేస్తున్నట్లు? అంతా చేసి నేరం నుంచి తప్పించుకోవటం తప్ప క్షమాపణలో చిత్తశుద్ధి లేదని మణిపూర్ గిరిజన సంఘాల ఐక్యతా కమిటీ బీరేన్ సింగ్ ప్రకటన మీద వ్యాఖ్యానించింది. ఒక మైనారిటీ తరగతి మీద జరిపిన మారణకాండ బాధ్యత నుంచి తప్పించుకొనేందుకు సిఎం చూశారని పేర్కొన్నది. కుకీ–జో గిరిజనుల పట్ల వివక్ష నిలిపివేయాలని మరో గిరిజన సంఘాల కమిటీ డిమాండ్ చేసింది. మణిపూర్‌లో సాయుధ బృందాలపై భద్రతా దళాలు జరిపిన దాడులలో స్టార్ లింక్ ఉపగ్రహ యాంటెన్నా, రౌటర్‌తో పాటు ఆధునిక రైఫిళ్లు దొరికినట్లు ప్రకటించారు. మారుమూల ప్రాంతాలలో ఇంటర్నెట్ సేవలను అందించే ఈ ఉపగ్రహం సేవలను పొందటం మన దేశంలో నిషిద్ధం, అయినప్పటికీ అవి దొరికాయంటే అనధికారికంగా సమాచారం అందుకున్నట్లు స్పష్టమౌతోంది. వీటిని మెయితీలు అధికంగా నివసించే ప్రాంతాలపై జరిగిన దాడుల సమయంలో సాయుధులు వదలివేసి పారిపోయినట్లు పోలీసులు ప్రకటించారు. అయితే తమ ఉపగ్రహం నుంచి భారత్‌కు సంకేతాలు అందకుండా చేసినట్లు ఎలన్ మస్క్ చెప్పుకున్నాడు. తమ దాడుల సందర్భంగా మయన్మార్‌లో తయారైన ఆయుధాలు, ఇతర పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు కూడా పోలీసు అధికారులు చెప్పారు. వాటిలో మయన్మార్ సైనికులు వాడే ఎంఏ4 రైఫిల్, ఎకె47 కూడా ఉంది. గత ఐదారు నెలల నుంచి సాయుధ బృందాలు తల దాచుకున్న ప్రాంతాలలో బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు, మిలిటరీ యూనిఫారాలు తదితరాలను కూడా పట్టుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. మయన్మార్ సరిహద్దులను దాటి ఉగ్రవాదులు రాకపోకలు సాగిస్తున్నా, ఆయుధాలు అక్రమ రవాణా జరుగుతుంటే సరిహద్దు భద్రతలను చూడాల్సిన కేంద్ర ప్రభుత్వం ఏమి చేస్తున్నట్లు? స్టార్ లింక్ ఉపగ్రహం నుంచి ఉగ్రవాదులు, సాయుధ మూకలకు సంకేతాలు, సందేశాలు అందుతుంటే అడ్డుకోవాల్సిన బాధ్యత కూడా కేంద్రానిదే. భద్రమైన చేతుల్లో దేశం ఉందని నరేంద్ర మోడీ గురించి గొప్పలు చెప్పుకోవటం తప్ప ఉపయోగం ఏముంది?తాజా ఘర్షణలు, దాడులకు 2023 ఏప్రిల్ 14న మణిపూర్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలే మూలం! మెయితీ సామాజిక తరగతికి గిరిజన హోదా కల్పించాలని కేంద్రానికి సిఫార్సు చేయాలంటూ తనకు లేని అధికారంతో హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. తరువాత సుప్రీం కోర్టు ఈ చర్యను తప్పు పట్టింది. ఒక పెద్ద కుట్రలో భాగంగా అక్కడ పరిణామాలు జరిగినట్లు భావిస్తున్నారు. హైకోర్టు ఆదేశాన్ని నిరసిస్తూ మే 3వ తేదీన గిరిజన విద్యార్థులు నిరసన తెలిపారు. నాటి నుంచి నేటి వరకు ఏదో ఒక వైపు నుంచి హింసాకాండ జరుగుతూనే ఉంది. మెయితీ–గిరిజనుల మధ్య పరస్పరం అనుమానాలు కొనసాగుతూనే ఉన్నాయి. మయన్మార్‌లో 2021 మిలిటరీ తిరుగుబాటు సమయంలో అక్కడి నుంచి శరణార్థులుగా వచ్చిన వారి గురించి మెయితీలు అభ్యంతరం తెలిపారు. ఇవన్నీ కూడా బిజెపి రెండింజన్ల పాలనలోనే జరిగాయి. అందువలన గత కాంగ్రెస్ పాలనే కారణం అనటం తప్పించుకోచూడటం తప్ప మరొకటి కాదు. తాజా లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి అక్కడ నాగా పీపుల్స్ ఫ్రంట్ అనే ఒక ప్రాంతీయ పార్టీతో జత కట్టి చెరో సీటులో పోటీ చేసింది. రెండు సీట్లలో కాంగ్రెస్ గెలిచింది. అందుకే వచ్చే అసెంబ్లీ ఎన్నికలను గమనంలో ఉంచుకొని క్షమాపణల పర్వానికి తెర తీశారని చెప్పాల్సి వస్తోంది. మెయితీలను గిరిజనులుగా గుర్తించాలా లేదా అన్నది బిజెపి తేల్చటం లేదు. తమకు అన్యాయం చేస్తారని కుకీ, ఇతర గిరిజనులు అనుమానంగా చూస్తుంటే తమకు రిజర్వేషన్ల ఆశ చూపి ఓటు బ్యాంకుగా మార్చుకోవాలని చూసి ఎటూ తేల్చటం లేదని మెయితీలు అసంతృప్తితో ఉండటమే బిజెపి ఓటమికి కారణం.

# చంద్రబాబు లక్ష్యాలకు అండగా ఉంటా

**భుజంభుజం కలిపి అభివృద్ధి కోసం నడుస్తా**

**ప్రజల ఆశలు,ఆశయాల సాధనకు మద్దతు ఇస్తా**

**రూ.2.08 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు**

**2047 నాటికి 2.5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం**

**విశాఖపట్టణం బహిరంగ సభలో ప్రధాని మోడీ వెల్లడి**









విశాఖపట్నం, అక్షిత ప్రతినిధి : ముఖ్యమంత్రి చంద్రబాబు పెట్టుకున్న లక్ష్యాలకు తాము ఎప్పుడూ అండగా ఉంటామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భరోసా ఇచ్చారు. రాష్ట్ర ప్రజల ఆశలు, ఆశయాల సాధనకు మద్దతుగా నిలుస్తామని మోదీ హామీ ఇచ్చారు.ఏపీలో రూ.2.08 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా విశాఖ ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. 'ఆంధ్రప్రదేశ్ ప్రజల ప్రేమ, అభిమానానికి కృతజ్ఞతలు. మీ ఆశీర్వాదంతో 60 ఏళ్ల తర్వాత తొలిసారి మేం మూడోసారి అధికారంలోకి వచ్చాం. రాష్ట్రానికి అన్ని రంగాల్లో మద్దతుగా నిలుస్తున్నాం. 2047 నాటికి 2.5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ రాష్ట్రంతో భుజం భుజం కలిపి నడుస్తాం. ఇవాళ తలపెట్టిన ప్రాజెక్టులు రాష్ట్ర వికాసానికి తోడ్పడతాయని మోడీ అన్నారు ఐటీ, టెక్నాలజీకి ఆంధ్రప్రదేశ్ ప్రధాన కేంద్రం కానుంది. ఈ ప్రాజెక్టులు రాష్ట్ర అభివృద్ధిని సరికొత్త శిఖరాలకు చేరుస్తాయి. 2030లోగా 5 మిలియన్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి మా లక్ష్యం. దేశంలో 2 గ్రీన్ హైడ్రోజన్ హబ్‌లు వస్తుంటే.. దానిలో ఒకటి విశాఖకు కేటాయించాం. గ్రీన్ హైడ్రోజన్ హబ్ ద్వారా ఎంతో మందికి ఉపాధి లభిస్తుందని భరోసా ఇచ్చారు.'నక్కపల్లిలో బల్క్‌డ్రగ్ పార్కుకు శంకుస్థాపన చేశాం. కేవలం 3 రాష్ట్రాల్లోనే ఇలాంటి పార్కులు వస్తున్నాయి. చెన్నై–బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌లో క్రిస్ సిటీ భాగం అవుతుంది. ఇప్పటికే శ్రీసిటీ ద్వారా ఏపీలో తయారీరంగం ఊపందుకుంది. దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు పునాదిరాయి వేశాం. రాష్ట్ర అభివృద్ధిలో రైల్వే జోన్ కీలకం కానుంది. రైల్వే జోన్ ద్వారా రాష్ట్ర ప్రజల చిరకాల వాంఛ నెరవేరుతుంది. రైల్వే జోన్ వల్ల వ్యవసాయ, పర్యాటక రంగాలు ఊపందుకుంటాయి. రాష్ట్రంలో ఇప్పటికే 7 వందేభారత్ రైళ్లు నడుస్తున్నాయి. అమృత్ భారత్ కింద ఏపీలోని 70కి పైగా రైల్వేస్టేషన్లు ఆధునికీకరణ చేపట్టాం' అని ప్రధాని మోడీ వివరించారు. మూడోసారి ప్రధానిగా నరేంద్ర మోదీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా ఆంధప్రదేశ్‌లో పర్యటించారు. ఈ క్రమంలో నేడు విశాఖపట్నంలో రూ.2.08 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ నేపథ్యంలో మాట్లాడిన ప్రధాని తన అభిమానాన్ని చూపించే అవకాశం ఇప్పుడు వచ్చిందని పేర్కొన్నారు. తెలుగులో ప్రసంగం మొదలు పెట్టిన ప్రధాని మోదీ.. ఆంధ్ర ప్రజల ప్రేమ, అభిమానానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఐదేళ్ల తర్వాత ఏపీలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని.. చంద్రబాబు స్పీచ్‌తో సిక్సర్ కొట్టారని పేర్కొన్నారు. 60 ఏళ్ల తర్వాత దేశంలో మూడోసారి ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని మోదీ గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో చంద్రబాబు లక్ష్యాలకు మేం ఎప్పుడూ అండగా ఉంటామని ప్రధాని అన్నారు. ఏపీ ప్రజల ఆశలు, ఆశయాలకు మద్దతుగా నిలుస్తామని చెప్పారు. ఏపీకి అన్ని రంగాల్లో మద్దతుగా నిలుస్తున్నామని, ఏపీతో భుజం భుజం కలిపి నడుస్తామని మోదీ పేర్కొన్నారు. ఇవాళ తలపెట్టిన ప్రాజెక్టులు రాష్ట్ర వికాసానికి తోడ్పడతాయని ప్రధాని వెల్లడించారు. దీంతోపాటు ఐటీ, టెక్నాలజీకి ఏపీ ప్రధాన కేంద్రం కానుందని ప్రధాని మోదీ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టులు ఏపీ అభివృద్ధిని సరికొత్త శిఖరాలకు చేరుస్తాయని ప్రధాని మోదీ అన్నారు. 2030లోగా 5 మిలియన్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయడమే మా లక్ష్యమని ప్రధాని తెలిపారు. నవయుగ పట్టణీకరణకు ఏపీ సాక్ష్యంగా మారబోతోందని ఈ సందర్భంగా మోదీ చెప్పారు. విశాఖ ప్రత్యేక రైల్వే జోన్ డిమాండ్ చాలా కాలంగా ఉందని, చిరకాల కోరిక ఈరోజు నెరవేరిందన్నారు. రైల్వే జోన్ రాకతో వ్యవసాయంతోపాటు అనేక వ్యాపారాలు కూడా అభివృద్ధి చెందుతాయన్నారు. ఏపీ అభివృద్ధి మా విజన్ అని మరోసారి గుర్తు చేశారు ప్రధాని మోదీ.'దేశంలో రెండు గ్రీన్ హైడ్రోజన్ హబ్‌లు వస్తుంటే.. అందులో ఒకటి విశాఖకు కేటాయించాం. గ్రీన్ హైడ్రోజన్ హబ్ ద్వారా ఎంతోమందికి ఉపాధి లభిస్తుంది. నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్క్‌కు శంకుస్థాపన చేశాం. 3 రాష్ట్రాల్లోనే ఇలాంటి బల్క్ డ్రగ్ పార్కులు వస్తున్నాయి. చెన్నై–బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌లో క్రిస్ సిటీ భాగం అవుతుంది. ఇప్పటికే శ్రీసిటీ ద్వారా ఏపీలో తయారీరంగం ఊపందుకుంది. దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు పునాదిరాయి వేశాం. రాష్ట్ర అభివృద్ధిలో రైల్వే జోన్ కీలకం కానుంది. రైల్వే జోన్ ద్వారా రాష్ట్ర ప్రజల చిరకాల వాంఛ నెరవేరుతుంది. రైల్వేజోన్ వల్ల వ్యవసాయ, పర్యాటక రంగాలు ఊపందు కుంటాయని ప్రధాని మోదీ అన్నారు. ప్రధాని మోడీ అంతకుముందు విశాఖలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. దీనికి భారీగా జనం హాజరై మోడీకి అభివాదం తెలిపారు. బహిరంగ సభలో ప్రధాన ప్రసంగాన్ని తెలుగులో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు అనువాదం చేసి అందించారు.



www.aakshitha.com
People's voice
అక్షిత జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY

# ఆట



# తొలి మ్యాచ్‌కు హార్దిక్ పాండ్యా దూరం

## గత సీజన్ లో స్లో ఓవరేట్ కారణంగా బెంచ్ కే పరమితం




అక్షిత ప్రతినిధి :

ఐపీఎల్ 2025 సీజన్ ప్రారంభానికి ముందే ముంబై ఇండియన్స్‌కు బిగ్ షాక్ తగిలింది. ఆ జట్టు తొలి మ్యాచ్‌కు కెప్టెన్ హార్దిక్ పాండ్యా దూరంగా ఉండనున్నాడు. అప్‌కమింగ్ సీజన్‌లో తమ సారథిగా హార్దిక్ పాండ్యానే కొనసాగుతాడని ఇప్పటికే ముంబై ఇండియన్స్ మేనేజ్‌మెంట్ స్పష్టం చేసిన విషయం తెలిసిందే. మార్చి 13 నుంచి ఐపీఎల్ 2025 సీజన్ ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి. అయితే ఐపీఎల్ ఓవర్ రేట్ రూల్స్ ప్రకారం ముంబై ఇండియన్స్ తొలి మ్యాచ్‌కు హార్దిక్ పాండ్యా దూరం కానున్నాడు. గత సీజన్(ఐపీఎల్ 2024)లో ముంబై ఇండియన్స్ సారథిగా హార్దిక్ పాండ్యా వరుసగా మూడు సార్లు స్లో ఓవరేట్‌కు గురయ్యాడు. నిర్ణీత సమయంలో తమ జట్టు ఓవర్లను పూర్తి చేయలేకపోయాడు. దాంతో అతనిపై ఓ మ్యాచ్ ఆడకుండా నిషేధం పడింది. స్లో ఓవర్ రేట్ విషయంలో ఆటగాళ్లు సీరియస్‌గా ఉండటం లేదని గ్రహించిన ఐపీఎల్ నిర్వాహకులు కఠిన నిబంధనలు తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. మొదటి సారి స్లో ఓవర్‌రేట్‌కు గురైతే కెప్టెన్ మ్యాచ్ ఫీజులో 12 లక్షలు కోత విధిస్తారు. రెండో సారి ఇదే తప్పిదం రిపీట్ అయితే రూ. 24 లక్షలు, మూడో సారి రిపీట్ అయితే రూ. 30 లక్షల మ్యాచ్ ఫీజు కోతతో పాటు ఓ మ్యాచ్ ఆడకుండా నిషేధం విధిస్తారు. అయితే హార్దిక్ పాండ్యా గత సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో మూడోసారి స్లో ఓవర్ రేట్‌కు కారణమయ్యాడు. దాంతో అతను అప్‌కమింగ్ సీజన్ తొలి మ్యాచ్ ఆడకుండా నిషేధం పడింది. ఐపీఎల్ 2025 మెగా వేలానికి ముందు హార్దిక్ పాండ్యాను ముంబై ఇండియన్స్ రిటైన్ చేసుకున్న సంగతి తెలిసిందే. అతనితో పాటు రోహిత్ శర్మ, జస్‌ప్రీత్ బుమ్రా, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మలను ముంబై అంటిపెట్టుకుంది. ఈ కోర్ టీమ్‌కు తగ్గట్లుగా వేలంలో ఆటగాళ్లను కొనుగోలు చేసింది. పేపర్‌పై ముంబై ఇండియన్స్ చాలా బలంగా కనిపిస్తోంది. తొలి మ్యాచ్‌కు హార్దిక్ పాండ్యా దూరంకానున్న నేపథ్యంలో ముంబై ఇండియన్స్ తాత్కలిక కెప్టెన్‌గా ఎవరు బాధ్యతలు చేపడుతారనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. హార్దిక్ గైర్హాజరీలో టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ సారథ్య బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. ఐపీఎల్ 2023 సీజన్‌లో రోహిత్ శర్మ డిప్యూటీగా సూర్యకుమార్ యాదవ్ ముంబై ఇండియన్స్‌ను నడిపించాడు. ఆ మ్యాచ్‌లో రోహిత్ ఇంపాక్ట్ ప్లేయర్‌గా బరిలోకి దిగాడు. జస్‌ప్రీత్ బుమ్రా మాత్రం ఇప్పటి వరకు ముంబై ఇండియన్స్‌కు సారథ్యం వహించలేదు.

# రిటైర్మెంట్ తీసుకోబోతున్నట్లు ప్రకటించిన ఫుట్ బాల్ స్టార్ నేమార్

## ఫిఫా 2026 వరల్డ్ కప్ చివరి టోర్నీ అని వెల్లడి

అక్షిత ప్రతినిధి :

బ్రెజిల్ ఫుట్ బాల్ స్టార్ నేమార్ షాకింగ్ డెసిషన్ తీసుకున్నాడు. తాను రిటైర్మెంట్ తీసుకోబోతున్నట్లు ప్రకటించాడు. ఫిఫా 2026 వరల్డ్ కప్ తాను ఆడబోయే చివరి టోర్నీ అని అన్నాడు. అలానే దిగ్గజ ఫుట్ బాలర్స్ మెస్సీ, సూరెజ్ తో రీయూనియన్ విషయమై హింట్ ఇచ్చాడు. 79 గోల్స్ తో బ్రెజిల్ ఆల్ టైమ్ టాప్ స్కోరర్ గా నిలిచాడు నేమార్. అయితే 32 ఏళ్ల నేమార్ కెరీర్ లో ఎన్ని ఘనతలు సాధించాడో, అలానే గాయాల బారిన కూడా పడ్డాడు. దీంతో ఈ మధ్య కాలంలో చాలా తక్కువ మ్యాచులలోనే బరిలోకి దిగాడు. 2023లో పారిస్ సెయింట్ జెర్మెన్ నుంచి బయటకొచ్చిన కేవలం ఏడు మ్యాచులలోనే ఆడాడు. సౌదీ ప్రో లీగ్ క్లబ్ వారితో అతడి కాంట్రాక్ట్ 2024 జూన్ తో ముగిసిపోయింది. ఈ క్రమంలోనే ఇప్పుడు నేమార్ తన కెరీర్ భవిష్యత్ ప్రణాళిక గురించి హింట్ ఇచ్చాడు. రిటైర్మెంట్ గురించి కూడా వ్యాఖ్యలు చేసాడు. మేజర్ లీగ్ సాసర్ బరిలో దిగడంతో పాటు మాజీ బార్సిలోనా టీమ్ మేట్స్ లియోనెల్ మెస్సీ, లూయిస్ సూపెజ్ తో రీయూనియన్ అయ్యే అవకాశం ఉందని చెప్పుకొచ్చాడు. "నేను ఆడేందుకు ప్రయత్నిస్తాను. కచ్చితంగా ఆడుతాను. నా నేషనల్ టీమ్ కోసం, జట్టుతో ఉండేందుకు చేయాల్సినవన్నీ చేస్తాను. ఇక ఇదే నా చివరి వరల్డ్ కప్. నా లాస్ట్ షాట్, నా లాస్ట్ ఛాన్స్ ఇదే. కాబట్టి నేను ఈ ప్రపంచ కప్ లో ఆడేందుకు ఏదైనా చేస్తాను." అని పేర్కొన్నాడు. నేమార్ , మెస్సీ, లూయిస్.. గతంలో ఈ త్రయం కలిసి అద్భుత రికార్డులను సాధించారు. వీరి మధ్య మంచి స్నేహబంధం కూడా ఉంది. తాజాగా వారితో రీయూనియన్ గురించి నేమార్ మాట్లాడుతూ... "మెస్సీ, లూయిస్ తో కలిసి మళ్లీ ఆడటం అనేది అసాధరణమైన విషయం. వాళ్లు నా స్నేహితులు. మేం ఇప్పటికీ మాట్లాడుకుంటూనే ఉన్నాం. నేను అల్ హిలాల్, సౌదీ అరేబియాతో హ్యాపీగానే ఉన్నాను. ఫుట్ బాల్ అంటేనే ఎన్నో సర్ ప్రైజెస్." అని చెప్పుకొచ్చాడు. కాగా, బ్రెజిల్ జట్టు ప్రస్తుతం సౌత్ అమెరికన్ వరల్డ్ కప్ క్వాలిఫయర్స్ లో ఐదో స్థానంలో ఉంది.

# ఇంగ్లండ్‌తో సిరీస్‌కు రోహిత్ శర్మకు విశ్రాంతి!!

## గిల్‌కు కెప్టెన్ బాధ్యతలు అప్పగించే అవకాశం

అక్షిత ప్రతినిధి :

ఆస్ట్రేలియాలో ఘోర పరాజయాన్ని మరచిపోయిన టీమిండియా ఇప్పుడు స్వదేశంలో ఇంగ్లండ్‌తో జరిగే సిరీస్‌పై కన్నేసింది. జనవరి 22 నుంచి ఇరు జట్ల మధ్య 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్ జరగనుంది. ఆ తర్వాత ఫిబ్రవరి 6 నుంచి మూడు వన్డేల సిరీస్ ప్రారంభం కానుంది. ఈ సమయంలో జరిగే వన్డే సిరీస్‌లో రోహిత్ శర్మ భాగం కావడం లేదని, ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు అతనికి విశ్రాంతి ఇవ్వవచ్చని కొన్ని నివేదికలు పేర్కొంటున్నాయి. అయితే, రోహిత్ శర్మ ఆడకపోతే వన్డే జట్టుకు కెప్టెన్‌గా ఎవరు వ్యవహరిస్తారనేది అతిపెద్ద ప్రశ్నగా మారింది. ఛాంపియన్స్ ట్రోఫీకి జట్టును ప్రకటించేందుకు జనవరి 12వ తేదీని ఐసీసీ డెడ్‌లైన్‌గా నిర్ణయించింది. ఇలాంటి పరిస్థితుల్లో ఇంగ్లండ్ సిరీస్‌తో పాటు ఛాంపియన్స్ ట్రోఫీకి కూడా బీసీసీఐ జట్టును ప్రకటించవచ్చు. ఛాంపియన్స్ ట్రోఫీలో రోహిత్ ఆడడం ఖాయం. కానీ, ఇంగ్లండ్‌తో జరిగే వన్డే సిరీస్‌లో మాత్రం అతను పాల్గొనడం ఖాయం. ఇటువంటి పరిస్థితిలో, రోహిత్ ఈ సిరీస్‌లో ఆడకపోతే, కెప్టెన్సీకి శుభ్‌మన్ గిల్ అతిపెద్ద పోటీదారుగా మారబోతున్నాడు. ఎందుకంటే, ఈ సిరీస్‌లో జస్ప్రీత్ బుమ్రాకు కూడా విశ్రాంతి ఇవ్వడం దాదాపు ఖాయం.



# సిద్ధిపేటలో...ఈవీ విప్లవం

## కరీంనగర్‌లో గ్రావ్టన్ మోటార్స్ షోరూమ్

సిరిసిల్ల, అక్షిత ప్రతినిధి :

హైదరాబాద్‌కు చెందిన ఫుల్-స్టాక్ ఈవీ ద్విచక్ర వాహనాల తయారీ సంస్థ, సుస్థిర మొబిలిటీలో అగ్రగామి అయిన గ్రావ్టన్ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ కరీంనగర్‌లో తన మొదటి కంపెనీ యాజ మాన్యంలోని అవుట్‌లెట్‌ను ప్రారంభించడం ద్వారా ఒక చారిత్రాత్మక సందర్భాన్ని నమోదు చేసింది. ఈ మైలు రాయి గ్రావ్టన్ ప్రయాణాన్ని వేడుక చేసుకుటూనే భారతీయ ఈవీ రంగంలో భవిష్యత్ వృద్ధి, ఆవిష్కరణలకు పునాది వేసింది. ఈ షోరూమ్ ప్రారంభం కరీంనగర్ లో చోటు చేసుకున్నప్పటికీ, సిద్ధిపేట ప్రాంతం కూడా గ్రావ్టన్ వృద్ధికి తోడ్పడే అపార శక్తిసామర్థ్యాలను కలిగిఉంది. సిద్ధిపేటకు చెందిన వినియోగదారులు గ్రావ్టన్ యొక్క నమ్మకమైన విక్రయానంతర సేవలను సులభంగా పొందవచ్చు. సర్వీస్ సంబంధిత సమస్యలు 24 గంటల్లోగా పరిష్కరించబడుతాయి. ఈ బ్రాండ్ యొక్క కొనుగోలుదారు కేంద్రిత ధోరణిని ఇది ప్రతిబింబిస్తుంది.

ఈ కార్యక్రమంలో కరీంనగర్ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పాల్గొన్నారు. భారతదేశ భవిష్యత్ చలనశీలతను నడపడంలో సుస్థిర ఆవిష్కరణల ప్రాముఖ్యతను ఆయన ఈ సందర్భంగా అన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో గ్రావ్టన్ మోటార్స్ వ్యవస్థాపకులు, సీఈఓ పరశురామ్ పాకా తన చిన్ననాటి ఉపాధ్యాయునికి (ఈ ప్రాంతానికి చెందినవారు) మొదటి రిజిస్టర్డ్ గ్రావ్టన్ క్వాంటా ఈవీ మోటార్‌సైకిల్‌ను బహు కరించారు. ఈ కృతజ్ఞతాపూర్వక చర్య గ్రావ్టన్ ప్రధాన విలువలైన గౌరవం, సమాజంతో నిమగ్నత, అర్థవంతమైన అనుబంధాలకు నిబద్ధతను సూచిస్తుంది.ప్రారంభోత్సవ కార్యక్రమంలో గ్రావ్టన్ మోటార్స్ వ్యవస్థాపకులు %ు% సీఈవో పరశురామ్ పాక మాట్లాడుతూ, "కరీం నగర్‌లో మా మొదటి షోరూమ్ ప్రారంభించడం గ్రావ్టన్ మోటార్స్‌కు శుభపరిణామం అని అన్నారు. ఇది కేవలం వ్యాపార మైలురాయి కాదు, ఇది ఈ ప్రాంతానికి పెద్ద కలలు కనడానికి నన్ను ప్రేరేపించిన వ్యక్తులకు కృత జ్ఞతలు తెలియజేసుకోవడం అని అన్నారు . భారతదేశంలోని ప్రతి మూలకు ప్రపంచ స్థాయి ఎలక్ట్రిక్ మొబిలిటీ ఉత్పాదనలను తీసుకురావడానికి మేం కట్టుబడి ఉన్నాం" అని అన్నారు.

గ్రావ్టన్ ప్రధాన ఉత్పాదన అయిన క్వాంటా తన రికార్డ్-బ్రేకింగ్ %ఖ2ఖ% ప్రయాణంతో ఇప్పటికే సంచలనాలను సృష్టిం చింది. ఇది కేవలం 6.5 రోజుల్లో 4,011.9 కి.మీ. ప్రయాణాన్ని పూర్తి చేసింది. క్వాంటా అనేది శక్తివంతమైన %దీూణజ% హబ్ మోటార్, అధునాతన %ూవీఖీూ% బ్యాటరీ హై-స్ట్రెంగ్త్ రిబ్-కేజ్డ్ ఛాసిస్‌తో సహా అన్ని కీలక భాగాలను అంతర్గతంగా రూపొందించి, అభివృద్ధి చేసిన మొదటి 100% "మేడ్ ఇన్ ఇండియా" ఈవీ మోటార్‌సైకిల్.సంప్రదాయ పెట్రోల్-ఇంధన మోటార్‌సైకిళ్లతో పోలిస్తే, క్వాంటా తన యజమానులకు ఖర్చులను ఆదా చేస్తుంది. ఉదాహరణకు, క్వాంటాతో కేవలం రూ.20 నుంచి రూ.30 ఖర్చుతో కరీంనగర్ నుంచి హైదరాబాద్ కు 150 కిలోమీటర్ల దూరం ప్రయాణించవచ్చు.క్వాంటా అనేది అధిక-పనితీరు గల వాహనం. ఇది శక్తివంతమైన %దీూణజ% హబ్ మోటార్‌తో పని చేస్తుంది. ఇది భారీ 170%చీఎ% టార్క్‌ను అందిస్తుంది. దీని 17" చక్రాలు 183 మిమీ అధిక గ్రౌండ్ క్లియరెన్స్ కారణంగా, క్వాంటా అన్ని రహదారి పరిస్థితులు, విభిన్న రకాల ప్రాంతాల్లో తేలికగా ప్రయాణించగలదు.




www.aakshitha.com
People's voice
అక్షిత జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY

# బిజినెస్..

# మహీంద్రా ఈవీ వచ్చేసింది

## గరిష్ఠ ధర రూ.30.50 లక్షలు

ముంబై, అక్షిత ప్రతినిధి :

మహీంద్రా అండ్ మహీంద్రా.. మార్కెట్లోకి సరికొత్త ఈవీలను పరిచయం చేసింది. వీటిలో బీఈ6, ఎక్స్‌వీ 9ఈ పేర్లతో విడుదల చేసిన ఈ కార్లు రూ.18.9 లక్షల నుంచి రూ.30.5 లక్షల గరిష్ఠ స్థాయిలో లభించనున్నాయి. వీటిలో బీఈ6 సింగిల్ చార్జింగ్‌తో 682 కిలోమీటర్లు ప్రయాణించనుండగా, ఎక్స్‌ఈవీ 9ఈ ఫీచర్ కలిగిన మాడల్ 656 కిలోమీటర్లు ప్రయాణించనున్నదని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. భద్రత ప్రమాణాలు మెరుగుపరచడంలో భాగంగా ఈ కారులో తొమ్మిది ఎయిర్‌బ్యాగ్‌లు 12.3 ఇంచుల టచ్‌స్క్రీన్ వంటి అధునాతన ఫీచర్స్‌తో తీర్చిదిద్దింది. 175 కిలోవాట్ల డీసీ ఫాస్ట్ చార్జింగ్‌తో కేవలం 20 నిమిషాల్లోనే 80 శాతం బ్యాటరీ రీచార్జికానున్నది. బీవైడీ ఆటో 3, టాటా హారియర్ ఈవీ, టాటా సఫారీ ఈవీలకు పోటీగా సంస్థ ఈ వాహనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది.



# ఆరు నెలలకే ప్రజల్లో తీవ్ర అసంతృప్తి

## హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వం మాజీ సిఎం జగన్ విమర్శల తూటాలు



**అమరావతి,**

ఆరు నెలలకే కూటమి ప్రభుత్వంపై తీవ్ర ప్రజా వ్యతిరేకత కనిపిస్తున్నదని మాజీ సిఎం, వైకాపా అధినేత జగన్ అన్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా ప్రజా ప్రతినిధులతో మాజీ సీఎం వైయస్ జగన్ మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను, మేనిఫెస్టోలో హామీలను పూర్తిగా గాలికొదిలేశారన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబులా హామీలు ఇవ్వాలని కొందరు శ్రేయోభిలాషులు తనకు చెప్పారని.. రాజకీయాల్లో ఉన్నప్పుడు వ్యక్తిత్వం, విశ్వసనీయత ఉండాలన్నారు.. చంద్రబాబును నమ్మడమంటే.. చంద్రముఖిని నిద్రలేపడమేనని.. పులినోట్లో తలకాయపెట్టడమేనన్నారు.. చంద్రబాబుకూ, జగన్‌కూ మధ్య తేడాను ప్రజలు గమనిస్తున్నారన్నారు.. కూటమి నాయకులు ఏ ఇంటికీ వెళ్లలేరని, వారికీ ఆ ధైర్యంకూడా లేదన్నారు.. మరోవైపు బాదుడే బాదుడు కనిపిస్తోందన్నారు.. రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతోందన్నారు.. నాయకులంతా యాక్టివ్‌గా ఉండాల్సిన సమయం వచ్చేసిందన్నారు.. తాను కూడా జనవరి నెలాఖరు లేదా ఫిబ్రవరి నుంచి జిల్లాల పర్యటనకు వస్తానని.. ప్రతి వారం మూడు రోజులు ఒక పార్లమెంటులో విడిచేస్తానన్నారు.. ఇక, కార్యకర్తల విషయంలో ఇంతవరకూ ఒకలా చూశాం.. ఇకపై మరోలా చూస్తాం అంటూ వైఎస్ జగన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.. మనంకూడా కొంత నేర్చుకోవాల్సి ఉంది.. జెండా మోసిన ప్రతి కార్యకర్తకూ భరోసాగా ఉంటాం అని హామీ ఇచ్చారు.. అన్యాయానికి గురైన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం.. మీపై అన్యాయాలు చేసిన వారి పేర్లు గుర్తుపెట్టుకోండి.. వారిని చట్టంముందు కచ్చితంగా నిలబెడతామని హెచ్చరించారు.. రాష్ట్రంలో ఇలాంటి పరిస్థితులు ఎప్పుడూ చూడలేదు.. అక్రమంగా కేసులు పెట్టి వేధిస్తున్నారు.. కచ్చితంగా కార్యకర్తలకు అండగా ఉంటాను అని భరోసా ఇచ్చారు వైఎస్ జగన్.. మనం ప్రతి మూడునెలలకూ విద్యాదీవెన కింద చెల్లించాం.. కానీ, ఇప్పుడు విద్యాదీవెన, వసతి దీవెన కింద రూ.3900 కోట్లు పెండింగ్‌లో పెట్టారు.. ఆరోగ్యశ్రీకింద వేయి ప్రొసీజర్లను 3300 వరకూ పెంచి గొప్పగా అమలు చేశాం.. 8 నెలల కాలంలోనే 3వేల కోట్లు ఆరోగ్యశ్రీకి బకాయిపెట్టారని మండిపడ్డారు.. ఇంటివద్దకే డోర్‌డెలివరీ పరిపాలన నుంచి తిరిగి టీడీపీ నాయకుల వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు.. మనం ప్రజలకు అండగా నిలవాల్సిన అవసరం ఉంది.. నాయకులంతా యాక్టివ్‌గా ఉండాల్సిన సమయం వచ్చేసిందని సూచించారు వైసీపీ అధినేత వైఎస్ వైఎస్ జగన్మోహన్‌రెడ్డి..

# అల్లు అర్జున్ విడుదలలో ఎలాంటి తప్పిదం లేదు

## జైళ్ల వార్షిక నివేదిక విడుదలలో డిజి సౌమ్యా మిశ్రా

**హైదరాబాద్, అక్షిత ప్రతినిధి :**

ఇటీవల పుష్ప 2 సినిమా విడుదల సందర్భంగా జరిగిన సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన ఎంత దుమారం రేపిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ ఘటనలో హీరో అల్లు అర్జున్ అరెస్టయిన సంగతి కూడా తెలిసిందే. అయితే.. నాటకీయ పరిణామాల మధ్య అల్లు అర్జున్ అరెస్ట్ అవ్వడంపై పెద్ద ఎత్తున చర్చ జరిగింది. ఇదిలా ఉండగా, అల్లు అర్జున్ విడుదల సమయంలో వెనుక గేట్ నుండి పంపడంపై కూడా పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ అంశంపై క్లారిటీ ఇచ్చారు జైల్ డీజీ సౌమ్య మిశ్రా. అల్లు అర్జున్ ను జైలు వెనుక గేటు నుండి పంపడంలో తమ నుండి ఎలాంటి తప్పు లేదని స్పష్టం చేశారు సౌమ్య మిశ్రా. జైళ్ల వార్షిక నివేదిక విడుదల సందర్భంగా మాట్లాడుతూ.. ఈ మేరకు సౌమ్య వ్యాఖ్యలు చేశారు. చివరిసారిగా 2019 లో వార్షిక సమావేశం ఏర్పాటు చేశామని.. 2024 లో జైల్ అదాలత్ లో 1045 లో అవకాశం కల్పించామని అన్నారు సౌమ్య. 2650 మంది ఖైదీలు స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో ట్రైనింగ్ తీసుకుంటున్నారని.. సత్ప్రవర్తన కలిగిన 213 మంది ఖైదీలను విడుదల చేసినట్లు తెలిపారు. 2024 లో 8 మంది ఖైదీలకు బ్యాంక్ లోన్స్ ఇచ్చామని.. జైల్లో ఉండి 750 మంది డిగ్రీ పూర్తి చేశారని, 225 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్ పట్ట పొందారని అన్నారు. జైల్లో ఉన్న ఖైదీల ద్వారా ఇంటికి అవసరమైన పరికరాలను ఖైదీలతో తయారు చేయించామని.. ఖైదీల నుండి టైలరింగ్,ప్రింటింగ్ ప్రెస్ బేకరి యూనిటి,పౌల్ట్రీ వంటి పరిశ్రమలు ఏర్పాటు చేశామని అన్నారు. జైల్లో ఉన్న ఖైదీలకు ఉపాధి కల్పనకు అవసరమైన జాతీయ చమురు కంపెనీలతో 29 అవుట్ లే అవుట్ లెట్ల ను ఏర్పాటు చేశామని అన్నారు సౌమ్య. నుమయిష్ ఎగ్జిబిషన్ లో మా స్టాల్ ఏర్పాటు చేశామని.. గతంలో నుమయిష్ ఎగ్జిబిషన్ లో ఏర్పాటు చేసిన స్టాల్ కి తెలంగాణ ప్రభుత్వం అవార్డు ఇచ్చిందని తెలిపారు సౌమ్య. జైళ్లను ఎ÷–లాస్టిక్ రహితంగా మార్చేందుకు కృషి చేస్తున్నామని. త్వరలోనే రాష్ట్రంలో ఉన్న జైళ్లను మరమ్మత్తులు చేయడానికి ప్రభుత్వం సన్నద్ధం అవుతుందని సౌమ్య తెలిపారు.

# అమెరికాలో మరోమారు కార్చిచ్చు

## లాస్ ఏంజిల్స్‌లో వేల ఎకరాలు దగ్ధం

## సురక్షిత ప్రాంతాలకు 30వేలమంది తరలింపు

**న్యూయార్క్, అక్షిత ప్రతినిధి :**

అమెరికాలో కుబేరులకు ఆవాసాలైన మూడు నగరాల్లో లాస్ ఏంజెలెస్ ఒకటి. ఇప్పుడు ఆ సిటీలోని అత్యంత ఖరీదైన ప్రదేశాన్ని కార్చిచ్చు చుట్టుముట్టింది. దీంతో వేలాది ఎకరాల్లోని విలాసవంతమైన ఇళ్లు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. ఇక్కడ సంపన్నవర్గాలు నివసించే ది పాలిసాడ్స్ ప్రాంతంలో కార్చిచ్చు చెలరేగింది. దాదాపు 3000 ఎకరాలు దగ్ధమయ్యాయి. దీంతో 30,000 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. చాలామంది తమ సామగ్రి, వాహనాలను అక్కడే వదిలేసి ప్రాణాలు కాపాడుకోవడానికి తరలివెళ్లారు. వీధుల్లో పొగ కమ్మేసింది. మరోవైపు ఒక్కసారిగా ప్రజలు రోడ్ల పైకి రావడంతో చాలాచోట్ల ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఇక్కడ కొండలపై ఉన్న రహదారులు ఇరుగ్గా ఉంటాయి. దీనికితోడు గాలులు ఎక్కువగా వీయడంతో మంటలు తొందరగా వ్యాపిస్తున్నాయి. రాత్రి వేళల్లో ఇక్కడ గంటకు 100 మైళ్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. కాలిఫోర్నియా గవర్నర్ గవిన్ న్యూసమ్ స్పందిస్తూ.. 'చాలా నిర్మాణాలు కాలిపోయాయి. మరికొన్నిచోట్ల కూడా కార్చిచ్చులు పుట్టొచ్చని అగ్నిమాపక శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు' అని తెలిపారు. ఇప్పటివరకు మొత్తం 13,000 నిర్మాణాలకు కార్చిచ్చు ముప్పున్నట్లు లాస్ ఏంజెలెస్ అగ్నిమాక అధికారి క్రిస్టిన్ క్రాప్లీ చెప్పారు. బెవర్లీ హిల్స్, హాలీవుడ్ హిల్స్, మలిబు, శాన్‌ఫెర్నాండో ప్రాంతాలకు కార్చిచ్చు వ్యాపించే ప్రమాదం ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ఇప్పటికే ఇక్కడ్గి÷ర్ అలర్ట్ లెవల్స్‌ను పెంచారు. దాదాపు 62,000 మంది ప్రజలు కొన్ని గంటలుగా విద్యుత్తు లేక ఇబ్బందిపడుతున్నారు. ఇక్కడ మంటలను ఆర్పడానికి విమానాలు, హెలికాప్టర్లు, బుల్డోజర్లను అధికారులు రప్పించారు. హాలీవుడ్ స్టార్లు టామ్ హాంక్స్, రీస్ విథర్స్పూన్, స్పెన్సర్ ప్రాట్, హెడీ మోంటాగ్ వంటి నటుల ఇళ్లు అగ్నికి ఆహుతైనట్లు తెలుస్తోంది. మరికొందరి ఇళ్లు కూడా అగ్నికీలలకు సమీపంలో ఉన్నట్లు తెలుస్తోంది. అధ్యక్షుడు జోబైడెన్ ఇక్కడి కార్చిచ్చుపై స్పందించారు. తరచూ అప్‌డేట్లు తెలుసుకొంటున్నట్లు వెల్లడించారు. అక్కడి ప్రజలకు అవసరమైన అన్నిరకాల సాయాలను శ్వేతసౌధం చేస్తుందన్నారు. స్థానిక అధికారులతో తన బృందం టచ్‌లో ఉన్నట్లు వెల్లడించారు. ఇప్పటికే్గ÷ర్ మేనేజ్‌మెంట్ అసిస్టెంట్ గ్రాంట్‌ను విడుదల చేసినట్లు పేర్కొన్నారు. అక్కడి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. స్థానిక అధికారుల సూచనలు పాటించాలని కోరారు.

# ప్రముఖ నటిపై లైంగిక వేధింపుల కేసులో వ్యాపారి అరెస్టు



**తిరువనంతపురం, అక్షిత ప్రతినిధి :**

సినిమా నటి హనీ రోజ్‌ని లైంగికంగా వేధించిన కేసులో కేరళకు చెందిన ప్రముఖ నగల వ్యాపారి బాబీ చెమ్మనూరు అరెస్టయ్యారు. నటి ఫిర్యాదు అనంతరం కేరళ సర్కారు ఏర్పాటు చేసిన స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ బుధవారం మధ్యాహ్నం బాబీ చెమ్మనూర్‌ను కస్టడీలోకి తీసుకుంది. హనీరోజ్ ఫిర్యాదు మేరకు కేరళ పోలీసులు ఆయనపై నాన్ బెయిలబుల్ సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు. ఇవాళ వాయనాడ్‌లో ఆయనను అరెస్ట్ చేశారు. వ్యాపారి చెమ్మనూర్ అరెస్టుపై నటి హనీరోజ్ స్పందించారు. ఇది తనకు ఎంతో ప్రశాంతమైన రోజని అన్నారు. తాను ఈ విషయాన్ని సీఎం పినరయి విజయన్ దృష్టికి తీసుకెళ్లగానే వ్యాపారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఆమె తెలిపారు. 2012లో వచ్చిన త్రివేండ్రమ్ లాడ్జి సినిమాతో మంచి గుర్తింపు సంపాదించిన హనీరోజ్.. ఇలాంటి మతిలేని మనుషుల గురించి తాను పెద్దగా పట్టించుకోనని, అయితే చెమ్మనూర్ మళ్లీమళ్లీ లైంగికంగా వేధించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశానని చెప్పారు. నాలుగు నెలల క్రితం ఆయన తనపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు తెలిపారు. దాంతో తన కుటుంబం అంతా ఆవేదన చెందినదని చెప్పారు.

# లైంగిక దాడిపై స్టాలిన్ వ్యాఖ్యలు దురదుష్టకరం : పొంగులేటి సుధాకర్‌రెడ్డి

**హైదరాబాద్,**

అన్నా యూనివర్సిటీలో లైంగిక దాడి ఘటనపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అసెంబ్లీ వేదికగా చేసిన వ్యాఖ్యలను అక్కడి బీజేపీ తప్పుపట్టింది. అసెంబ్లీలో సీఎం స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు దురదృష్టకరమని తమిళనాడు బీజేపీ సహ ఇన్‌చార్జి సుధాకర్ రెడ్డి వ్యాఖ్యానించారు. నిందితుడు డీఎంకే సభ్యుడు కాదని, కేవలం డీఎంకే సానుభూతిపరుడు మాత్రమేనని సీఎం స్టాలిన్ చెప్పడం దారుణమని అన్నారు. అన్నా యూనివర్సిటీలో విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడు డీఎంకే సభ్యుడు కాదని, కేవలం డీఎంకే సానుభూతిపరుడు మాత్రమేనని సీఎం ఎలా చెప్పగలిగారని సుధాకర్‌రెడ్డి ప్రశ్నించారు. నిందితుడు డీఎంకే సానుభూతిపరుడు కాబట్టే తాము ఘటనపై సీబీఐ దర్యాప్తు కోసం డిమాండ్ చేస్తున్నామని ఆయన చెప్పారు.

# అనుమానంతో భార్యను హత్య చేసిన భర్త

## ఆమె స్నేహితుడిని హత్య చేసేందుకు ప్లాన్.. పట్టుకున్న పోలీసులు

**న్యూఢిల్లీ, అక్షిత ప్రతినిధి :**

ఒక వ్యక్తి అనుమానంతో భార్యను చంపాడు. శరీరాన్ని ముక్కలుగా నరికి పడేసేందుకు మృతదేహాన్ని దాచాడు. భార్య స్నేహితుడ్ని కూడా హత్య చేసేందుకు ప్లాన్ చేశాడు. అయితే దీనికి ముందే పోలీసులు ఆ వ్యక్తిని అరెస్ట్ చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో ఈ సంఘటన జరిగింది. 26 ఏళ్ల దీపికా చౌహాన్ స్పాలో పనిచేస్తున్నది. ఆమె భర్త ధనరాజ్ బైక్ ట్యాక్సీ రైడర్. మద్యానికి బానిసైన అతడు తన సంపాదనను వ్యసనానికి ఖర్చు చేసేవాడు. దీంతో భార్య దీపిక తన సంపాదనతో ఇంటిని నడుపుతున్నది. కాగా భార్య స్నేహితుడితో ఆమెకు వివాహేతర సంబంధం ఉందని ధనరాజ్ అనుమానించాడు. ఈ నేపథ్యంలో డిసెంబర్ 29న దీపికను హత్య చేశాడు. శరీరాన్ని ముక్కలుగా నరికి పడేసేందుకు మృతదేహాన్ని బెడ్ బాక్స్‌లో దాచాడు. ఆ తర్వాత అమృత్‌సర్ పారిపోయాడు. కొన్ని రోజుల తర్వాత ఢిల్లీకి తిరిగి వచ్చి భార్య స్నేహితుడ్ని కూడా హత్య చేయాలని ప్లాన్ చేశాడు. మరోవైపు హత్య జరిగిన ఐదు రోజుల తర్వాత జనవరి 3న జనక్‌పురిలోని ఇంటి నుంచి దీపిక మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న భర్త ధనరాజ్ కోసం వెతికారు. మొబైల్ ఫోన్ స్విచాఫ్‌లో ఉండటంతో అతడు ఎక్కడ ఉన్నాడో అన్నది గుర్తించలేకపోయారు. అయితే యూపీఐ పేమెంట్ ద్వారా అతడి ఆచూకీని పోలీసులు పసిగట్టారు. భార్య స్నేహితుడ్ని హత్య చేసేందుకు అమృత్‌సర్ నుంచి ఢిల్లీకి బయలుదేరిన అతడ్ని మార్గమధ్యలో అరెస్ట్ చేశారు. అయితే నిందితుడికి గతంలో ఎలాంటి నేర చరిత్ర లేదని పోలీస్ అధికారి వెల్లడించారు.

# బ్యాంకు సిబ్బంది వేధింపులు తాళలేక వ్యక్తి ఆత్మహత్య

**కుమ్రంభీం ఆసిఫాబాద్, అక్షిత ప్రతినిధి :**

తీసుకున్న రుణం చెల్లించలేదని బ్యాంకు సిబ్బంది బెదరింరించడంతో ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ విషాదకర సంఘటన కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) మండలం శివపూర్ గ్రామంలో చోటు చేసకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన కారం సంతోష్(35) అనే వ్యక్తి జిల్లా కొ–ఆపరేటిట్ సొసైటీ బ్యాంకులో లోన్ తీసుకున్నాడు. అయితే డబ్బుల కట్టలేదని బ్యాంకు సిబ్బంది డబ్బులు కట్టాలని బెదిరింపులకు గురిచేశారు. దీంతో మనస్తాపం చెందిన సంతోష్ పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. బాధితుడి కుటుంబ సభ్యులు బ్యాంకు సిబ్బంది పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. సంతోష్ మృతితో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

# కింగ్‌ఫిషర్ బీర్ ప్రియులకు చేదువార్త

**హైదరాబాద్, అక్షిత ప్రతినిధి :**

ఇది బీర్ ప్రియులకు పెద్ద షాక్.. ముఖ్యంగా కింగ్ ఫిసర్ బీర్‌ప్రేమికులకు మింగుడు పడదు. తెలంగాణకు కింగ్ ఫిషర్ల బీర్ల సరఫరా నిలిపివేస్తున్నట్లు యునైటెడ్ బ్రూవరీస్ కంపెనీ స్పష్టం చేసింది. తెలంగాణ స్టేట్ బేవరేజ్ కార్పొరేషన్ లిమిటెడ్ బకాయిలు చెల్లించకపోవడంతో.. ఈ నిర్ణయం తీసుకున్నట్లు యూబీఎల్ ప్రకటించింది. తెలంగాణ ప్రభుత్వం బీర్ల ధరలను పెంచింది కానీ.. తయారీదారులకు చెల్లించే బేస్ ధరను పెంచకపోవడంతో భారీ నష్టాలు వస్తున్నాయని యూబీఎల్ తెలిపింది. బీర్ల సరఫరా నిలిపివేతకు ఇది కూడా ఒక కారణమని కంపెనీ పేర్కొంది. తెలంగాణ నుంచి రూ. 900 కోట్లు రావాల్సి ఉందని పేర్కొంది. ఈ జాప్యం కూడా కంపెనీ నష్టాలకు కారణమైందని తెలిపింది. ఈ విషయాన్ని సెబీకి లేఖ ద్వారా తెలిపింది. కింగ్ ఫిషర్, కింగ్ ఫిషర్ స్ట్రాంగ్, కింగ్ ఫిషర్ అల్ట్రా, కింగ్ ఫిషర్ అల్ట్రా మ్యాక్స్‌తో పాటు ఇతర బ్రాండ్లను నిలిపివేస్తున్నట్లు యూబీఎల్ స్పష్టం చేసింది. నిజానికి తెలంగాణ రాష్ట్రంలో బీర్ల అమ్మకాలను పరిశీలిస్తే కింగ్ ఫిషర్ బ్రాండ్స్ 60 నుంచి 70 శాతం అధికంగా విక్రయం అవుతున్నట్లు తెలిపింది.

# పాలనపై ప్రశ్నించినందుకే కేటీఆర్‌పై కేసులు

## రేవంత్‌కు తగిన గుణపాఠం చెప్తాం : హరీశ్‌రావు

**హైదరాబాద్, అక్షిత ప్రతినిధి :**

కాంగ్రెస్ పాలనపై నిత్యం నిలదీసినందుకే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. రాబోయే రోజుల్లో రేవంత్‌రెడ్డికి ఎలా గుణపాఠం చెప్పాలో మాకు తెలుసునని ఆయన అన్నారు. కేటీఆర్‌కు ఆపద వస్తే పార్టీ మొత్తం అండగా నిలబడుతది అని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ డైరీ ఆవిష్కరణ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం గ్రాఫ్ దిగజారిపోతున్నది.. కాబట్టి ఇలాంటి కేసులు పెట్టి ప్రజలను డైవర్షన్ చేస్తున్నడు. కుట్రలో భాగంగానే కేటీఆర్‌పై అక్రమ కేసు పెట్టిండు. ప్రతి నాయకుడికి, కార్యకర్తకు ఆపదొస్తే బీఆర్ఎస్ ఎట్లా నిలబడ్డదో, పార్టీ మొత్తం కేటీఆర్ వెంట ఉంటది. లగచర్ల గిరిజన రైతుల కోసం కేటీఆర్ ఎంతో కష్టపడ్డారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంటుగా అండగా నిలబడి, న్యాయం చేశాడు అని హరీశ్‌రావు తెలిపారు. ఈ ఏడాది కాలంలో ఏం చేసినవు నాయనా నువ్వు, పబ్లిక్ అటెన్షన్ డైవర్షన్ తప్ప అని రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు మండిపడ్డారు. కేటీఆర్ మీద అక్రమ కేసు పెట్టి, అన్యాయంగా ఇరికించే ప్రయత్నం చేసి, పబ్లిక్ అటెన్షన్ డైవర్షన్ చేస్తున్నవ్. లగచర్ల రైతులను అరెస్టు చేసి, 15 రోజులు డైవర్షన్ చేసినవు. అల్లు అర్జున్ పేరు మీద డైవర్షన్ టాక్టిక్స్ చేసినవు. దానికంటే ముందు తెలంగాణ తల్లి విగ్రహం మార్చి అదో 15 రోజులు డైవర్షన్. టీఎస్‌ను టీజీగా మారుస్తున్నా అని ఒక డైవర్షన్ టాక్టిక్స్. తెలంగాణ ఎంబ్లమ్ మారుస్తున్నా అని చెప్పి డైవర్షన్ టాక్టిక్స్. ఇవి తప్ప నువ్వు ప్రజలకు చేసిందేమైనా ఉన్నదా? నువ్విచ్చిన హామీలు అమలు చేసిందేమన్నా ఉన్నదా? కేసీఆర్ పెట్టిన సంక్షేమ పథకాల పరిస్థితి ఏమైంది? అని హరీశ్‌రావు నిలదీశారు. కేసీఆర్ కిట్లు బంద్ అయిపోయినయి, న్యూట్రిషన్ కిట్లు బంద్ అయిపోయినయి. బతుకమ్మ చీరెలు బంద్ అయిపోయినయి, రైతుబంధు బందయిపోయింది, బీసీ బంధు బందయిపోయింది, దళిత బంధు బందయిపోయింది. ఉన్న పథకాలు బందు పెట్టుడు తప్ప నువ్వు కొత్తగా తెచ్చిందేమన్నా ఉన్నదా? రైతు భరోసా అన్నవు, అపుడేమో ఎకరానికి 15 వేలు ఇస్త అన్నవు. పార్లమెంటు ఎన్నికలకు ముందు ఒక్క పంటకు ఎకరాకు 5 వేలే ఇచ్చినవు. వానాకాలం ఎగ్గొట్టినవు. మళ్లీ ఇపుడు స్థానిక సంస్థల ఎన్నికలున్నాయి గనుక మల్లొక్కసారి రైతుబంధు వేస్తాడు, తర్వాత ఎగ్గొడుతడు ఈ ఎగవేతల రేవంత్ రెడ్డి అని హరీశ్‌రావు తీవ్రంగా విమర్శించారు.

# అస్సాం బొగ్గుగనిలో చిక్కుకున్న 15 మంది కార్మికులు

## గని నుంచి ఒకరి మృతదేహం వెలికితీత

**న్యూఢిల్లీ, అక్షిత ప్రతినిధి :**

అస్సాంలోని డిమా హసావోలోని బొగ్గు గని నుంచి ఓ మృతదేహాన్ని వెలికి తీశారు. రెండు రోజుల క్రితం ఆ గనిలోకి నీరు ప్రవేశించింది. దీంతో దాంట్లో సుమారు 15 మంది కార్మికులు చిక్కుకున్నట్లు కంపెనీ వెల్లడించింది. నీటితో నిండిన గనిలోకి 21 పారా డ్రైవర్లు గాలింపు కోసం వెళ్లారు. గని దిగువ భాగం నుంచి ఓ మృతదేహాన్ని తీసుకువచ్చారు. నేవీ, ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ దళాలు రెస్క్యూ ఆపరేషన్ కొనసాగిస్తున్నాయి. విశాఖపట్టణంకు చెందిన డైవర్లు అక్కడకు చేరుకున్నారు. ఆపరేషన్‌కు ముందు రెక్కీ నిర్వహించి ఆ తర్వాత క్వారీలోకి ఎంటరయ్యారు. గని నుంచి నీటిని తొవ్వేందుకు ఎస్డీఆర్ఎఫ్ డీవాటర్ పంపులను తీసుకువస్తోంది. కుంభీగ్రామ్ నుంచి కూడా ఎంఐ17 హెలికాప్టర్ ద్వారా ఓఎన్జీసీ వాటర్ పైపులను తీసుకువస్తున్నారు. కేంద్ర గనుల శాఖ మంత్రి జీ కిషన్ రెడ్డితో మాట్లాడినట్లు సీఎం హిమంత బిశ్వ శర్మ తెలిపారు. కోల్ ఇండియాకు చెందిన సిబ్బంది.. రెస్క్యూ ఆపరేషన్‌కు రానున్నట్లు మంత్రి తెలిపారు. క్వారీలో నీరు వంద ఫీట్లకు చేరుకున్నది. సుమారు 340 ఫీట్ల లోతులో ఉన్న క్వారీలో కార్మికులు చిక్కుకున్నట్లు తెలుస్తోంది. కార్మికుల పేర్లను కూడా రిలీజ్ చేశారు. అక్రమ రీతిలో గని నిర్వహిస్తున్నట్లు గుర్తించామని సీఎం హిమంత బిశ్వ శర్మ తెలిపారు. ఈ కేసులో ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు పోలీసులు చెప్పారు. ఉమ్రాంగ్సో పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఎన్డీఆర్ఎఫ్ ఫస్ట్ బెటాలియన్ కమాండెంట్ హెచ్పీఎస్ ఖాన్‌దారి మాట్లాడుతూ.. నిన్న చాలాసార్లు కార్మికులను చేరుకునేందుకు ప్రయత్నించామని, కానీ తమ ప్రయత్నాలు ఫలించలేదన్నారు. జాయింట్ టీమ్ ఇవాళ గనిలోకి డైవ్‌చేసిందని, వాళ్లు ఓ బాడీని రికవరీ చేసినట్లు చెప్పారు. గనుల్లో డైవింగ్ చేయడం సులువైన అంశం కాదని, రాట్ హోల్స్ ఉన్నాయని, వాటి ఆధారంగా గాలింపు ఉంటుందని ఆయన తెలిపారు.

www.aakshitha.com
People's voice
అక్షిత
జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY
www.aakshitha.com
సినిమా
CINEMA




# గేమ్ ఛేంజర్ నుంచి మరో సాంగ్ రిలీజ్

మెగా హీరో రామ్ చరణ్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ గేమ్ ఛేంజర్ మరో రెండు రోజుల్లో ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. ఆర్ఆర్ఆర్ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత రామ్ చరణ్ సినిమా వస్తుండటంతో ఈ మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. దిగ్గజ దర్శకుడు శంకర్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. దిల్ రాజు ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. ఇప్పటికే మూవీ నుంచి ట్రైలర్‌తో పాటు పాటలను విడుదల చేయగా.. మంచి రెస్పాన్స్ దక్కించుకున్నాయి. అయితే తాజాగా ఈ మూవీ నుంచి మెలోడి సాంగ్‌ను విడుదల చేశారు మేకర్స్. "అలికి పూసిన అరుగు మీద కలికి సుందరినై కూసుంటే పలకరించవేంది ఓ దొర. చిలక ముక్కు చిన్ని నా దొరా". అంటూ ఈ మెలోడి ఉండగా.. రామ్ చరణ్ అంజలిపై ఈ పాటను చిత్రీకరించినట్లు తెలుస్తుంది. ఈ పాటకు కాసర్ల శ్యామ్ లిరిక్స్ అందించగా.. థమన్, ఎస్ రోషిని జేకేవీ కలిసి పాడారు. థమన్ సంగీతం అందించాడు. ఇప్పటికే జరగండి.. జరగండి, ధోప్, రా మచ్చా సాంగ్‌లతో దూసుకుపోతున్న ఈ చిత్రంకి మెలోడి జత కావడంతో సూపర్ హిట్ కాయం అంటున్నారు అభిమానులు.





# స్టన్నింగ్ స్టిల్స్‌తో సోషల్‌మీడియాను షేక్ చేస్తున్న రాషా థడానీ

# థాయ్‌లాండ్‌కు పయనమైన రజనీకాంత్

తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ ప్రస్తుతం లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో కూలీ సినిమా చేస్తున్నాడని తెలిసిందే. ఈ మూవీ చిత్రీకరణ దశలో ఉంది. కాగా మంగళవారం తలైవా థాయ్‌లాండ్‌కు పయనమయ్యాడు. ఈ సందర్భంగా చెన్నై ఎయిర్‌పోర్టులో మీడియాతో మాట్లాడారు తలైవా. కూలీ 70 శాతం షూటింగ్ పూర్తయిందని చెప్పాడు. అంతేకాదు నెక్ట్స్ షెడ్యూల్ జనవరి 13న మొదలు కానుందని.. ఈ షెడ్యూల్ జనవరి 28 వరకు కొనసాగుతుందన్నాడు. ఇటీవల రాజస్థాన్‌లోని జైపూర్ షూట్ షెడ్యూల్‌లో భాగంగా సంబార్ లేక్ ప్రాంతంలోఅమీర్ ఖాన్, ఉపేంద్ర, తలైవా, రెబా మోనికా జాన్ అండ్ టీంపై వచ్చే సన్నివేశాలను చిత్రీకరించినట్టు వార్తలు వచ్చాయని తెలిసిందే. కూలీ చిత్రాన్ని 2025 మే 1న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు.



# ఆంధ్రాకు సినిమాలంటే... తెలంగాణకు కల్లు, మటన్ అంటే ప్రాణం : దిల్‌రాజ్

టాలీవుడ్ యాక్టర్ వెంకటేశ్ హీరోగా నటిస్తున్న చిత్రం సంక్రాంతికి వస్తున్నాం. అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్నాడు. ఐశ్వర్య రాజేశ్, మీనాక్షి చౌదరి ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రం 2025 సంక్రాంతి కానుకగా జనవరి 14న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో భాగంగా ట్రైలర్‌ను లాంచ్ చేయగా మంచి స్పందన వస్తోంది. ఈ ఈవెంట్‌లో దిల్ రాజు చేసిన కామెంట్స్ నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి. తెలుగు రాష్ట్రాల్లో సినీ జనాలు సినిమాలను ఏ స్థాయిలో ఆదరిస్తారో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ప్రత్యేకించి తెలంగాణలో భాష, ప్రాంతంతో సంబంధం లేకుండా టాలెంట్ ఉన్న ప్రతీ నటీనటులు, టెక్నీషియన్లకు ప్రోత్సహించడంలో ఎప్పుడూ ముందుంటారు. అయితే ఈవెంట్‌లో దిల్ రాజు మాట్లాడుతూ.. 'మావోళ్లకు సినిమా కంటే.. మన దగ్గర సినిమాలు తక్కువ కాబట్టి మీ దగ్గర నుంచి రియాక్షన్ తక్కువ వస్తుందని మా డైరెక్టర్‌కు చెప్పా. ఆంధ్రాకు వెళ్తే సినిమాకు ఒక వైబ్ ఇస్తరు. మన దగ్గర అయితే తెల్ల కల్లు, మటన్‌కు వైబ్ ఇస్తమని (నవ్వుతూ)' అన్నారు. ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి.



# ఆ నోటీసులు అవాస్తవం

## ప్రకటన విడుదల చేసిన చంద్రముఖి నిర్మాణ సంస్థ

లేడీ సూపర్ స్టార్ నయనతారకు చెందిన డాక్యుమెంటరీ వివాదంలో బిగ్ ట్విస్ట్ చోటు చేసుకుంది. చంద్రముఖి నిర్మాతలు నయన్‌కు లీగల్ నోటీసులు ఇచ్చారంటూ నిన్నటి నుంచి తెగ ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. 'నయనతార: బియాండ్ ది ఫెయిరీ టేల్' అనే డాక్యుమెంటరీలో పర్మిషన్ లేకుండా 'చంద్రముఖి' చిత్రంలోని కొన్ని సన్నివేశాలను వాడుకున్నందుకు నయన్ సహా ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్‌కు రూ.5 కోట్లు చెల్లించాలంటూ లీగల్ నోటీసులు జారీ చేసినట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. అయితే, ఈ వార్తలపై 'చంద్రముఖి' సినీ నిర్మాణ సంస్థ శివాజీ ప్రొడక్షన్స్ తాజాగా స్పందించింది. నయన్‌కు తాము ఎలాంటి నోటీసులూ ఇవ్వలేదని సదరు నిర్మాణ సంస్థ క్లారిటీ ఇచ్చింది. 'నయనతార: బియాండ్ ది ఫెయిరీ టేల్' డాక్యుమెంటరీలో 'చంద్రముఖి' సినిమాలోని సన్నివేశాలను తమ పర్మిషన్ తీసుకొనే వినియోగించుకున్నారని స్పష్టం చేసింది. మొత్తం 17 సెకన్ల సన్నివేశాలను రౌడీ పిక్చర్స్ సంస్థ వాడుకోవచ్చని, దీనిపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని తెలిపింది. ఈ మేరకు గతేడాది నవంబర్‌లో జారీ చేసిన నో అబ్జెక్షన్ సర్టిఫికెట్‌ను మీడియాకు విడుదల చేసింది. ఈ ఎన్‌వోసీని మనోబాల విజయబాలన్ తన ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు.

# 10 న వైకుంఠ ఏకాదశి

## సబ్ కలెక్టర్ అమిత్ ను ఆహ్వానించిన

## ఆలయ కమిటీ చైర్మన్ కుశలయ్య




**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి :**

మిర్యాలగూడ పట్టణంలోని గీతా మందిర్ శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ కృష్ణ దేవస్థానంలో అధ్యయనోత్సవ సహిత ధనుర్మాస మహోత్సవానికి ఈనెల 10న శనివారం వైకుంఠ ఏకాదశి మహోత్సవం ప్రత్యేక పూజల్లో పాల్గొనాలని కోరుతూ మిర్యాలగూడ సబ్ కలెక్టర్నారాయణ్ అమిత్ కు ఆహ్వాన పత్రికను ఆలయ కమిటీ అధ్యక్షులు డా. బండారు కుశలయ్య, సభ్యులు యాదగిరి, ప్రసాద్ లు బుధవారం అందజేశారు.

# తప్పిపోయిన మహిళను...! కుటుంబ సభ్యులకు అప్పగించిన సఖి కేంద్రం...!!




**జనగామ, అక్షిత ప్రతినిధి:**

జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం పోచన్నపేట గ్రామంలో మతిస్థిమితం సరిగా లేని మహిళ మూడు రోజుల నుండి గ్రామపంచాయతీ ఆవరణంలో ఉన్నదని తెలుసుకున్న పారలిగల్ వాలంటరీ, అండ్ న్యూస్ రిపోర్టర్ దేవదాస్ 181 హెల్ప్ లైన్ నెంబర్ కు ఇన్ఫర్మేషన్ ఇవ్వడంతో, హెల్ప్ లైన్ నెంబర్ నుండి సమాచారం అందుకున్న సఖి కేంద్ర సిబ్బంది, సంఘటన స్థలానికి వచ్చి ఆ మహిళతో మాట్లాడి సఖి కేంద్రంలో వసతి సౌకర్యం కల్పించడం జరిగింది, తన దగ్గర ఉన్న ఆధార్ కార్డుతో కుటుంబ సభ్యుల వివరాలు కనుకొని, వారిని పిలిపించి ఈరోజు బాధితురాలని కుటుంబ సభ్యులకు అప్పగించడం జరిగింది. నిస్సహాయత స్థితిలో ఉన్న మహిళలు సఖి కేంద్రం అందిస్తున్న సేవలు వినియోగించుకోవాలని, సఖి కేంద్ర నిర్వాహకురాలు రేణుక తెలిపారు.

# రూ.2,600 కోట్లతో గ్రామీణ రహదారుల నిర్మాణం

## ప్రతి ఊరు నుంచి మండలం వరకు ఏర్పాటు

## సిఎం ఆదేశాలతో అధికారులతో మంత్రి సీతక్క సమీక్ష

**హైదరాబాద్, అక్షిత ప్రతినిధి:**

రాష్ట్రంలో రూ.2,600 కోట్లతో గ్రామీణ రహదారుల నిర్మాణం చేపడుతున్నామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ అనసూయ సీతక్క తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి ఆవాసం నుంచి గ్రామపంచాయతీ, అక్కడ నుంచి మండలానికి, జిల్లా కేంద్రానికి రహదారులు నిర్మిస్తున్నామని చెప్పారు. సరైన రహదారి సౌకర్యాలు లేక పోవడమే పల్లెల వెనకబాటుకి కారణమని ప్రభుత్వం పెద్ద ఎత్తున రోడ్ల నిర్మాణాన్ని చేపడుతోందని అన్నారు. ఎర్రమంజిలోని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ కార్యాలయంలో రూరల్ ఇంజనీర్లతో మంత్రి సీతక్క బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, ఇంజినీర్ ఇన్ చీఫ్ కనక రత్నం, చీఫ్ ఇంజనీర్లు, సీఈలు, ఈఈలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రోడ్ల నిర్వహణ కోసం రూ.1600 కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. ఇందుకు అనుగుణంగా రూరల్ ఇంజనీర్లు కార్యాచరణ సిద్ధం చేయాలని, కొత్త రహదారుల నిర్మాణ అంచనాలు పక్కాగా ఉండాలని సూచించారు. ఇష్టా రీతినా అంచనాలను సవరించొద్దని తెలిపారు. 30 మెట్రిక్ టన్నుల వాహనాలు నడిచేలా రోడ్ల సామర్థ్యాన్ని మెరుగుపరచాలని అన్నారు. ఇంజనీర్లే ఈ దేశ నిర్మాతలని అన్న మంత్రి మోక్షగుండం విశ్వేశ్వరయ్య, కాకతీయుల కాలం నాడు కట్టిన కట్టడాలు ఇంకా పటిష్టంగా ఉన్నాయని గుర్తు చేశారు. అదే రీతిన గ్రామీణ ప్రాంతాల్లోని ఇంజనీర్లు కట్టే నిర్మాణాలు 10 తరాలు ఉండేవిధంగా చూడాలని పేర్కొన్నారు. మహానగరాల్లో రోడ్లు మెరిసినట్టుగానే ప్లలెల్లో రహదారులు మెరవాలని, ఆ బాధ్యత గ్రామీణ విభాగానికి చెందిన ఇంజినీరింగ్ అధికారులదేనని అన్నారు. పెరుగుతున్న రవాణా అవసరాలకు అనుగుణంగా రహదారుల నిర్మాణం జరగాలని అన్నారు. నాణ్యతపై రాజీ పడొద్దని, జిల్లా స్థాయిలో రూరల్ ఇంజనీర్లు ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్ష నిర్వహించాలని అన్నారు. పనుల పురోగతి నివేదికలను ప్రతి 15 రోజులకు నివేదించాలని అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గుండివాగు బ్రిడ్జి 10 ఏండ్లుగా పూర్తికాలేదని, దీనివల్ల 40 మంది ప్రజలు వాగు దాటలేక మృత్యువాత పడ్డారని మంత్రి అన్నారు. గతంలో తన నియోజకవర్గంలో సరైన గ్రామీణ రోడ్లు లేక ఎంతో మంది ఆత్మీయులను రోడ్డు ప్రమాదంలో కోల్పోయానని చెప్పారు. పట్టణాల్లో÷÷-లఓల్గ÷వర్లు, స్కై ఓవర్లు ఉన్నాయి, కానీ చాలా గ్రామాల్లో కనీస రోడ్డు సదుపాయం లేకపోవడం బాధాకరమని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. మారుమూల ప్లలెలకు రహదారి సౌకర్యం కలిగిస్తేనే అసలైన అభివృద్ధి అని పేర్కొన్నారు. ఎస్టి వర్గానికి చెందిన తనకు పంచాయతీరాజ్ శాఖ అప్పగించారని అన్నారు. రూరల్ ఇంజనీర్లు సహకారం ఉంటే ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని అన్నారు. రోడ్డు సదుపాయం లేని ఆవాసాలు, గ్రామాలు ఉండొద్దని, ఆ లక్ష్యంతో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ భాగం పని చేయాలని మంత్రి సీతక్క ఆకాంక్షించారు.

# ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి పెద్ద అడుగు

## డబుల్ ఇంజన్ సర్కార్‌తో ఇక పరుగులు

## గత ఐదేళ్ల పాలనలో ఎపిలో విధ్వంసం

## రైల్వేజోన్ సహా అనేక పరిశ్రమలకు శ్రీకారం

## ముంబై తరహాలో ఆర్థిక నగరంగా విశాఖ అభివృద్ధి

## ప్రపంచం మెచ్చే నాయకుడు ప్రధాని మోడీ

## ఇద్దరం కలసి ఎపి అభివృద్ధికి కృషి చేస్తాం

## విశాఖ బహిరంగ సభలో సిఎం చంద్రబాబు



**విశాఖపట్నం,**

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి పెద్ద అడుగు పడిందని, డబుల్ ఇంజన్ సర్కార్‌తో అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎపి సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పడ్డ తరవాత ఎపిలో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. అయితే గత ఐదేళ్ల విధ్వంస పాలనతో ఎపి ఎంతగానో నష్టపోయిందన్నారు. ప్రజలు ఆశీర్వదిస్తేనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. విశాఖలో ప్రధాని సమక్షంలో అనేక కార్యక్రమాలకు శంకుస్థాపన జరిగిన సందర్భంగా జరిగిన సభలో సిఎంచంద్రబాబు మాట్లాడారు. ప్రపంచం మెచ్చే ఏకైక నాయకుడు ప్రధాని మోదీ అని సీఎం చంద్రబాబు అన్నారు. ఏపీలో రూ.2.08 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో చంద్రబాబు ప్రసంగించారు. 'ఏపీలో ఎన్డీఏ కూటమి 93 శాతం స్ట్రైక్ రేట్‌తో ఘన విజయం సాధించింది. భవిష్యత్తులోనూ ఈ కాంబినేషన్ కొనసాగుతుంది, దేశ రాజకీయాల్లో మోదీ ప్రధానిగా ఉంటారు. దిల్లీ ఎన్నికల్లోనూ ఎన్డీఏ గెలుస్తుంది.. రాసి పెట్టుకోండి. పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు మోదీ కృషి చేస్తున్నారు. సంక్షేమం, అభివృద్ధి, సంస్కరణలు, సుపరిపాలన.. మోదీ నినాదాలు. దేశాన్ని బలమైన ఆర్థిక శక్తిగా మార్చేందుకు మేకిన్ ఇండియా తెచ్చారు. స్టార్టప్ ఇండియా, స్కిల్ ఇండియా, గతిశక్తి తెచ్చారు. దేశానికి ఆర్థిక రాజధానిగా ముంబయి ఎలా ఉందో.. ఏపీకి విశాఖ అలాంటి ఆర్థిక నగరం' అని చంద్రబాబు వివరించారు. 'మోదీని స్ఫూర్తిగా తీసుకొని నిత్యం ముందుకెళ్తాం. త్వరలో అమరావతికి రావాలని ప్రధానిని కోరుతున్నా. నదుల అనుసంధానం మా లక్ష్యం.. అందుకు కేంద్రం సాయం కావాలి. మోదీ కార్యక్రమాల వల్ల దేశం అభివృద్ధిలో దూసుకుపోతోంది. 2047 నాటికి ప్రపంచంలోనే మొదటి లేదా రెండో స్థానంలో ఉంటాం. రాష్ట్ర విభజన తర్వాత అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నాం. కేంద్రం సాయంతో నిలదొక్కుకున్నాం.. ముందుకెళ్తున్నాం. సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేసే బాధ్యత మాది. కేంద్రం అండతో రాష్ట్రంలో పెట్టుబడులు ఊపందుకున్నాయి. అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధి.. కూటమి ప్రభుత్వ లక్ష్యం అని చంద్రబాబు వివరించారు. రాష్ట్రంలో 20లక్షల ఉద్యోగాలు ఇచ్చే బాధ్యత మాది. కొప్పర్తి, ఓర్వకల్లు.. పారిశ్రామిక ప్రాంతాలుగా మారుతున్నాయి. అరకు కాఫీని మోదీ బాగా ప్రచారం చేస్తున్నారు. ఏ సమస్య చెప్పినా ఆయన వెంటనే అర్థం చేసుకుంటారు. వెంటనే పనులు జరిగేలా చొరవ చూపిస్తారు. గతంలో ఏ ప్రధాని కూడా ఇంతలా చొరవ చూపలేదు. మన దేశానికి సరైన సమయంలో సరైన ప్రధాని ఉన్నారు' అని చంద్రబాబు కొనియాడారు. అంతకుముందు ప్రధాని మోడీకి సిఎం చంద్రబాబు, డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విశాఖ నగరంలో ఏర్పాటు చేసిన రోడ్ షో అదిరిపోయిందని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు చెప్పారు. నగరంలో ఏర్పాటు చేసిన సభకు వచ్చిన ప్రజలను చూస్తుంటే ఎక్కడ లేని ఉత్సాహం వస్తోందని చంద్రబాబు తెలిపారు. విశాఖ సభకు హాజరైన ప్రతి ఒక్కరికీ పేరుపేరున నమస్కారాలు తెలియజేస్తున్నట్లు ఆయన చెప్పారు. సభకు విచ్చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, గవర్నర్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఎక్కడికెళ్లినా ప్రధాన మంత్రిపై ప్రజలు నమ్మకం చూపిస్తున్నారని ముఖ్యమంత్రి చెప్పారు. దేశ ప్రజలకు మోదీపై నమ్మకం, విశ్వాసం ఉందని ఆయన తెలిపారు. ప్రధాన మంత్రి చేతులమీదుగా రూ.2.08,545 కోట్ల పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేసినట్లు చెప్పుకొచ్చారు. ఇలాంటి సంఘటన తన జీవితంలో, ఆంధ్రరాష్ట్ర చరిత్రలో మొట్టమెదటిసారిగా జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ..' విశాఖ రైల్వేజోన్ కల సాకారమైంది. రూ.2.08 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేశాం. ఏడు రైల్వే ప్రాజెక్టులకు సైతం శంకుస్థాపనలు చేసుకున్నాం. నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్కు వస్తోంది. పూడిమడక దగ్గర ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ పార్క్‌కు శంకుస్థాపన చేసుకున్నాం. ఏపీ చరిత్రలోనే ఇది నిలిచిపోయే రోజు. భవిష్యత్‌లోనూ మా కూటమి కొనసాగుతుంది. ఢిల్లీలో గెలవబోయేది ఎన్డీఏనే. మేమంతా మోదీతోనే ఉంటాం. అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తూ.. ప్రజలకు దగ్గరైన వ్యక్తి మోదీ. మా కాంబినేషన్ ఎప్పటికీ ఉంటుంది. ప్రధానిగా మోదీ ఉంటారు. ప్రపంచం మెచ్చే నాయకుడు మోదీ. దేశం కోసం పనిచేసే నాయకుడు మోదీ' అని చెప్పారు.గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు లోకేశ్, అనిత, టీజీ భరత్, కార్యక్రమంలో పాల్గొన్నారు.

# గ్రూప్-3 ప్రిలిమనరీ కీ విడుదల

## 12 వరకు అభ్యంతరాల స్వీకరణ

## మే 1 నుంచి కొత్త ఉద్యోగాలకు నోటిఫికేషన్లు

## టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం వెల్లడి

**హైదరాబాద్, అక్షిత ప్రతినిధి:**

రాష్ట్రంలో 1,365 ఉద్యోగ ఖాళీలకు నిర్వహించిన గ్రూప్ -3 పరీక్ష ప్రిలిమినరీ కీని టీజీపీఎస్సీ విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 1,401 కేంద్రాల్లో గతేడాది నవంబర్ 17, 18 తేదీల్లో ఈ పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే. మొత్తం మూడు పేపర్లుగా నిర్వహించిన ఈ పరీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా 5.36లక్షల మంది దరఖాస్తు చేసుకోగా.. 2,69,483 మంది మాత్రమే పరీక్షకు హాజరయ్యారు. గ్రూప్ 3 ప్రిలిమినరీ కీపై జనవరి 12 సాయంత్రం 5గంటల వరకు అభ్యంతరాలు స్వీకరించనున్నారు. ఇంగ్లిష్‌లోనే అభ్యంతరాలను తెలపాలని, అభ్యర్థులు లేవనెత్తిన అంశాలకు సంబంధించిన ఆధారాల కాపీలను ఆన్‌లైన్‌లో సబ్‌మిట్ చేయాలని సూచించారు. ఈ-మెయిల్, వ్యక్తిగతంగా వెళ్లి సమర్పించడాన్ని ఎట్టిపరిస్థితుల్లో అనుమతించబోమని స్పష్టంచేశారు. ఇదిలావుంటే మే 1 నుంచి కొత్త ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల చేస్తామని టీజీపీఎస్సీ వెల్లడించింది. మార్చి 31లోగా ఉద్యోగ ఖాళీల వివరాలను ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినట్లు పేర్కొంది. ఖాళీల ప్రకారం నోటిఫికేషన్ల జారీపై ఏప్రిల్‌లో కసరత్తు చేస్తామని తెలిపింది. కొత్త నోటిఫికేషన్లు ఇచ్చి 6-8 నెలల్లో భర్తీ ప్రక్రియను పూర్తి చేస్తామని కమిషన్ ప్రకటించింది. గురువారం గ్రూప్-3 'కీ' విడుదల చేయనుంది. రెండ్రోజుల్లో గ్రూప్-2 'కీ' విడుదల చేయనున్నట్టు టీజీపీఎస్సీ తెలిపింది. షెడ్యూల్ ప్రకారం ఫలితాలు వచ్చేలా పనిచేస్తున్నామని టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం తెలిపారు. ఈనెల 11, 12 తేదీల్లో బెంగళూరులో పబ్లిక్ సర్వీస్ కమిషన్ల సదస్సు ఉంటుందని, ఉద్యోగ పరీక్షల విధానాలపై సదస్సులో చర్చించనున్నట్టు చెప్పారు.

# హ్యాట్రిక్ విజయం కోసం ఆప్ కృషి

## ఆప్‌కు మద్దతు పలికిన మమతా బెనర్జీ

## ఎక్స్ వేదికగా కృతజ్ఞతలు తెలిపిన కేజ్రీవాల్

**న్యూఢిల్లీ, అక్షిత ప్రతినిధి:**

దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం కోసం తీవ్రంగా శ్రమిస్తోన్న ఆమ్ ఆద్మీ పార్టీకి తృణమూల్ కాంగ్రెస్ మద్దతు ప్రకటించింది. ఫిబ్రవరి 5న జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు బెంగాల్ సీఎం మమతా బెనర్జీ మద్దతు ప్రకటించినట్లు ఆప్ జాతీయ కన్వీనర్, దిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆయన 'థాంక్యూ దీదీ' అంటూ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. 'దిల్లీ ఎన్నికల్లో ఆప్‌నకు తృణమూల్ కాంగ్రెస్ మద్దతు ప్రకటించింది. మమత దీదీకి వ్యక్తిగతంగా కృతజ్ఞతలు తెలుపుతున్నా. థాంక్యూ దీదీ. మా మంచి చెడుల్లో మీరు ఎల్లప్పుడూ అండగా నిలిచారు' అని కేజ్రీవాల్ పేర్కొన్నారు. తాజా పరిణామంతో దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్‌నకు మద్దతుగా నిలిచిన 'ఇండియా' కూటమి మిత్రపక్షాల జాబితాలో తాజాగా ఆప్ చేరడం గమనార్హం. గతంలో సమాజ్‌వాదీ పార్టీ, శివసేన (యూబీటీ) కేజ్రీవాల్‌కు మద్దతు ప్రకటించాయి. గతేడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్న ఆప్.. ఆ తర్వాత జరిగిన హరియాణా ఎన్నికల్లో ఒంటరి పోరాటం చేసిన విషయం తెలిసిందే. దిల్లీలో మొత్తం 70 అసెంబ్లీ స్థానాలు ఉండగా.. 2015లో 67 స్థానాలు గెలుచుకొని తొలిసారి అధికారంలోకి వచ్చిన ఆప్.. ఆ తర్వాత 2020లో 62 సీట్లతో అధికారం నిలబెట్టుకుని ఇప్పుడు హ్యాట్రిక్ విజయం కోసం కృషిచేస్తోంది.

# పుష్పలో అదనపు సన్నివేశాల విడుదల

## సాంకేతిక కారణాలతో 17కు వాయిదా

**హైదరాబాద్, అక్షిత ప్రతినిధి:**

కొన్ని అదనపు సన్నివేశాలతో కూడిన 'పుష్ప 2' రీలోడెడ్ వెర్షన్‌ను విడుదల చేయాల్సి ఉన్నా...అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్టు చిత్ర బృందం వెల్లడించింది. సంబంధిత కంటెంట్ విషయంలో సాంకేతిక కారణాల వల్ల ఆలస్యమవుతోందని తెలిపింది. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టు పెట్టింది. ఈ నెల 17 నుంచి కొత్త సన్నివేశాలతో కూడిన సినిమాని చూడొచ్చని పేర్కొంది. ప్రస్తుతం థియేటర్లలో ప్రదర్శితమవుతున్న చిత్రానికి అదనంగా 20 నిమిషాల నిడివి గల సన్నివేశాలను జోడిస్తున్నామని, ఈ నెల 11 నుంచి చూడొచ్చని మంగళవారం ప్రకటన వెలువడిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం 'పుష్ప 2' నిడివి 3 గంటల 20 నిమిషాల 38 సెకన్లు ఉండగా.. దానికి ఇంకా 20 నిమిషాల సీన్స్ యాడ్ చేస్తే, 3 గంటల 40 నిమిషాలు దాటిపోతుంది. అంటే ఇంటర్వెల్‌తో కలిపి దాదాపు 4 గంటల పాటు 'పుష్ప' ప్రపంచంలో ప్రేక్షకుడు ఉంటాడు. మరోవైపు, ఈ చిత్రం ఇప్పటికే సరికొత్త రికార్డులను క్రియేట్ చేసింది. రూ.1000 కోట్లకుపైగా వసూళ్లు సాధించిన భారతీయ చిత్రాల జాబితాలో రెండో స్థానంలో, తెలుగు సినిమాల లిస్ట్‌లో ప్రథమ స్థానంలోకి వచ్చింది. 'దంగల్' (రూ. 2 వేల కోట్లకుపైగా) తర్వాత ఇప్పటి వరకూ రెండో ప్లేస్‌లో ఉన్న 'బాహుబలి 2' (రూ.1810 కోట్లు)ను రికార్డును బ్రేక్ చేసింది. 32 రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా రూ.1831 కోట్లు (గ్రాస్) రాబట్టింది.

# విందుభోజనంలో విషం కలిపిన దుర్మార్గుడు

## బంధువుల అప్రమత్తంతో తప్పిన పెనుముప్పు

**ముంబయి, అక్షిత ప్రతినిధి:**

వివాహ రిసెప్షన్‌లో ఓ వ్యక్తి దుశ్చర్యకు పాల్పడ్డాడు. అతిథుల కోసం ఏర్పాటు చేసిన విందు భోజనంలో విషం కలిపాడు. తన మేనకోడలు తనకు ఇష్టం లేని పెళ్లి చేసుకోవడమే అందుకు కారణం. ఈ ఘటన మహారాష్ట్రలోని కొల్హాపుర్ జిల్లాలో చోటు చేసుకుంది. జిల్లాలోని ఉత్రే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. తన ఇంట్లోనే పెరిగిన మేనకోడలు మరో వ్యక్తిని ప్రేమించి వివాహం చేసుకుంది. తనకు ఇష్టం లేని పెళ్లి చేసుకోవడంతో ఆమెపై కోపం పెంచుకున్నాడు. ఇటీవల మేనకోడలి పెళ్లి రిసెప్షన్‌కి వెళ్లిన అతడు ఈ దుశ్చర్యకు పాల్పడ్డాడు. అతిథుల కోసం ఏర్పాటు చేసిన వంటకాల్లో విషం కలిపాడు. ఇది గమనించిన కొందరు అతడిని అడ్డుకున్నారు. సమాచారం అందడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. కానీ, అప్పటికే నిందితుడు పారిపోయాడు. ఆ ఆహార పదార్థాలను ఎవరూ తినకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. ఆహార పదార్థాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు.


# నేడు ఒడిషా పర్యనటకు ప్రధాని మోడీ

**విశాఖపట్నం అక్షిత ప్రతినిధి:**

ప్రధాని తర్వాత పర్యటనలో భాగంగా రెండోరోజు గురువారం ఉదయం 10 గంటలకు భువనేశ్వర్‌లో 18వ ప్రవాసీ భారతీయ దివస్ సదస్సును ప్రారంభించనున్నారు. గ్రీన్ ఎనర్జీ, సుస్థిర భవిష్యత్తును ప్రోత్సహించే ప్రయత్నానికి మరో ముఖ్యమైన ముందడుగు వేయనున్నారు. ప్రవాసీ భారతీయ దివస్ అనేది భారత ప్రభుత్వం ఫ్లాగ్‌షిప్ ఈవెంట్. ఇది విదేశీయులు, భారతీయులతో కనెక్ట్ అవ్వడానికి, ఒకరితో ఒకరు పరస్పరం సంభాషించడానికి ఒక ముఖ్యమైన వేదికగా నిలుస్తుంది.

Edited, Printed, Published & Owned by Mathangi Guruvaiah, and Printed at Spoorthi Publications, H.No.7-1059/1, Bangarugadda, Miryalaguda, Nalgonda District - Telangana, and Published at H.No.7-1059/1,Bangarugadda, Miryalaguda, Nalgonda District - Telangana. Editor : Mathangi Guruvaiah, Email : akshithadaily@gmail.com, Cell: 9000556444 RNI NO.APTEL/2011/37073

అవినీతి లేని సమాజాన్ని నిర్మిద్దాం



వార్త 8లో




www.aakshitha.com

People's voice

అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

తెలంగాణ దిక్సూచి

గురువారం, 9 జనవరి 2025

పేజీలు : 8


# ధరణి దరఖాస్తులకు మోక్షం

## డ్రైవ్ మోడ్‌లో పరిష్కరించాలి

## కలెక్టర్ ఇలా త్రిపాఠి



నల్గొండ, అక్షిత ప్రతినిధి :

ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా డ్రైవ్ మోడ్‌లో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు.బుధవారం ఆమె నల్గొండ జిల్లా, కేతేపల్లి మండల తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి ధరణి ఫైళ్లను, ధరణి పోర్టల్ లో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను పరిశీలించారు.సక్సేషన్, మ్యుటేషన్లను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని, ఎక్కువ రోజులు పెండింగ్ లో లేకుండా చూసుకోవాలని అన్నారు. భూమి సమస్యలతో పాటు, ఇతర రెవిన్యూ అంశాలకు సంబంధించిన పిర్యాదులన్ని సకాలంలో పరిష్కరించి సమస్యలు లేని కార్యాలయంగా తీర్చిదిద్దాలని అన్నారు. ప్రతి విషయంపై క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని ,క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించే వాటిని క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహించి పరిష్కరించాలన్నారు. ఎలాంటి సమస్య లేకున్నా పదేపదే సమర్పించే బోగస్ దరఖాస్తుల పై ప్రత్యేక దృష్టి కేంద్రకరించి మరోసారి దరఖాస్తు చేయకుండా చర్య తీసుకోవాలని చెప్పారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బండపాలెం గ్రామానికి చెందిన భూమి సమస్యపై వచ్చిన పిర్యాదుదారులతో మాట్లాడారు. భూమి మోకాపై ఉన్నవారు, పట్టా వివరాలు, ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. వివాదం ఉన్న భూమి విషయంలో ఇరువైపులా నిరభ్యంతర ధ్రువ పత్రాన్ని తీసుకొని భూమి మోకా మీద ఉన్న వారికి నిబంధనల ప్రకారం పట్టా చేయాలని తహసిల్దారు మధుసూదన్ రెడ్డికి సూచించారు. ఎంపిటిఓ తో మాట్లాడుతూ గ్రామాలలో పారిశుధ్యం కొరవకుండా చర్యలు తీసుకోవాలని ,ఇందిరమ్మ ఇండ్ల సర్వే డేటా ఎంట్రీ తదితర అంశాలపై సూచనలు చేశారు. తరచు పాఠశాలలు,ఇతర సంస్థలు సందర్శించాలని ఆదేశించారు. తహసిల్దార్ మధుసూదన్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.



## బాధితురానికి సీఎం సహాయనిధి చెక్కు

వార్త 8లో



## నల్లా పన్ను వసూలుకు 8 బిల్లింగ్ మిషన్లు

వార్త 8లో

## మాడుగులపల్లి తాసిల్దారుగా సురేష్ బాధ్యతలు



మాడుగులపల్లి అక్షిత ప్రతినిధి

మాడుగులపల్లి నూతన తాసిల్దారుగా సురేష్ ను నియమిస్తూ జిల్లా కలెక్టర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం మాడుగుల పల్లి మండల తాసిల్దార్ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు సురేష్ చేపట్టారు. అనంతరం కార్యాలయ సిబ్బంది నూతనంగా బాధ్యతలు చేపట్టిన తాసిల్దార్ కు స్వాగతం పలుకుతూ సన్మానం చేశారు.

# మహిళలంతా మహాలక్ష్మిలు

## 270 ఎకరాల్లో సోలార్ ప్లాంట్లు

## భట్టి విక్రమార్క



వార్త 2లో



## ఉపాధి యాక్షన్ ప్లాన్‌తో పనులు చేపట్టాలి

వార్త 8లో

# మహిళలంతా మహాలక్ష్మిలు

## 270 ఎకరాల్లో సోలార్ ప్లాంట్లు భట్టి విక్రమార్క



**నల్గొండ, అక్షిత ప్రతినిధి :**

నల్గొండ జిల్లాలో స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు 270 ఎకరాల స్థలాన్ని గుర్తించినట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్కకు తెలిపారు.రాష్ట్రంలో మహిళలందరినిమహాలక్ష్మిలుగా తీర్చిదిద్దేందుకు, వారికి ఆర్థిక సాధికారతను కల్పించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వివిధ కార్యక్రమాల ద్వారా ప్రయత్నం చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా రాష్ట్రంలోని స్వయం సహాయక మహిళా సంఘాలకు సుమారు 1000 మెగావాట్ల సోలార్ పవర్ విద్యుత్ ఉత్పత్తిని చేపట్టి వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం గత నవంబర్లో ఇంధన, గ్రామీణాభివృద్ధి శాఖలు ఎంఓయు సైతం చేసుకున్నాయి. ఇందులో భాగంగా ఒక్కో మెగావాట్ కు 4 ఎకరాల చొప్పున ప్రతి జిల్లాలో కనీసం 100 నుండి 150 ఎకరాలకు తగ్గకుండా ప్రభుత్వ స్థలాన్ని గుర్తించాలని ప్రభుత్వం జిల్లా కలెక్టర్లను ఇదివరకే ఆదేశించింది.ఇందులో భాగంగా ఈ విషయమై బుధవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ,రాష్ట్ర సీనియర్ అధికారులతో కలిసి హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, అటవీ,ట్రాన్స్కో, తదితర శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు జిల్లాల వారీగా గుర్తించిన భూముల వివరాలు, తీసుకున్న చర్యలపై ఉప ముఖ్యమంత్రి కోరిన సందర్భంలో నల్గొండ జిల్లా వివరాలను జిల్లా కలెక్టర్ తెలియజేస్తూ జిల్లా వ్యాప్తంగా 11 సైట్లలో 270 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించడం జరిగిందని, ఇదివరకే రెవెన్యూ, ఫారెస్ట్ ఇతర అధికారుల ఉమ్మడి తనిఖీ సైతం పూర్తి చేసినట్లు తెలిపారు. మరోసారి ఆదివారంలోగా తనిఖీ నిర్వహించి ఆ భూములలో సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు ఉన్న అవకాశాలపై నివేదికను సమర్పిస్తామని తెలిపారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సంక్రాంతి లోపు గుర్తించిన భూముల ఉమ్మడి తనిఖీ, మ్యాచింగ్, బ్యాచింగ్ సైతాన్ని పూర్తి చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు . అంతకుముందు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్రంలోని మహిళలకు ఆర్థిక సాధికారత కల్పించేందుకు ప్రభుత్వం వివిధ రకాల కార్యక్రమాలను చురుకుగా అమలు చేస్తున్నదని, ఇందులో భాగంగా 1000 మెగావాట్ల సోలార్ పవర్ ఉత్పత్తిని చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దీనివల్ల మహిళలకు ఆర్థికపరమైన సాధికారత లభిస్తుందన్నారు. ఇందుకుగాను అన్ని జిల్లాలలో జిల్లా కలెక్టర్లు తక్షణమే సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు భూమి గుర్తింపుతో పాటు ,ఆర్థికపరమైన చేయూతకు బ్యాంకు అధికారులతో ప్రత్యక్షంగా మాట్లాడాలని, గుర్తించిన భూములలో ఉమ్మడి తనిఖీలు నిర్వహించి ఆ భూములలో పవర్ ప్లాంట్ ఏర్పాట్లకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా నాలుగువేల ఎకరాలకు గాను ఇప్పటివరకు సుమారు 890 ఎకరాలు గుర్తించడం జరిగిందని, తక్షణమే తక్కిన భూములు గుర్తించాలని, ప్రభుత్వం ఆశించిన లక్ష్యాలను త్వరితగతిన అమలు చేయాల్సిన బాధ్యత జిల్లా అధికారులపై ఉందని అన్నారు. అటవీ భూములలో విద్యుదీకరణ కష్టం కాబట్టి సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తే గిరిజనులు పండించుకునేందుకు వీలు కలుగుతుందని అన్నారు. అటవీ గిరిజన సంక్షేమ గ్రామీణాభివృద్ధి శాఖల ద్వారా అటవీ భూముల్లో భూమి అభివృద్ధి, గిరిజనులకు ఆదాయం వచ్చే కార్యక్రమాలను చేపట్టాలని, వీటిని ప్రాధాన్యత క్రమంలో తీసుకొని త్వరితగతన పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. అలాగే మహిళా సంఘాల ద్వారా సూక్ష్మ, మధ్యతరహ పరిశ్రమల ఏర్పాటుకు అన్ని జిల్లాల్లో 5 ఎకరాల లోపు స్థలాన్ని గుర్తించాలని ఆయన ఆదేశించారు.రాష్ట్రస్థాయి నుండి ఈ వీడియో కాన్ఫరెన్స్ కు రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ లోకేష్, సెర్ప్ సీఈవో దివ్య ,సీఎం కార్యదర్శి, ట్రాన్స్కో సిఎండి కృష్ణ భాస్కర్ హాజరుకాగా, జిల్లా నుండి జిల్లా అటవీ శాఖ అధికారి రాజశేఖర్, డి ఆర్ డి ఓ శేఖర్ రెడ్డి, ట్రాన్స్కో ఎస్ ఈ వెంకటేశ్వర్లు, రెడ్ కో జిల్లా మేనేజర్ ఎం. పాండురంగారావు తదితరులు హాజరయ్యారు.

# అక్రమ డిప్యూటేషన్ ను రద్దుచేయలి.

**మంగపేట, అక్షర న్యూస్ :**

మంగపేట మండలంలోని అక్కినేపల్లిమల్లారం గ్రామం విద్యార్థుల తల్లిదండ్రుల ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి అఖినేపల్లిమల్లారం ప్రాథమికోన్నత పాఠశాల ముందు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ములుగు జిల్లా మంగపేట మండలం ఏజెన్సీ గ్రామం అఖినేపల్లిమల్లారం పరిధిలోని ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తూ డిప్యూటేషన్ పై వెళ్లిన ఉపాధ్యాయులను తిరిగి పాఠశాలకు రప్పించాలని వారి డిప్యూటేషన్ ను వెంటనే క్యాన్సల్ చేయాలని విద్యార్థుల తల్లీ తండ్రు లు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు తమకు ఇష్టం వచ్చినట్టు డిప్యూటేషన్ పై వెళితే విద్యార్థులు తమ చదువును నష్టపోతున్నారని పేద విద్యార్థులను విద్యకు దూరం చేసే కుట్ర జరుగుతుందని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపట్టారు.



# జాతీయ రోడ్డు భద్రత మాస ఉత్సవాల్లో భాగంగా... డ్రైవర్లకు అవగాహన...

**జనగామ, అక్షిత ప్రతినిధి:**

జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా బుధవారం రోజు జనగామ ఏరియా హాస్పిటల్ దగ్గర అంబులెన్స్ డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు... అంబులెన్స్ డ్రైవర్లు పాటించవలసిన నియమ నిబంధనల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా రవాణా అధికారి జీవి శ్రీనివాస్ గౌడ్, కానిస్టేబుల్ వెంకటేష్ , సమద్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఉప్పల్ గ్రామంను ప్రత్యేక మండలం చేయాలని గ్రామసభ తీర్మానం.




**కమలాపూర్, జనవరి 8, అక్షిత ప్రతినిధి:**

కమలాపురం మండల కేంద్రంలోని ఉప్పల్ గ్రామాన్ని ప్రత్యేక మండలం గా ఏర్పాటు చేయాలని గ్రామ సభలో ఏకగ్రీవంగా తీర్మానించారు ఉప్పల్ ,ఉప్పలపల్లి, భీంపల్లి, కన్నూర్ ,కొత్తపల్లె, గుండేడు, కానీపర్తి ,హుజురాబాద్(%వీ%) ధర్మరాజు పల్లె తదితరుల గ్రామాలను కలిసి ఉప్పల్ ను నూతన మండలం గా ఎంపిక చేయాలని గ్రామ సభ తీర్మానం చేశారు. ఈ తీర్మానాన్ని తెలంగాణ ప్రభుత్వానికి నివేదిస్తామని అధికారులు తెలిపారు... ఈ కార్యక్రమంలో ఉప్పల్ సిబ్బంది పాల్గొన్నారు.......

# సంక్రాంతికి ఊరెళ్లు తున్నారా..అయితే భద్రం

## పోలీసులు హెచ్చరికలు జారీ

**హైదరాబాద్, అక్షిత ప్రతినిధి:**

సంక్రాంతి పండుగ సందర్భంగా చాలా మంది ఊళ్లకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. కానీ. ఈ సమయంలో అదనుగా దొంగలు చేతివాటం ప్రదర్శించడానికి అనువైన సమయం. అందుకే, సైబరాబాద్ పోలీసులు ప్రజలను అప్రమత్తం చేస్తూ కొన్ని సూచనలు చేశారు. సంక్రాంతికి ఊరికి వెళ్లే వారికి పోలీసులు ఇచ్చిన సూచనల మేరకు... దూర ప్రాంతాలకు వెళ్ళే వారు తమ ఇంటి చిరునామా, ఫోన్ నంబర్‌ను సంబంధిత పోలీస్ స్టేషన్‌కు తెలపాలి. దాంతో పోలీసులు, వారి ఇంటి పై నిఘాను ఏర్పాటు చేస్తామని పోలీసులు తెలిపారు. మీరు ఇంట్లో లేని సమయంలో మీ ఇంటిని గమనిస్తూ ఉండమని.. ఇంటి పక్కన మీకు నమ్మకమైన ఇరుగు పొరుగు వారికి చెప్పడం మంచిది. సైబరాబాద్ పోలీసుల సహకారంతో సీసీ కెమెరాలు ఇన్‌స్టాల్ చేస్తారు. ప్రజలు కూడా తమ కాలనీలలో, ఇళ్లలో, పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయవలసిన అవసరం ఉంది. విలువైన వస్తువులను స్కూటర్ డిక్కీల్లో, కార్లలో ఉంచవద్దు. వాటిని బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవడం మంచిది. బంగారు నగలు, నగదు వంటి విలువైన వస్తువులను వెళ్ళిపోతున్నప్పుడు మీ వెంట తీసుకెళ్లడం ఉత్తమం. ఇంటి తలుపులకు హై ఎండ్ సెక్యూరిటీ లాక్ సిస్టం ఉపయోగించాలి. సెంట్రల్ లాకింగ్ సిస్టమ్ ఎల్లప్పుడూ సురక్షితంగా ఉంటుంది. మీ ఇంట్లో అమర్చిన సీసీ కెమెరాలను ఆన్‌లైన్ లో ఎప్పటికప్పుడు చూసుకొంటూ వుండాలి. మీ ఇంటికి వచ్చే, వెళ్ళే దారులు ఇంకా ఇంటిలోపల కెమెరాలు అమర్చుకొని ఎవరికి కనపడకుండా ఇంటి లోపల రహస్య ప్రదేశంలో పెట్టుకోండి. ఇంట్లో మోషన్ సెన్సర్ల లైట్లు ఉపయోగిం చడం కూడా మంచిది. ఇవి చీకటి సమయంలోను పనిచేస్తాయి. అనుమానిత వ్యక్తుల కదలికలను గమనించి, వాటి గురించి వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. సంక్రాంతి సమయంలో చుట్టుపక్కల వారికి లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌కు మీ ఇంటి వివరాలు తెలియజేయండి. విలువైన వస్తువుల సమాచారాన్ని, వ్యక్తిగత ఆర్థిక విషయాలను ఇతరులకు చెప్పకూడదు. సాధారణంగా సరైన భద్రతా ప్రమాణాలు పాటించని ఇండ్లు, చీకటి ప్రదేశం, పాత గ్రిల్స్, బలహీనమైన తాళాలు ఉన్న ఇండ్లలో దొంగలు పడే అవకశాలు ఎక్కువగా ఉంటాయి. ఈ క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి, కొత్త వ్యక్తుల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించాలి.

# పురపాలక సంఘ అభివృద్ధికి తోడ్పడాలి

## హుజూర్ నగర్ మున్సిపల్ కమిషనర్



**హుజుర్ నగర్,అక్షిత ప్రతినిధి :**

హుజూర్ నగర్ పురపాలక సంఘ పరిధిలో మెయిన్ రోడ్డు కి ఇరువైపుల డ్రైన్ల పై, డ్రైన్ మూలమలుపులపై మరియు ఫుట్ పాత్ లపై షాపులు,డబ్బా కొట్లు, కూరగాయల , పండ్ల షాపులు మరియు ఇతర వాణిజ్య సముదాయములు ఏర్పాటు చేసుకొవడం వలన డ్రైన్ లోకి వెల్ల వలసిన నీరు వెళ్ళుటకు వీలుగా ఏర్పాటు చేసిన అన్నీ మ్యాన్ హెూల్స్ ముసకపోయి నీరు వెళ్ళక కురిసిన వర్షానికి హుజూర్ నగర్ లో అనేక ప్రాంతములు నీట మునిగి చాలా ఇబ్బందులు పడవలసి వచ్చినది కావున పురపాలక సంఘ పరిధిలో ఉన్న డ్రైన్ల పై మరియు మెయిన్ రోడ్డు కి ఇరువైపుల ఫుట్ పాత్ లపై డబ్బా కొట్లు ఏర్పాటు చేసుకొని ఉన్న వారి యొక్క షాపులను స్వచ్ఛందంగా తొలగించాలని మున్సిపల్ కమిషనర్ బుధవారం ప్రజలకు ప్రకటన ద్వారా తెలియజేశారు అత్యవసర సమయములో పురపాలక సంఘం వారు ఇట్టి షాపులు తొలగించుటలో పురప్రముఖులు, డబ్బా కొట్లు ఏర్పాటు చేసుకొని ఉన్న వారు సహకరించి పురపాలక సంఘ అభివృద్ధి కి తోడ్పడగలరని కోరారు.

# టి పి టి ఎఫ్ డైరీ-2025 ఆవిష్కరణ



**జనగామ, అక్షిత ప్రతినిధి:**

తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ టి పి టి ఎఫ్ విద్యా రంగానికి, సమాజానికి చేస్తున్న సేవ లు అభినందనీయమని అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్ అన్నారు. టి పి టి ఎఫ్ ప్రచురించిన డైరీ, ప్రభుత్వ ఉత్తర్వుల పుస్తకం, క్యాలెండర్ లను అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ తను చాంబర్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ టి పి టి ఎఫ్ టెట్, డీఎస్సీ లాంటి పరీక్షలకు శిక్షణ ఇవ్వడం, నాణ్యమైన విద్య అందించడం కోసం ప్రభుత్వానికి తగిన సలహాలు సూచనలు ఇవ్వడం ఆహ్వానించదగినదని, వారి సేవలు అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.శ్రీనివాస్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్.ఎన్. రాజు, యం.డి.అంకుశావళి, జిల్లా పూర్వ అధ్యక్షులు బి. లక్ష్మయ్య, జిల్లా కమిటీ నాయకులు ఇమ్మడి అశోక్, సిహెచ్.సత్యనారాయణ రెడ్డి, ఎ.రాజా రెడ్డి, యం.లక్ష్మణ్ జీ, యు.శ్రీహరి, వై.వజ్రయ్య, జే.రాజేందర్, దూడల రమేష్, శేషగిరి రావు, వివిద మండలాల బాధ్యులు కే.రాజయ్య, కే. మల్లారెడ్డి, గుంటిపల్లి శ్రీనివాస్ , యం.గణేష్, సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఖబర్దార్ బిజెపి పార్టీ నాయకుల్లారా మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు

## యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూడ శ్రీకాంత్ ,

**కమలాపూర్ ,జనవరి 8, అక్షిత ప్రతినిధి:**

కమలాపూర్ మండల కేంద్రంలోనీ బుధవారం రోజున స్థానిక బస్టాండ్ కూడలి వద్ద యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ అగ్రనేత గౌరవ పార్లమెంట్ సభ్యురాలు అయినా శ్రీమతి ప్రియాంక గాంధీ పైన అనుచిత వాక్యాలు చేసిన బిజెపి పార్టీ కి చెందిన ఢిల్లీ మాజీ పార్లమెంట్ సభ్యుడు రమేష్ బిదూరి దిష్టిబొమ్మ దహనకార్యక్రమం చేయడం జరిగింది...... బండ కట్టిన కుక్క తోక వంకరనే అనేవిధంగా బీజేపీ పార్టీ ఎప్పుడు మహిళలను ఈ దేశ మహిళా సమాజాన్ని చులకనగా చూడటం,కించపరిచడమే విధిగా వ్యాహరించదాన్ని మేమందరం ఖండిస్తునాం....... ప్రతిరోజు ఏదోవిదింగా దళితులు ఆదివాశిల, మహిళల పైన, బీజేపీ నాయకులు వారియొక్క అక్కసును కక్కుతూ అవమనించడమే పనిగా పెట్టుకుంటున్నరు..ఒకపక్క వాళ్ళ నాయకుడు భేటీ బచవో భేటీ పడవో అని అంటాడు మరో పక్క అతన్ని ఆచరించే వాళ్ళు మహిళలపైన మాటల దాడులు చేస్తారు.%ఈ లాంటి చర్యలు మరల జరిగితే యావత్ దేశం సహించబోదు కబడ్డార్ బీజేపీ నాయకులరా ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కొండపాక మనీష్, అసెంబ్లీ ఆధ్యక్షులు దూడ శ్రీకాంత్, మండల ఉపాధ్యక్షులు చేరాల రోహిత్, ఎంబటి తేజ, కుక్కల కుమార్, అసెంబ్లీ సెక్రటరీ పైస శరత్, ఆడెపు శ్రీకాంత్, మండల ప్రధాన కార్యదర్శులు పాకా అనిల్, పుల్ల వెంకటేష్, గాలిబ్ నవీన్, మొగిలిచర్ల శ్రీనివాస్, యువజన నాయకులు మొండెద్దుల నాగరాజు, మాట్ల మనోజ్, కడారి వెంకటేష్, ఎర్రగొల్ల అనిల్, ఆకిన పెల్లి శ్రీకాంత్, జక్కుల రాజు, సత్యపాల్, రాజేష్ మరియు వివిధ గ్రామాల నుండి యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.....



# పూల మాల వేసి ప్రార్థించి నివాళులు



**సూర్యాపేట, అక్షిత ప్రతినిధి :**

చివ్వేంల మండల కేంద్రంలోని పాండ్య నాయక్ తండా నందు తన స్వగృహం నందు దారావత్ సక్రం నాయక్ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ తన నివాసంలో ఈ రోజు ఉదయం 5 గంటలకు ప్రభు నందు నిద్రించ్చినారు. చివ్వేంలపాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రెవ.గుగులోతు బాలాజీ నాయక్, రీచ్ ఇండియా వ్యవస్థాపకులు ధరవత్ లాకు రేణుక నాయక్,పాస్టర్స్ పెలోషిఫ్ సూర్యాపేట నియోజకవర్గం అధ్యక్షులు రెవ. డా. జలగం జేమ్స్ లు ఆధ్వర్యంలో వారి పార్థివ దేహానికి పూల మాల వేసి ప్రార్థించి నివాళులు అర్పించినారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బిషప్ డా. దుర్గం ప్రభాకర్ మాట్లాడుతూ కోటియా నాయక్ తండా, తాళ్ల సింగారం తాండలలో పరిచర్య చేస్తున్నారని,చివ్వేంల మండలం లో గతంలో పాస్టర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు గా పనిచేసారని,గొప్ప దైవజనులను కోల్పోయినమని బాధను వ్యక్తపరిచారు, వారు జిల్లా వ్యాప్తంగా 20 సంవత్సరాలుగా దేవుని పరిచర్య ఘనంగా చేశారని, తనకు భార్య ఇద్దరు కుమారులు వున్నారు ,భార్య అనసూర్య, పెద్ద కుమారుడు షాలేం నాయక్ (16) చిన్న కుమారుడు సాత్విక్ నాయక్ (13 ) అనీ అన్నారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గం గౌరవ సలహాదారులు రెవ బొక్క ఏలీయా రాజు, సూర్యాపేట రూరల్ అధ్యక్షులు పాస్టర్ యల్క ప్రభాకర్, రూరల్ వర్కింగ్ ప్రెసిడెంట్ రెవ ఏర్పుల క్రిస్టోఫర్,రెవ.బానోత్ సుధాకర్ నాయక్ , రెవ. డా. పంది మార్కు,పాస్టర్ వరికుప్పల మత్తయి,పాస్టర్ బి.మోతిలాల్ నాయక్ ,పాస్టర్ బి.లింగ నాయక్ , డి.సల్మాన్ లింగ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# భావ ప్రకటన స్వేచ్ఛ,

## విద్వేషపు దాడులకు నిరసనగా 9న సమావేశం

**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి :**

తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద ఈ నెల 9న భావ ప్రకటన స్వేచ్ఛపై దాడికి నిరసనగా సమావేశం నిర్వహిస్తున్నట్టు వివిధ సంఘాల నాయకులు పేర్కొన్నారు. హైదరాబాద్ బుక్ ఫెస్టివల్ లో డిసెంబర్ 29, 2024 నుండి వీక్షణం బుక్ స్టాల్ లొ సీనియర్ జర్నలిస్టు విక్షణం ఎడిటర్ ఏన్.వేణుగోపాల్ పై ఈరోజు వరకు జరుగుతున్న వేధింపులు, చంపుతాం, కొడతాం పెట్రోల్ పోసి తలగబెడతాం, కుటుంబ సభ్యులనుగ్ బూతులతో తిట్టటం జరుగుతూనే ఉందని దుర్మార్గాన్ని ఖండిద్దామన్నారు. మధ్యప్రదేశ్ లో ఒక ఆదివాసీ బిక్షగాడిపై ఒక విద్వేషపు దురాహంకారి మూత్ర విసర్జను ఖండిస్తు ఉచ్చల జలధి తరంగ కవిత సంకలనకర్త మెర్సి మార్గరేట్ ను బూతు, అసభ్య ట్రోలింగుల వేధింపులను ఖండిద్దామన్నారు. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు దళిత సామాజిక వర్గానికి చెందిన రాములుపై జరిగిన విద్వేషపు దాడిని మిర్యాలగూడ ప్రోగ్రెసివ్ ఫోరం, నేతలు, పౌర, ప్రజాసంఘాల ఐక్యవేదిక, తెలంగాణ విద్యావంతుల వేదిక, ముస్లిం విద్యావంతుల వేదిక. ప్రజాస్వామ్య పరిరక్షణ సమితి, యుటీఎఫ్, డిటీఎఫ్, జన విజ్ఞాన వేదిక నేతలన్నారు.

# అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమంలో భేరి రామచందర్ యాదవ్

**చేవెళ్ళ అక్షిత ప్రతినిధి..**

రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల్ కందాడ గ్రామం ఆంజనేయస్వామి ఆలయం లో హరిహరపుత్ర అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమం పాండు గురు స్వామి, శ్రీనివాస్ గురు స్వామి ఆధ్వర్యంలో జరిగినటువంటి అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమానికి విచ్చేసిన ప్రతి ఒక్కరికి హరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటున్నాము అని నిర్వాహకులు అన్నారు. ఈ కార్యక్రమంలో భేరి రామచందర్ యాదవ్ అయ్యప్ప స్వామిని భక్తిశ్రద్ధలతో నలభై ఒక్క రోజు మండల పూజలు చేసి అయ్యప్ప స్వాములు ఎంతో భక్తి శ్రద్ధలతో శబరి ఇరుముడి కాలినడకన మరియు వాహనాల ద్వారా స్వామివారిని దర్శించుకుని తరిస్తారు. అయ్యప్ప స్వామి కరుణ కటాక్షాలు అందరి మీద ఉండాలని అందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఆనందంగా జీవించాలని మనస్ఫూర్తిగా అయ్యప్ప స్వామిని వేడుకున్నారు. హనుమంతు యాదవ్, బాబు యాదవ్, శీను యాదవ్, నవీన్ యాదవ్, గోపాల్ యాదవ్ శీను యాదవ్, శ్రీ దాసాంజనేయ సన్నిధానం స్వాములు సమక్షంలో జరగడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన సబితా ఇంద్రారెడ్డి మరియు కాలె యాదయ్య, కావలి రవీందర్ యాదవ్, కురువ మల్లేష్ శేరిలింగంపల్లి యాదవ సంఘం



ఉపాధ్యక్షులు అంజలి సత్యనారాయణ యాదవ్, శ్రీ వెంకటేశ్వర బోర్వెల్ మోటార్ ప్రొప్రైటర్ కావలి కృష్ణ యాదవ్, వనపర్తి జిల్లా గొర్రెల మేకల పెంపకం దారుల అధ్యక్షులు మధు యాదవ్, బేరి యాదయ్య యాదవ్, బేరి భీమయ్య యాదవ్, భేరి కృష్ణ యాదవ్, భేరి చంద్రశేఖర్ యాదవ్, కావలి సురేష్ యాదవ్ ,రావడం జరిగింది అయ్యప్ప స్వామి పూజా కార్యక్రమంలో పెద్ద ఎత్తున కన్నె స్వాములు గంట స్వాములు గల స్వాములు గురు స్వాములు పెద్ద ఎత్తున పాల్గొన్నారు గ్రామ పెద్దలు ప్రజాప్రతినిధులు మహిళలు యువజన నాయకులు చిన్నారులు పెద్ద ఎత్తున పాల్గొని అయ్యప్పస్వామి తీర్థప్రసాదాలు స్వీకరించినారు.

# మాజీ మంత్రి కేటీఆర్ తప్పును ఒప్పుకొని వెంటనే ఏసీబీ కి లొంగిపోవాలి..

## రఘునాథ్ యాదవ్

**శేరిలింగంపల్లి అక్షిత ప్రతినిధి..**



ఫార్ములా ఈ కారు రేసు ఏసీబీ కేసు విచారణ డుమ్మా కొట్టి మీడియా ముందు అడ్డగోలుగా మాట్లాడుతున్న కేటీఆర్ ను వెంటనే అరెస్ట్ చేయాలి. దేశం వదిలి పారిపోక ముందే పాస్ పోర్ట్ సీజ్ చేయాలని కాంగ్రెస్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు రఘునాథ్ యాదవ్ అన్నారు. మంగళవారం శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఒక మీటింగ్ లో ఆయన మాట్లాడుతూ 55 కోట్ల ప్రజాధనం ఎవడబ్బ సొమ్మని పరాయి దేశస్తులతో కలిసి దొంగలించావు. ఈ కొత్త సంవత్సరంలో బిఆర్ఎస్ పార్టీ అవినీతి గా సంపాదించిన అక్రమ ఆస్తులు అన్ని ఒక్కొక్కటిగా బయటపెడతాం. కేటీఆర్ చేసిన తప్పుని ఒప్పుకొని, ప్రజలందరికీ క్షమాపణ చెప్పి తప్పకుండా జైలుకు వెళ్లాల్సిందే అని రఘునాథ్ యాదవ్ అన్నారు.





# చేర్యాల కోర్టు ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా జడ్జి కలెక్టర్

**చేర్యాల జనవరి 8 అక్షిత ప్రతినిధి:**

సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణంలో త్వరలో ప్రారంభం కాబోతున్న కోర్టు ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా జడ్జి అనురాధ మరియు కలెక్టర్ మనుచౌదరి. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ కోర్టు కి అవసరమైన సామాగ్రి అంత సమకూరింది త్వరలోనే కోర్టు నీ చేర్యాల ప్రాంతంలో ప్రారంభిస్తామని తెలిపారు..అదే విధంగా చేర్యాల ప్రాంత కోర్టు కేసులు అన్ని ఇక్కడికే బదిలీ చేయబడతాయని, ఇకముందు జరిగే కేసులు అన్ని ఇక్కడే పరిష్కరించబడతాయి అని తెలిపారు. చేర్యాల ప్రాంత ప్రజలు కోర్టు సేవలను వినియోగించుకోవాలని జడ్జి తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్జి, కలెక్టర్ తో పాటు, స్థానిక ఎమ్మార్వో , మున్సిపల్ కమిషనర్, మరియు సంబంధిత అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

# రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా రేష్మ నియామకం

**కొమరవెల్లి జనవరి 26 అక్షిత న్యూస్:**

రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఆదేశం మేరకు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునీత రావు,జనగామ జిల్లా డిసిసి అధ్యక్షులు,నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, సిద్దిపేట జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి ఆదేశం మేరకు ఇటీవల నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సభ్యత్వాల నమోదు కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం గౌరాయపల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ రేష్మ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో కీలక పోసించారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను, హామీల హములును ప్రజల్లోకి ఎప్పటికప్పుడు తీసుకెళ్తూ క్రమశిక్షణ కార్యకర్తగా పార్టీ కార్యక్రమంలో పాల్గొంటున్న రేష్మ ను గుర్తించిన కాంగ్రెస్ పార్టీ మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు ఈ మేరకు బుధవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రేష్మ ను నియమిస్తూ నియామక పత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా రేష్మ మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షులు సునీత రావు కి, జనగామ జిల్లా డిసిసి అధ్యక్షులు,నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి కి, పార్టీ కార్యకర్తలకు, నాయకులకు, ప్రజాప్రతినిధులకు,పార్టీ అనుబంధ సంఘాలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి సంక్షేమానికి, బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని రేష్మ పేర్కొన్నారు.



# రోడ్డుపై తాటి చెట్లు వేసి రాస్తారోకో చేసిన ధర్మపురం రైతులు

## సాగు నీటి కోసం రోడ్డుపై బైఠాయింపు

## రైతులను పట్టించుకునే నాథుడు కరువయ్యారు

**మాడుగులపల్లి అక్షిత ప్రతినిధి:**





మాడుగులపల్లి మండలంలోని ధర్మపురం గ్రామంలో రైతులు సాగు నీటి కోసం కనేకల్ ముషంపల్లి రోడ్డుపై తాటి చెట్లు వేసి రాస్తారోకో నిర్వహించారు. ఎస్ఎల్బిసి 24%తీ% కాల్వ నుండి చెరువులోకి పంట సాగు కోసం తీసే కాల్వను ఒక రైతు తీయకుండా ఆపుతున్నాడని. గ్రామ రైతులందరూ రోడ్డుపై బైఠాయించారు. ఘటన స్థలానికి నిడమనూరు పోలీస్ సిబ్బంది చేరుకున్నారు.



# రోడ్డు మంజూరు చేయించిన మంత్రులకు నేతలకు పాలాభిషేకం

**చిట్యాల**

ఉరుమడ్ల నుండి చిన్న కాపర్తి రోడ్డు
ఉరుమడ్ల నుండి ఎలికట్టె రోడ్డు
ఉరుమడ్ల ఊర చెరువు పటేల్ కుంట మరమత్తు ల నిమిత్తం 6.5 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయించిన తెలంగాణ రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి
రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి
నకిరేకల్ నియోజకవర్గ శాసనసభ్యులు వేముల వీరేశం
తెలంగాణ రాష్ట్ర డైరీ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ కుమార్ రెడ్డి
చిత్ర పటాలకు ఉరుమడ్ల,చిన్న కాపర్తి,ఎలికట్టె గ్రామ రైతుల ప్రజల పక్షాన పాలభిషేకం చేశారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి గ్రామ సుఖేందర్ రెడ్డి అన్నారు. రైతులందరం, ప్రజలందరూ వారి కి జీవిత కాలం రుణ పడి ఉంటాం అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు పల్లపు బుద్ధుడు, కోనేటి యాదగిరి, గ్రామ శాఖ అధ్యక్షులు చెరుకు సైదులు, మాజీ ఎంపీటీసీ పోలగోని స్వామి , సోషల్ మీడియా ఇంచార్జీ పట్ల జనార్ధన్, జనపాల శ్రీను, ఉయ్యాల నరేష్,పాకాల దినేష్, మేడబోయిన శ్రీను, కురుపటి లింగయ్య, గుత్తా రవీందర్ రెడ్డి ,ఐతరాజు నర్సింహ, గంగాపురం వెంకన్న, రూపని చంద్రయ్య,బొంగు శంకర్ ,రూపని ఎల్లయ్య సోమనబోయిన మహేష్, అంతటి వెంకన్న ,వేముల లింగయ్య, పాకాల మధు,పల్లపు రామకృష్ణ, బొడ్డు యాదయ్య, రూపని నర్సింహ, మర్రి మహేష్, జనపాల జానయ్య, కోరబోయిన లక్ష్మయ్య ,సాగర్ల రాములు, ఏరుకొండ కోటయ్య, మర్రి సత్తయ్య, సాగర్ల ఎల్లయ్య,ఐతరాజు



రైతులు మాట్లాడుతూ ఉరుమడ్ల చరిత్రలో మొట్ట మొదటిసారి ఇంత పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేసిన నాయకులు మా గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# కన్స్యుమర్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ తెలంగాణ రాష్ట్ర ప్రెసిడెంట్‌గా న్యాయవాది కవిత శ్రీ రెడ్డి

**ఖమ్మం /అక్షిత బ్యూరో :**



ఖమ్మం నగరానికి చెందిన ప్రముఖ న్యాయవాది కొప్పుల కవిత రెడ్డి ని సంస్థ నేషనల్ చైర్మన్ స్వామి కన్స్యుమర్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ తెలంగాణ రాష్ట్ర ప్రెసిడెంట్ గా నియమించారు. గతంలో కవిత శ్రీ రెడ్డి చేసిన సేవలను గుర్తించి వారికి ఈ అవకాశం ఇచ్చినట్లుగా సంస్థ నేషనల్ స్వామి తెలిపారు.తనను నమ్మి సంస్థ లో కీలక భాధ్యతలు అప్పగించినందుకు స్వామికి కృతజ్ఞతలు తెలిపారు.సంస్థ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని వచ్చే నెల నుంచి జిల్లాల వారీగా కమిటీలు వేస్తామని వినియోగదారులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్య వంతులను చేస్తామని నూతనంగా ఎన్నుకోబడ్డ కన్స్యుమర్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ తెలంగాణ రాష్ట్ర ప్రెసిడెంట్ కవిత శ్రీ రెడ్డి పేర్కొన్నారు.

# డిప్యూటేషన్ లో మంగపేట మండలం ధరణి ఆపరేటర్ బదిలీ.

**మంగపేట,అక్షిత న్యూస్ :**

ములుగు జిల్లా మంగపేట మండల ధరణి ఆపరేటర్ తోలేం నరేష్ మండల ప్రజలకు చేసిన సేవలకు మరువలేవని డిప్యూటేషన్ లో వాజేడు మండలానికి వెళ్ళటం మండల ప్రజలకు ఇలాగే సేవలు అందించాలని కోరుతున్నాము ఈ సందర్భంలో తోలెం,నరేష్ కు సన్మానించి వీడ్కోలు చెప్పిన మంగపేట తహసిల్దార్ తోట రవీందర్



,డిప్యూటీ తాసిల్దార్ మల్లేశ్వరరావు, ఆర్ ఐ లు శ్రీనివాస్, ఏసు పాదం మరియు తోటి రెవెన్యూ డిపార్ట్మెంట్ ఉద్యోగులు వీఆర్ఏలు అటెండర్లు అందరూ కలిసి సన్మానించి వీడుకోలు చెప్పారు ఈ కార్యక్రమంలో తోటి ఉద్యోగులు వీఆర్ఏలు మరియు అటెండర్లు పాల్గొన్నారు.

# కరెంట్ లో వోల్టేజ్ సమస్యను గుర్తించి ట్రాన్స్ ఫార్మర్ అందజేసిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

చింతలపాలెం అక్షిత ప్రతినిధి

సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండల కేంద్రం గుడి మల్కాపురం గ్రామంలో బుధవారం రోజున రైతులకు లో ఓల్టేజ్ సమస్య ఉన్నందున మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారం తో 63 %ఖు౦% విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ను ఏర్పాటు చేయనైనది. ఇట్టి ట్రాన్స్ ఫార్మర్ ను మండల పార్టీ అధ్యక్షులు నరాల.కొండా రెడ్డి ,వర్కింగ్ ప్రెసిడెంట్ చిలకల శ్రీనివాస రెడ్డి ప్రారంభించడం జరిగింది. కార్యక్రమంలో గ్రామ శాఖఅధ్యక్షులు గోపిరెడ్డి.నాగార్జునరెడ్డి ,మాజీ సర్పంచ్ మల్లెల నాగిరెడ్డి , మార్తల బాలిరెడ్డి ,కరెంట్ హెల్పేర్ జిలానీ, ముడుసు నారపరెడ్డి ,మల్లెల శ్రీనివాస రెడ్డిబీ కోట్యా నాయక్ , బాలునాయక్ ,పిడతల బేబీ ,నాగార్జున ,నేరెళ్ల హుస్సేన సైదా శ్రీనివాస రెడ్డి , రత్నారెడ్డి , దేవిరెడ్డి గుర్వారెడ్డిబీకొంద్రపా వెంక రైతులు తదితరులు పాల్గొన్నారు .



# వ్యాపార దృష్టితో చూడొద్దు

## ప్రైవేట్ విద్యాసంస్థలకు మంత్రి పొన్నం హితవు

**హైదరాబాద్ :అక్షిత న్యూస్ :**

ప్రైవేటు విద్యా సంస్థలు వ్యాపార దృష్టితో కాకుండా, భావి భారత పౌరులను తీర్చి దిద్దాలనే లక్ష్యంతో పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. తెలంగాణ రికాగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ జనరల్ బాడీ మీటింగ్ లో పాల్గొన్న మంత్రి.. విద్యార్థులను తీర్చిదిద్దడంలో ప్రైవేటు విద్యా సంస్థల పాత్ర కీలకమని అన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలు సమాంతరంగా పనిచేసినపుడే మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. రాష్ట్రంలో దాదాపు 60 శాతం విద్యార్థులు ప్రైవేటు సంస్థలల్లోనే చదువుతున్నారని, వ్యాపర దృష్టితో కాకుండా విద్యార్థులను ఉన్నత స్థాయికి చేర్చాలనే లక్ష్యంతో పనిచేయాలని సూచించారు. తెలంగాణలో నాణ్యమైన విద్యను అందించేందుకు అందించేందుకు అందరం కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, టీఆర్ఎస్ఎంఏ రాష్ట్ర అధ్యక్షులు ఎస్. మధుసూధన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పంపిణీకి సిద్ధం

### -జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
### -డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలి
### -మల్లేమడుగు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్

**ఖమ్మం/అక్షిత బ్యూరో :**



ప్రభుత్వ లక్ష్యం మేరకు సంక్రాంతి లోపు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.బుధవారం పాలేరు నియోజకవర్గం ఖమ్మం రూరల్ మండలంలోని మల్లెమడుగు గ్రామంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించారు.మల్లెమడుగు గ్రామంలో మూడు బ్లాక్ లలో నిర్మిస్తున్న 84 ఇండ్లు పరిసరాలను కలెక్టర్ తిరిగి క్షుణంగా పరిశీలించారు.ఇండ్ల నిర్మాణం పూర్తి దశలో ఉన్న చిన్న చిన్న పనులను రెండు రోజులలో పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సంక్రాంతి లోపు అర్హులైన నిరుపేద లబ్దిదారులను ఎంపిక చేసి ఇండ్ల పంపిణీకి సిద్ధం చేయాలని అన్నారు.డబుల్ బెడ్ రూం ఇండ్లలో నివసించే వారికి కావలసిన మౌళిక సదుపాయాలు సమకూర్చాలని అదేశించారు.మల్లెమడుగులో 84 కూసుమంచి మండలం దుబ్బతండ లో 29 నేలకొండపల్లి మండలం ఆచార్లగూడెం లో 18 మొత్తం 131 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు లబ్ధిదారుల పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని వీటిని పేదలలో నిరుపేదలకు అర్హులైన వారిని ఎంపిక చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో హౌజింగ్ పిడి శ్రీనివాసరావు ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు ఖమ్మం అర్బన్ రూరల్ మండల తహశీల్దార్లు రవికుమార్ రాంప్రసాద్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా చెరుకు సుమలత

**కొమురవెల్లి అక్షిత న్యూస్:**



రాష్ట్ర కార్యదర్శిగా చెరుకు సుమలత ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతరావు ఉత్తర్వులు జారీచేశారు..ఈ సందర్భంగా చెరుకు సుమలత మాట్లాడుతు రాష్ట్ర కార్యదర్శిగా నాపై నమ్మకంతో నియమించిన జనగామ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ,మహిళ రాష్ట్ర , జిల్లా ఆధ్యక్షులు , సునితరావు మరియు లక్ష్మీ అక్కలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారుఇందుకు సహకరించిన కొమురవెల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులకు, మరియు మహిళా కాంగ్రెస్ జిల్లా నాయకులకు జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులకు, ఏన్ ఏస్ యూ ఐ మరియు జిల్లా యూత్ కాంగ్రెస్ వివిధ అనుబంధ సంఘాల వారందరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.సిద్దిపేట జిల్లాలో మహిళ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయుటకు జిల్లా అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి సహాయ సహకారాలు తీసుకుని ముందుకు పోతామని జిల్లాలోని ప్రభుత్వానికి పార్టీకి మధ్య వారదిలాగా ఉంటు. సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా కృషి చేస్తానని అన్నారు.

# మెడికల్ షాపుపై దాడులు నిర్వహించిన డ్రగ్స్ కంట్రోల్ టీం పోలీసులు

**వరంగల్, అక్షిత బ్యూరో:**



ప్రభుత్వం నిషేదించిన మందును విక్రయిస్తున్నట్లుగా సమాచారం రావడంతో డ్రగ్స్ కంట్రోల్ టీం పోలీసులు, ఔషద నియంత్రణ అధికారులు బుధవారం సాయంత్రం వరంగల్ పోస్ట్ ఆఫీస్ ప్రాంతంలోని గుడ్ హెల్త్ మందుల షాపులో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ప్రభుత్వం నిషేధించిన మత్తు కలిగించే టాబ్లెట్లను వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా యువతకు విక్రయిస్తునట్లుగా అధికారులకు నిర్ధారణ రావడంతో పాటు సదరు మందుల షాపు నుండి నిషేధిత టాబ్లెట్లను పోలీసులు స్వాధీనం చేసుకొని. మందుల షాపు యజమానిని అధికారులు అదుపులోకి తదుపరి దర్యాప్తు కోసం నిందితుడిని ఇంతేజార్గంజ్ పోలీసులకు అప్పగించడమైంది. ఈ తనిఖీల్లో ఇన్స్ స్పెక్టర్ సురేష్, ఆర్.ఐ శివ కేశవులు,వరంగల్ డ్రగ్ కంట్రోల్ ఇన్స్ స్పెక్టర్ అరవింద్ కుమార్, ఆర్. ఎస్. ఐ పూర్ణ తో పాటు డ్రగ్స్ కంట్రోల్ పోలీసులు , డ్రగ్ కంట్రోల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# క్రిస్టియన్ మైనారిటీలు ఉచిత కుట్టు మిషన్ల కొరకు దరఖాస్తు చేసుకోవాలి

### -జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కె. సత్యనారాయణ

**ఖమ్మం/అక్షిత బ్యూరో :**

తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఇందిరమ్మ మహిళా శక్తి పథకం క్రింద అందించు ఉచిత కుట్టు మిషన్ల కొరకు క్రిస్టియన్ మైనారిటీ మహిళలు ఆన్లైన్ వెబ్ సైట్ లో ఈ నెల 20 లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి కస్తాల సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.కనీసం 5వ తరగతి విద్యార్హత కలిగి 21 నుండి 55 సంవత్సరాల వయస్సు గల నిరుపేద నిరాశ్రయులు వితంతువు విడాకులు అయిన మహిళలు అనాథ ఒంటరి మహిళలకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందని ఆన్ లైన్ చేసిన తర్వాత దరఖాస్తుతో పాటు బిసి-సి కుల ధృవీకరణ పత్రం/ బాప్టిసమ్ సర్టిఫికేట్ తెల్ల రేషన్ కార్డు / ఆహారభద్రత కార్డ్ తెల్ల రేషన్ కార్డు / ఆహారభద్రత కార్డ్ రెండూ లేకపోతే గ్రామీణ ప్రాంతం వారికి లక్షన్నర పట్టణ ప్రాంతం వారికి రెండు లక్షలు మించకుండ ఆదాయ ధృవపత్రం, నివాస ధ్రువీకరణకు ఆధార్ కార్డు వయస్సు దృవీకరణ కొరకు ఓటర్ ఐడి కార్డ్/ఆధార్ కార్డ్ తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ లేదా ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థ ద్వారా నేర్చుకున్న టైలరింగ్ సర్టిఫికేట్ విద్యార్హత సర్టిఫికెట్ కాపీలను జత చేసి సమీకృత జిల్లా కలెక్టరేట్ రెండవ అంతస్థు ఎస్-29 లోగల జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ అధికారి కార్యాలయములో సమర్పించాలని ఇతర వివరాల కొరకు సెల్ నెంబర్ 9704003002 నందు సంప్రదించాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# మహా రథయాత్రను జయప్రదం చేయలి

### సూర్యాపేట జిల్లా ఎమ్మార్పీఎస్ ప్రధాన కార్యదర్శి మాదాసు గోపి మాదిగ

**హుజూర్ నగర్,అక్షిత ప్రతినిధి :**

సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ పట్టణంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాదాసు గోపి మాదిగ మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను తెలంగాణలో తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ తలపెడుతున్న చలో హైదరాబాద్ ఫిబ్రవరి 7న లక్ష డప్పులు వెయ్యి గొంతులు మహాప్రదర్శన విజయవంతం చేయాలని మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ప్రజా యుద్ధనౌక, కవి, గాయకుడు మాదిగ ముద్దుబిడ్డ ఏపూరి సోమన్న కళాబృందం రథయాత్ర ప్రారంభమైనది ఈ రథయాత్ర జనవరి 9 సాయంత్రం హుజూర్ నగర్ పట్టణం లో జరగనున్నది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మందకృష్ణ మాదిగ విచ్చేయుచున్నారు హుజూర్ నగర్ నియోజకవర్గంలో ఉన్న ప్రతి మండలం,గ్రామం నుండి నా మాదిగ జాతి ముద్దుబిడ్డలు,యువత పార్టీలకు అతీతంగా జాతి కోసం ప్రతి ఒక్కరూ ఎమ్మార్పీఎస్ మరియు అనుబంధ సంఘాల నాయకులు డప్పు తీసుకొని హుజూర్ నగర్ పట్టణంలో జరుగు లక్ష డప్పులు వెయ్యి గొంతులు రథయాత్రను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.



# సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించిన సైబర్ పోలీసులు







**వరంగల్, అక్షిత బ్యూరో:**

సైబర్ జాగ్రత్త కార్యక్రమంలో భాగంగా స్థానిక హంటర్ రోడ్ లోని సాంఘిక సంక్షేమ పాఠశాలలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ సైబర్ క్రైమ్ విభాగం పోలీసులు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సమావేశాల్లో ముందుగా సైబర్ క్రైం ఏసీపీ విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు ఎలాంటి మోసాలకు పాల్పడుతున్నారో విద్యార్థులకు అధికారులు అవగాహన కల్పించారు. ప్రధానంగా ప్రస్తుతం ఫైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్టు అంటూ మోసాలకు పాల్పడుతూ తీరును సైబర్ అధికారులు విద్యార్థులకు తెలియజేయడంటో పాటు పోలీసులు ఎప్పుడు డిజిటల్ అరెస్ట్ లు చేయరని. పోలీస్ యూనిఫారం ధరించి వీడియో కాల్ ద్వారా డిజిటల్ అరెస్టు చేస్తాం సైబర్ నేరగాళ్ళ బెదిరింపులకు కంగారు పడవద్దని మీ తల్లిదండ్రులకు తెలియజేయాలని. ఎవరైనా సైబర్ నేరగాళ్ళ చేతుల్లో మోసానికి గురైతే తక్షణమే 1930 నంబర్ కు ఫోన్ చేసి సమాచారం చేయడం ద్వారా పోగొట్టుకున్న సొమ్మును తిరిగి పొందేందుకు అవకాశం వుంటుందని ఏసీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ ఇన్స్ స్పెక్టర్ రవి సుబేదారి ఇన్స్ స్పెక్టర్ సత్యనారాయణ రెడ్డితో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు చెక్కుల







**రాజేంద్రనగర్ అక్షిత ప్రతినిధి :**

395షాదీముబారక్,87 కల్యాణ లక్ష్మి,మొత్తం 482చెక్కులనుఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ%ొ% ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు వినియోగించుకొని ఆర్థికంగా లబ్దిపొందాలన్నారు. పేదింటి యువతుల వివాహానికి కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాలు ఎంతో లబ్ధిచేకూరుస్తు న్నాయి^న్నారు. ఈ కార్యక్రమం లో ఆయా వార్డ్ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు నాయకులు, తహసీల్దార్, సిబ్బంది ఉన్నారు...

# అక్రమ కేసులకు అరెస్టులకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు భయపడరు

## -బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్సీ తాతా మధుసూదన్



**ఖమ్మం /అక్షిత బ్యూరో :**

అక్రమ కేసులకు అరెస్టులకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు భయపడరని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అన్నారు. నిన్న పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని తలసేమియా వ్యాధి బాధితుల కోసం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ తాతా మధు మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలోని మండల నాయకులు కార్యకర్తలు అందరూ కలిసి తల సేమియాతో బాధపడుతున్న చిన్నారులకు రక్తదానం చేయాలనే ఆలచన మంచిదని ఆ ఆలోచన చేసి శిబిరాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులకు ధన్యవాదాలు తెలియచేశారు. మనసున్న మారాజు కందాళ ఉపేందర్ రెడ్డి అన్నారు. జైళ్ళకు కానీ కేసులకు భయపడే పార్టీ కాదని బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు కేసులకు లాఠీలకు తూటాలకు భయపడి ఉంటే తెలంగాణ రాష్ట్రం వచ్చేది కాదని ఉద్యమంతోనే తెలంగాణ రాష్ట్రం తీసుకొచ్చామని తెలంగాణ తీసుకొచ్చిన పార్టీగా బీఆర్ఎస్ పార్టీ ఉందన్నారు. రాబోవు రోజులలో కందాల ఉపేందర్ రెడ్డి ని మరలా శాసనసభ్యులు గా ప్రజలు ఆశీర్వదిస్తారని వారు పేర్కొంటూ జిల్లా పార్టీ తరఫున కందాల ఉపేందర్ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్ ఉన్నం బ్రహ్మయ్య భాషబోయిన వీరన్న వేముల వీరయ్య మాజీ జెడ్పిటిసి వర ప్రసాద్ మాజీ డిసిసిబి డైరెక్టర్ ఇంటూరి శేఖర్ మరియు నాయకులు ఆసిఫ్ పాషా మరికంటి రేణు బాబు జానకి రాములు సంజీవరెడ్డి కృష్ణారావు లక్ష్మణ్ బాలు మరియు తదితర నాయకులు పాల్గొన్నారు.



# నిరుపయోగంగా ఉన్న మార్కెట్ స్థలంను అర్హులైన వీధి వ్యాపారులకు కేటాయించండి..

శేరిలింగంపల్లి అక్షిత ప్రతినిధి.. శేరిలింగంపల్లి నియోకవర్గ ఇంఛార్జి డాక్టర్ మాధవ రెడ్డి ఆధ్వర్యంలో చందానగర్ హుడా కాలని నందు ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉన్న వెజిటబుల్ మార్కెట్ పరిశీలించడం జరిగింది, లక్షల వ్యయంతో నిర్మించిన ఈ మార్కెట్ చెత్త చెదారం తో నిండి ప్రజల కనీస అవసరాలకు అనుగుణంగా కాకుండా అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా ఉండటం తద్వారా కాలని వాసులకు ఇబ్బందికరంగా మారింది, ఇటు హుడా కాలని మరియు పాపిరెడ్డి కాలని వాసులకు ఎంతో ప్రయోజనకరంగా ఉన్న ఈ మార్కెట్ ను ప్రభుత్వం తక్షణమే అర్హులైన వీధి వ్యాపారస్తులకు కేటాయించి వినియోగంలోకి తీసుకురావాలని అలాగే మార్కెట్ షెడ్లలో తలదాచుకుంటున్న నిరుపేదలకు ఆవాసాన్ని కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.



## బాధితురానికి సీఎం సహాయనిధి చెక్కు

**చేర్యాల జనవరి 8 అక్షిత ప్రతినిధి:**

చేర్యాల పట్టణ కేంద్రానికి చెందిన దొమ్మట లచ్చవ్వ కు ప్రభుత్వం నుండి మంజూర్కెన రూ 41500/- రూపాయల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును, బుధవారం బాధిత కుటుంబానికి యూత్ ఇంచార్జ్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శివగారి అంజయ్య అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద కుటుంబానికి సీఎం సహాయ నిధి చెక్కు ఆసరాగా నిలుస్తుందని అన్నారు. ఈ సందర్భంగా బాధితురాలకి సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు కోసం కృషి చేసిన, జనగామ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకాల పర్వతాలు యాదవ్, బిఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు ఏర్పుల మహేష్, పట్టణ యూత్ అధ్యక్షులు యాట బిక్షపతి పాల్గొన్నారు.

## నల్లా పన్ను వసూలుకు 8 బిల్లింగ్ మిషన్లు

### కమిషనర్ ఎండి. యూసుఫ్

**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి :**

మిర్యాలగూడ మున్సిపల్ పరిధిలో నల్లా పన్ను వసూలు చేసేందుకు సుమారు 5 లక్షల రూపాయల విలువైన 8 బిల్లింగ్ మిషన్లను బుధవారం మున్సిపల్ కమిషనర్ ఎండి. యూసుఫ్ రక్షిత మంచినీటి సరఫరా సిబ్బందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకన్న మాట్లాడుతూ పట్టణంలోని ఇళ్లకు సుమారు 14,600 నల్లా కనెక్షన్లు ఉన్నాయని, వాటి ద్వారా ఒకొక్క నల్లాకు వంద రూపాయలు చొప్పున పన్ను వేశామన్నారు. నెలకు రూ. 14.6లక్షలు ఏటా రూ.1.65కోట్ల రూపాయలు వసూలు కావలసి ఉండగా కేవలం 3 లక్షల రూపాయలు వసులయ్యాయని ఆయన తెలిపారు. ఉన్నతాధికారులు వంద శాతం నీటి పన్ను వసూలు చేయాలని ఆదేశించారని వారి ఆదేశాల మేరకు వసూలు కార్యక్రమం ముమ్మరం చేయాలని ఆయన కోరారు. మిషన్ భగీరథ కింద ఉన్న 3,500 ఆఫ్ లైన్ నల్లాలను ఆన్లైన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధి యాక్షన్ ప్లాన్‌తో పనులు చేపట్టాలి

### వై.శేఖర్ రెడ్డి

**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి :**

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి పనులు ప్రారంభించాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి వై.శేఖర్ రెడ్డి ఆదేశించారని స్థానిక ఎంపిడిఓ ఎం. శేషగిరిశర్మ తెలిపారు. బుధవారం ఉపాధి హామీ సిబ్బంది ఎంపీఓ, ఎపిఓ, ఇసి, టీఎలతో గూగుల్ మీటింగ్ నిర్వహించి పనుల యాక్షన్ ప్లాన్ లోని పనులను తొందరగా ప్రారంభించాలనికోరారన్నారు. ప్రతి గ్రామంలో 25 మంది ఉపాధి హామీ కూలీలకు పనులు కల్పించాలన్నారు. ఫిష్ పాండ్, వ్యవసాయ పొలాలకు సంబంధించిన రోడ్డుపనులు, వ్యవసాయ భూమి అభివృద్ధి పనులు, వ్యవసాయ పొలాలకు కాలువ పనులు, వ్యక్తిగత పనులు క్యాటిల్ షెడ్ మొదలగు పనులు ప్రారంభించాలన్నారు. 2025 సంవత్సరం నర్సరీ పెంపకం కొరకు ఇంకా మట్టి సేకరించని, బ్యాగ్ ఫీలింగ్ చేయని వారు, విత్తనాలు నాటని వారు రెండు రోజులలో పూర్తి చేయాలన్నారు. నర్సరీ టార్గెట్ లో 20శాతం ఈత, తాటి మొక్కలు పెంచాలన్నారు. ప్రతి నర్సరీలలో 10 ప్రైమరీ బెడ్ లు తయారుచేసి నారు పెంచవలెనని కోరారు. సమావేశంలో ఉపాధి హామీ పథకం ఎపిఓ కళావతి, టీఏ రేణుక తదితరులు ఉన్నారు.

# అవినీతి లేని సమాజాన్ని నిర్మిద్దాం

## ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్

**హైదరాబాద్, అక్షిత ప్రతినిధి :**

అవినీతి లేని సమాజాన్ని నిర్మించేందుకు యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ కృషి చేయాలని సంస్థ సలహాదారులు, ప్రముఖ సంగీత దర్శకులు ఆర్పీ పట్నాయక్ అన్నారు. గురువారం యూత్ ఫర్ యాంటీ కరప్షన్ క్యాలెండర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అవినీతి రహిత సమాజం కోసం యువత ముందుకు రావాలని, మెరుగైన సమాజం కోసం కృషి చేయాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గ్రామ స్థాయి నుంచి, పట్టణ స్థాయి వరకు అవినీతి నిర్మాలనపై అవగాహన కల్పించాలన్నారు. ప్రశ్నించే విధానంతోనే మెరుగైన సమాజం ఏర్పడుతోందని అన్నారు. సమాజంలో మార్పు కోసం యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ చేస్తున్న వినూత్న కార్యక్రమాలు ఆలోచింపజేసే విధంగా ఉన్నాయన్నారు. ఈ క్యాలెండర్ ఆవిష్కరణలో యూత్ ఫర్ యాంటీ కరప్షన్ రాజేంద్ర పల్నాటి, సలహదారులు అశోక్ కుమార్, మహిళా బృందం డా. స్రవంతి, డా. స్నిగ్ధ, గీతారెడ్డి, హైదరాబాద్ అధ్యక్షుడు కొన్నె దేవేందర్, కోర్ కమిటి సభ్యులు కొమటి రమేశ్ బాబు, ధ్యేవనపల్లి రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

# పాడైన పండ్లు, కూరగాయలతోనే ఫుడ్ పాయిజన్

## ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు జగన్నాయక్

**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి :**

మిర్యాలగూడ సిపిఎం ఆఫీసులో జరిగిన సమావేశంలో మిర్యాలగూడ డివిజన్ అధ్యక్షుడు ఏం.జగన్ నాయక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాలలో వరుసగా ఫుడ్ పాయిజన్ల ఘటనలు అయి రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీ బీసీ పేద మధ్యతరగతి విద్యార్థులు అనారోగ్యాల పాలవుతూ ఆసుపత్రులకు పరిమితమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గురుకులాలలో ఫుడ్ ఫుడ్ పాయిజన్ అయితుంటే ఉన్నత స్థాయి అధికారులు సంక్షేమ హాస్టల్ లో హడావిడి చేస్తే గురుకులాలలో ఫుడ్ పాయిజన్ రాకుండా వుంటాయా అని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ ,బీసీ మైనార్టీ గురుకులాలకు , కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలకు టెండర్ల ద్వారా పాలు, పండ్లు, గుడ్లు స్నాక్స్, కూరగాయలు, చికెను, ప్రతిదీ టెండర్ల ద్వారా వేయడంతో టెండర్ పాడిన వ్యక్తి తనకు లాభం లేకుండా తక్కువ ధరలకు టెండర్ పాడి నాసిరకమైన పండ్లను కుళ్ళినకూరగాయలు, స్నాక్స్, డేట్ అయిపోయిన సరుకులు సరఫరా చేయడమే ప్రధానంగా గురుకులాలలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయలలో విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ కావడానికి ప్రధాన కారణమన్నారు. గురుకులాలలో ఆర్సిఓలు , జెడ్వోలు సరైన పర్యవేక్షణ లేక విద్యార్థులతో మమేకమై వారి సమస్యలను తెలుసుకోకపోవడం ప్రధాన కారణమని అన్నారు. మార్కెట్లో గుడ్డు ధర ఏడు రూపాయలు, పండ్లు50నుంచి 60రూపాయలు వుంటే , టెండర్ 30రూపాయలకు టెండర్ పాడితే , లీటర్ పాల ధర మార్కెట్లో 70 రూపాయలు ఉంటే రూ.40 కు టెండర్ పాడితే ఇలా గురుకులాలకు పంపించే ప్రతి సరుకులల్లో సగం ధరలకే టెండర్లు బాడీ నాణ్యమైన సరుకులందించడం లేదని, గురుకులాలలో నాణ్యమైన సరుకులు పండ్లు పాలు గుడ్లు, కూరగాయలు రోజులకు తరబడి నెలలకు తరబడి తెచ్చుకోని నిల్వ వుంచడం వల్ల పేద మధ్య తరగతి విద్యార్థులు గుర్రై ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సంక్షేమ హాస్టల్ లో హెచ్డబ్లుఓలూ సరుకులు రెండు, మూడు రోజులకోసారి తీసుకుని వచ్చి పెడ్తున్నారన్నారు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ ,బీసీ సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు నెలల తరబడి విద్యార్థులకు అందించవలసిన మెస్ కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయకున్నా బహిరంగ మార్కెట్లో వడ్డీలకు తీసుకొని, తమ భార్య మెడలో ఉన్న బంగారాలను సైతం బ్యాంకుల్లో కుదువ పెట్టి వసతి గృహ విద్యార్థులకు ఉన్నంతలో నాణ్యమైన భోజనం అందించడం కోసం కృషి చేయడం జరుగుతుందన్నారు. కానీ జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి అధికారులు గురుకులాలలో విద్యార్థులు ఇబ్బందులు పడుతుంటే కంటి తుడ్పు చర్యలు లాగా ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టల్ లపై కొరడా చూపుతే ఫలితాలు రావన్నారు. తక్షణమే గురుకులాలలో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో టెండర్ల ద్వారా వచ్చే ప్రతి టెండర్ దారులతో రాష్ట్రస్థాయిలో జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీ వేసి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు నెలల వారీగా మెస్, కాస్మోటీక్ చార్జీలు విడుదల చేస్తానని చెప్పిన రాష్ట్ర సిఎం మాట నిలబెట్టుకోవాలన్నారు. భవిష్యత్తులో విద్యార్థుల మెస్, కాస్మెటిక్ చార్జీలు బకాయలు పెడితే ఎస్ఎఫ్ఐ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆకాష్, అఖిల్, కార్తీక్, అరుణ్, కిషోర్, మహేష్, కళ్యాణ్ పాల్గొన్నారు.

